ఆదివారం
06 జనవరి
2019

పేజీలు 12
సంపుటి 1, సంచిక 288

www.vijayakranthinews.com

విజయక్రాంతి

నిజం నిర్భయం నిష్పక్షం

హైదరాబాద్ | PUBLISHED SIMULTANEOUSLY FROM HYDERABAD, NIZAMABAD, KHAMMAM | VIJAYAKRANTHINEWS | రూ. 3.00



రాధిక రెబల్ 10

రఫేల్‌పై ప్రశ్నలు

సంధించిన రాహుల్

ట్విటర్ వేదికగా మోదీకి సవాల్



ఢిల్లీ: రఫేల్ వివాదంపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ పట్టు వీడటం లేదు. తమ పార్టీ అధికారంలోకి వస్తే, తక్షణమే రఫేల్ డీల్ పై క్రిమినల్ విచారణ జరిపిస్తామంటూ ప్రకటించి 24 గంటలు గడవకముందే రాహుల్ ట్విటర్ వేదికగా మరోసారి సవాల్ విసిరారు. రఫేల్ ఒప్పందంపై తాను అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పట్లేదని, మీరు కూడా ఈ ప్రశ్నలను అడగండి అని రాహుల్ గాంధీ దేశ ప్రజలను కోరారు. కేంద్ర రక్షణమంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో రఫేల్‌పై సుదీర్ఘ ప్రసంగం చేస్తూ.. కాంగ్రెస్ పై విమర్శల వర్షం కురిపించారు. నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలపై నేడు మరోసారి స్పందించిన రాహుల్.. ట్విటర్ వేదికగా కేంద్రాన్ని దుయ్యబట్టారు.

'రక్షణమంత్రి పార్లమెంట్లో 2 గంటల పాటు ప్రసంగించారు, కానీ నేను అడిగిన రెండు సులువైన ప్రశ్నలకు మాత్రం ఆమె సమాధానం చెప్పలేకపోయారు. ఇప్పుడు ఈ ప్రశ్నలకు ప్రతి ఒక్క భారతీయుడు.. ప్రధాని మోదీ, ఆయన మంత్రులను అడగాలి' అని రాహుల్ ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా పార్లమెంట్లో రాహుల్ అడిగిన ప్రశ్నలకు సంబంధించిన ఓ వీడియోను కూడా షేర్ చేశారు.

రఫేల్ వ్యవహారానికి ప్రధాని మోదీదే బాధ్యత అని రాహుల్‌గాంధీ ఆరోపించారు. విపక్షాల విమర్శలకు రక్షణ మంత్రి నిర్మాలా సీతారామన్ దీటుగా స్పందించారు. దాదాపు 2 గంటల సేపు అంశాల వారీగా వివరణ ఇచ్చారు. కుంభకోణం అనడానికి ఇదేమీ బోఫోర్స్ కాదని, దేశ ప్రయోజనాల దృష్ట్యా తీసుకున్న నిర్ణయమని స్పష్టం చేశారు.

యూపీలో కాంగ్రెస్‌కు బీపీ

- హస్తానికి షాకిచ్చిన మాయావతి, అఖిలేష్ యాదవ్
- రాజకీయ వైరాన్ని వీడి ఒక్కటి కానున్న ఎస్పీ, బీఎస్పీ
- చెరో 37 లోక్‌సభ స్థానాలకు పోటీ చేయనున్న రెండు పార్టీలు
- కీలకంగా మారిన అమేథీ, రాయ్‌బరేలీ స్థానాలు
- మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో బీఎస్పీని పక్కనబెట్టడమే కారణమా..?



విజయక్రాంతి, ఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల ముంగిట్లో కాంగ్రెస్ పార్టీకి పెద్ద షాక్..బీజేపీ వ్యతిరేక కూటమి కట్టి రానున్న ఎన్నికల్లో ఎన్డీయే పక్షాలను దెబ్బతీద్దామనుకున్న రాహుల్ యత్నాలకు ఆదిలోనే హంసపాదు పడింది. పార్లమెంటులో అధికారం దక్కించుకోవాలంటే అందరూ ఆశగా చూసే ఉత్తరప్రదేశ్‌లో ఒక్కసారిగా రాజకీయ పరిస్థితి మారిపోయింది. దేశంలోనే అతిపెద్ద రాష్ట్రంగా పేరున్న ఉత్తరప్రదేశ్‌లో గెలిచే పార్లమెంటు స్థానాలను బట్టే.. హస్తినలో అధికారం ఎవరిదనే విషయం డిసైడవుతుంది. అందుకే, 80 లోక్‌సభ స్థానాలున్న యూపీలో.. అత్యధిక స్థానాలు కైవసం చేసుకునేందుకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రణాళికలు రచిస్తుంటాయి. గత ఎన్నికల్లో బీజేపీ భారీ సంఖ్యలో ఎంపీ స్థానాలు గెలుచుకుని అధికారంలోకి వచ్చింది. అప్పటికే అక్కడ అధికారంలో ఉన్న సమాజ్వాది పార్టీ కేవలం ఐదు ఎంపీ సీట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. మాయావతి నేతృత్వంలోని బీఎస్పీ ఏమాత్రం ప్రభావం చూపలేకపోయింది. అయితే గత సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ఈ సారి మాత్రం తమకు అనుకూలంగా వస్తాయని ఇటు మాయావతి, అటు అఖిలేష్ యాదవ్‌లు భారీ అంచనాలు వేస్తున్నారు.

విభేదాలు వీడి ఒక్కటి కానున్న ఎస్పీ, బీఎస్పీ

ఎలాగైనా ఈసారి బీజేపీని యూపీలో నిలువరించాలని భావించిన సమాజ్వాది, బహుజన్ సమాజ్వాది పార్టీలు.. రాజకీయవైరాన్ని వీడి ఒక్కటయ్యాయి. మొత్తం 80 సీట్లలో చెరో 37 స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయించాయి. మిగతా స్థానాలను ఇతర చిన్నాచితక పార్టీలకు వదిలేయాలని డిసైడయ్యాయి. ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లోనూ ఎస్పీ, బీఎస్పీలు ఫాలో అయిన ఈ ఫార్ములా... మంచి ఫలితాలనే ఇచ్చింది. అందుకే అదే దారిలో వెళ్లాలని ఇరు పార్టీల అధినేతలు నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఢిల్లీలో సమావేశమైన బీఎస్పీ అధినేత్రి మాయావతి, ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్.. సీట్ల ఒప్పందంపై తుది నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. బీజేపీని ఎలాగైనా నిలువరించాలని భావిస్తున్న ఎస్పీ, బీఎస్పీలు.. కాంగ్రెస్ పార్టీని సంప్రదించకుండానే నిర్ణయం తీసుకోవడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమవుతోంది. ఆ రెండు పార్టీలు, కాంగ్రెస్‌ను అంతగా నమ్మడం లేదని, హస్తంపార్టీతో కలిసి ముందుకెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. సమాజ్వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్, బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి శుక్రవారం ఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 2019 లోక్సభ ఎన్నికల్లో బీజేపీని ఎదుర్కొనేందుకు యూపీలో కూటమిగా ఏర్పడాలని నిర్ణయించిన ఇరువురు నేతలు సీట్ల పంపకాలపై చర్చించారు. ఒకప్పుడు ప్రత్యర్థులుగా ఉన్న వీరిద్దరూ యూపీలో బీజేపీ జోరును అడ్డుకోవడానికి వ్యూహాలు రచిస్తున్నారు. (తరువాయి 4లో)

లోక్‌సభకు ఒంటరిగా

కాంగ్రెస్ పోటీ?

లక్నో: ఉత్తర ప్రదేశ్‌లో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో సొంతంగా పోటీ చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు కాంగ్రెస్ పేర్కొంది. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్‌ను పక్కన పెట్టి, ఎస్పీ. బీఎస్పీ కలిసి మహా కూటమిగా ఏర్పడేందుకు ప్రయత్నిస్తున్నట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు పీ ఎల్ పూనియా శనివారం మీడియాతో మాట్లాడారు. కూటమిగా ఏర్పడటం ముఖ్యమైన విషయం కాదని పూనియా చెప్పారు. కూటమి గురించి తాము ఎవరితోనూ మాట్లాడలేదన్నారు. సొంతంగా పోటీ చేసేందుకు తమ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

రుణ మాఫీతో

రాజకీయాలు చేయలేం

- రాజకీయం చేయాలనుకుంటే లక్ష కోట్లు రుణ మాఫీ చేసే వాళ్ళం
- అన్నదాతలను మోసం చేసే పాపానికి ఒడిగట్టను
- రైతులను కాంగ్రెస్ తప్పుదారి పట్టిస్తోంది
- పొలాలకు నీరందిస్తేనే తరాలు బతుకుతాయి
- రైతుల సామర్థ్యాన్ని పెంచే విధానాలు అనుసరిస్తున్నాం: మోడీ
- ఝార్ఖండ్‌లో పలు సాగునీటి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన



పాలము: రైతుల రుణ మాఫీపై మరోసారి కాంగ్రెస్‌ను ప్రధాని నరేంద్ర మోదీ తప్పుపట్టారు. రైతులను ఓటు బ్యాంకుగా చూస్తున్న ఆ పార్టీ రుణ మాఫీ పేరుతో వారిని తప్పుదారి పట్టిస్తోందని విమర్శించారు. శనివారం ఝార్ఖండ్ రాష్ట్రం పాలము జిల్లాలోని మండల్ డ్యాం సహా ఆరు సాగునీటి ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. అలాగే ప్రధానమంత్రి గృహ ఆవాస యోజన కింద ఐదుగురు లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పై మండిపడ్డారు. రైతు రుణమాఫీ పేరిట రాజకీయాలు చేయడాన్ని మోదీ తప్పుపట్టారు. రైతులను కాంగ్రెస్ కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తోందని, తమ పార్టీ మాత్రం ప్రజలకు తిండి పెట్టే అన్నదాతలుగా చూస్తుందని అన్నారు. కాంగ్రెస్‌కు బీజేపీకీ తేడా అదేనని అన్నారు. రుణమాఫీ పేరుతో కాంగ్రెస్‌లా తాను ఓటుబ్యాంకు రాజకీయాలకు పాల్పడంలేదన్నారు. రుణమాఫీ ద్వారా కాకుండా ఇతర పద్ధతుల ద్వారా రైతుల సామర్థ్యాన్ని (తరువాయి 4లో)

అర్హుల ఓట్లు లేకపోవడం

ఈసీ వైఫల్యమే: హైకోర్టు

విజయక్రాంతి, హైదరాబాద్: తప్పుల తడకగా ఓటర్ల జాబితాలుండటానికి రాష్ట్ర ఎన్నికల సంఘానిదే బాధ్యత అని హైకోర్టు తప్పుపట్టింది. పంచాయతీ ఎన్నికలను నిర్వహించేస్తే చిత్తశుద్ధి చాటుకున్నట్లు కాదని, ఆ ఎన్నికల్లో అర్హులందరూ ఓటర్ల జాబితాలో ఉన్నప్పుడే ఎన్నికల సంఘం పూర్తి స్థాయిలో సమర్థంగా పనిచేసినట్లు అవుతుందని ప్రకటించింది. తప్పులు లేని ఓటర్ల జాబితా రూపకల్పన చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ఎన్నికల సంఘంపై ఉందని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్ చెప్పారు. నల్లగొండ జిల్లా గుర్రంపాడు గ్రామంలోని చామలోనిబావికి చెందిన 1319 నెంబరు గల ఇంటిలోని వారిని వేరు వేరు వార్డుల్లో ఓటర్లుగా పంచాయతీ ఎన్నికల ఓటర్ల జాబితా ఉండటంపై దాఖలైన వ్యాజ్యాన్ని హైకోర్టు శుక్రవారం విచారించింది. ఆ ఇంట్లోని మంతిపల్లి దుర్గయ్య, ఆయన భార్యకు మార్తెలు యాదవమ్మ, మమతలు దాఖలు చేసిన వ్యాజ్యాన్ని విచారించిన హైకోర్టు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసింది. ఈ విధంగా ఓటర్ల జాబితా రూపొందిందంటే ఎన్నికల సంఘం వైఫల్యం చెందడమే అవుతుందని ఘాటుగా వ్యాఖ్యానించింది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటికీ ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు చేసి అర్హులందరికీ జాబితాలో చోటు ఉండేలా చేసే అధికారాన్ని ఎన్నికల సంఘం సద్వినియోగం చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈ విధంగా చేయడంలో ఎన్నికల సంఘం విఫలమైందని వ్యాఖ్యానించింది. అర్హులైన వారందరికీ ఓట్లు ఉన్నప్పుడే ఓటర్ల జాబితాకు అర్థం ఉంటుందని హైకోర్టు పేర్కొంది. అందరికీ ఓట్లు లేకుండా జాబితాను వెలువరిస్తే దానికి అర్థం లేదని వ్యాఖ్యానించింది. సరైన ఓటర్ల జాబితాను సిద్ధం చేయకుండానే ఎన్నికల నోటిఫికేషన్ వెలువరిస్తే దానికి అర్థం ఉండదని అభిప్రాయపడింది.

శాసనసభా సమావేశాలకు


అసెంబ్లీ సిద్ధం



- 16న ప్రొటెం స్పీకర్ ప్రమాణం
- 19న గవర్నర్ ప్రసంగం

విజయక్రాంతి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ తొలి సమావేశాలకు ముహూర్తం ఖరారు అయింది. శుభదినాలు, ముహూర్తాలపై అపారమైన నమ్మకం కలిగిన ముఖ్యమంత్రి ధనుర్మాసం పూర్తయి ఉత్తరాయణం ప్రారంభం అయిన తరువాత దశమి రోజు నుంచి నూతన సభా కార్యకలాపాలకు ముహూర్తంగా నిర్ణయించారు. ఈనెల 16వ తేది సాయంత్రం ప్రొటెం స్పీకర్ ప్రమాణ స్వీకారంతో ప్రారంభం అయి ఈనెల 20వ తేదీ వరకు సమావేశాలు నిర్వహించాలని శనివారం జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి ఆదేశించారు. మజ్లీస్ పార్టీకి చెందిన చార్మినార్ నియోజకవర్గం శాసన సభ్యుడు ముంతాజ్ అహమ్మద్‌ఖాన్ చేత 16వ తేదీ సాయంత్రం రాజభవన్‌లో గవర్నర్ ప్రొటెం స్పీకర్‌గా ప్రమాణస్వీకారం చేయిస్తారు. 17వ తేదీ ఉదయం 11.30 గంటలకు ప్రొటెం స్పీకర్ అధ్యక్షతన సమావేశాలు ప్రారంభం అవుతాయి. కొత్తగా ఎన్నిక అయినా శాసనసభ్యులతో ప్రమాణ స్వీకారాన్ని ప్రొటెం స్పీకర్ నిర్వహిస్తారు. ముందుగా సభా నాయకుడు అయిన ముఖ్యమంత్రి, దాని తరువాత ప్రతిపక్షనాయకుడు శాసనసభ్యులుగా ప్రమాణం చేసిన తరువాత అక్షర క్రమంలో మిగతా సభ్యులు ప్రమాణం చేస్తారు. అదే రోజు సభాపతి ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేసి నామినేషన్లు స్వీకరిస్తారు.18వ తేదీ స్పీకర్ ఎన్నిక జరుగుతుంది. (తరువాయి 4లో)

దిమాక్ ఖరాబ్



ఆర్టీసీ స్పెషల్ పండగ బాదుడు

- సంక్రాంతి కోసం 5252 ప్రత్యేక బస్సులు
- 50 శాతం ఛార్జీ పెంపు

విజయక్రాంతి, హైదరాబాద్: పండుగ పేరుతో.. ప్రయాణికులపై అదనపు భారం మోపడానికి ఆర్టీసీ సిద్ధమైంది. సంక్రాంతి పండుగకు వెళ్లే ప్రయాణికులపై 50 శాతం ఛార్జీలు పెంచుతున్నట్టు ప్రకటించింది. తెలంగాణలోని అన్ని జిల్లాలతో పాటు ఏపీకి చెందిన ప్రజలు హైదరాబాద్‌లో స్థిర నివాసం ఏర్పరుచుకున్నారు. పండుగ సమయాల్లో వారు తమ తమ స్వస్థలాలకు వెళ్లడం పరిపాటి. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకున్న ఆర్టీసీ సంస్థ.. ప్రయాణికులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేస్తున్నామంటూ.. ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడం తెలిసిందే. ఆ పేరుతో.. ప్రయాణికులపై అదనపు ఛార్జీలు వడ్డించడం మామూలే. ఈసారి కూడా సంక్రాంతి పండుగ కోసం 10వ తేదీ నుంచి 14 వరకూ ప్రత్యేకంగా 5252 బస్సులను నడిపిస్తున్నామని ఆర్టీసీ ప్రకటించింది. అయితే దూర ప్రాంత ప్రయాణికుల నుంచి అదనంగా 50 ఛార్జీలు వసూలు చేస్తామని తెలిపింది. వెళ్లేటప్పుడు ప్రయాణికులు ఎక్కువ సంఖ్యలో ఉన్నా.. తిరుగు ప్రయాణంలో బస్సులు ఖాళీగా వస్తాయని, అందుకే 50 శాతం అదనపు ఛార్జీలు వసూలు చేస్తామని రంగారెడ్డి రీజనల్ మేనేజర్ (తరువాయి 4లో)





శుభోదయం

ఓం శ్రీ గురుభ్యోనమః

శ్రీ వికంబి నామ సంవత్సరం
దక్షిణాయణం
హేమంత ఋతువు
మార్గశిర మాసం

సూర్యోదయం	: ఉ. 06:47	యోగం	: వ్యాఘాతా 26:50
సూర్యాస్తమయం	: సా. 05:55	కరణం	: నాగవ 06:58 కింస్తుఘ్న 20:05
పక్షము	: కృష్ణ పక్షం	రాహుకాలం	: సా. 04:29, 05:52
తిథి	: అమావాస్య 06:58 తదుపరి పాడ్యమి	యమగండం	: మ. 12:21, 01:44
		వర్జ్యం	: మ. 02:41, 04:28
నక్షత్రం	: పూర్వాషాడ 17:43	అమృతకాలం	: మ. 12:24, 02:21




సూక్తి సుధ

నేను ఈ భూమ్మీదకు ఎందుకు వచ్చాను? ఇక్కడ నేను చేస్తున్నదేమిటి? అనే అంశాలు వ్యక్తులు విచారణచేసుకోవాలి.

-స్వామి దయానంద సరస్వతి





తిరుప్పావై పాశురం-22

అజ్ఞణ్ మాఞాలత్తరశర్ అభిమాన
బజ్ఞమాయ్ వందు నిన్ పళ్ళిక్కట్టిల్ కీళే
శజ్ఞమిరుపార్ పోల్ వందుతలై ప్పెయ్ దోం
కిజ్ఞిణివాయ్ చ్చెయద తామరైప్పూప్పోలే
శెజ్ఞణ్ శిరిచ్చిరిదే యెమ్మేళల్ విళియావో
తిజ్ఞళు మాదిత్తియను మెలుందార్పోల్
అజ్ఞణ్ణిరణ్డు జ్ఞొణ్డు ఎజ్ఞోళ్ మేల్ నోక్కుదియేల్
ఎజ్ఞళ్ మేల్ చాబ మిళందేలో రెంబావాయ్

తిరుప్పావై 'సుందరమైన విశాలమగు పృథ్విని పాలించిన రాజులు అహంకార శూన్యులై వచ్చి, నీవు శయనించే మంచం కింద గుంపులు గుంపులుగా రాజులు చేరినట్లు వచ్చి చేరితిమి. చిరుగంట ముఖంవలె సగం విడి, సగం విడవక ఉన్న తామరపూవువలె, నీ ఎర్రని నేత్రాలను కొంచెం కొంచెంగా విప్పి మా పై ప్రసరింపచేయవా? ఆకాశ మధ్యలో సూర్యచంద్రులు ఉదయించునట్లు నీ సుందరమైన నేత్రాలను రెండింటిని మాపైపరచి చూచితివా! తప్పక అనుభవించవలసిన నీ వియోగంచే కలుగు కష్టం తీరి ఆనందం కలుగును'. అభిమాన భంగం – దేహాత్మాభిమానం తొలగుట, అనన్యార్హ శేషత్వం అనన్య శరణ్యత్వ జ్ఞానం కలుగుట. ఆరు భ్రాంతులు తొలగుట.

1. దేహమే ఆత్మ 2. నేను స్వతంత్రుడను 3. నా రక్షణను నేను చేసుకొనగలను. 4. నేను ఇతరులకు శేషభూతుడను 5. అభాస బంధువులందు బంధుత్వ బుద్ధి 6. విషయాలలో భోగ్య బుద్ధి.

ఈ ఆరు భ్రాంతులు తొలగుట. ఈ అభిమానాలు తొలగిననాడే స్వామిని చేరును. ఆచార్య కటాక్షం కూడా ఒకేసారి కాక క్రమంగా ప్రసరించును. పరమాత్మ కటాక్షం ప్రసరించిన ప్రారబ్ధం కూడా నశించును. ఈ క్రమ కటాక్షం ఆరు అభిమానాలను ఒక దాని వెంట ఒకటి తొలగించును.



– డా|| బాలుశర్మ పన్నాల (వేద పండితులు)

రోజూ బ్రహ్మముహూర్తంలో నిద్ర లేవాలి!



చాణక్యం

శ్లో|| ప్రత్యుత్థానం చ యుద్ధం చ సంవిభాగం చ బంధుషు।
స్వయం మాక్రమ్య భుక్తం చ శిక్షేచ్చత్వారి కుక్కుటాత్||

తగిన సమయాన నిద్రలేచుట, యుద్ధానికి సిద్ధపడి ఉండటం, బంధువులకు రాదగిన భాగమిచ్చుటయు, స్వయంగా ఆక్రమించుకొని లాగుకొని భుజించుటయు అను ఈ నాలుగు విషయాలను కుక్కుటము అంటే కోడి నుండి నేర్చుకోవాలంటున్నారు తమ నీతి శాస్త్రంలో చాణక్యుల వారు తెలియచేస్తున్నారు. కోడి తెల్లవారు జామున నాలుగు గంటల నుంచి ప్రతి గంటకు తాను మేల్కొని కొక్కొరొకో అని అరుస్తుంది. దాంతో తెల్లవారు జామున నాలుగు గంటలైందని మనుషులు బ్రహ్మత్వం తెలుసుకొని లేచి తమ కార్యకలాపాలకు ఉద్యుక్తులవుతుంటారు. గడియారమైనా తప్పుగా నడుస్తుందేమోగాని కోడి మాత్రం ప్రతి దినం ఒకే సమయానికి మేల్కొని కూస్తుంది. ఇదే విషయం గురించి అథర్వణ వేదంలో ఇలా ఉంది. 'ఉద్యన్ సూర్య ఇవ సుప్తానాం ద్విషతాం వర్చ ఆదదే!' అంటే ఒక వైదికవీరుడు ఇలా చెబుతున్నాడు. ఉదయిస్తున్న సూర్యుడు నిద్రిస్తున్న సోమరుల తేజస్సును హరించినట్లు, నేను కూడా శత్రువుల తేజస్సును, బలాన్ని లాగి తీసుకొంటా'నంటున్నాడు.

సూర్యోదయం తర్వాత నిద్రించు సోమరి ఎందుకునూ పనికిరాడు. అతని వద్ద ఉన్న లక్ష్మి నశిస్తుంది. లక్ష్మి అంటే కేవలం ధనం కాదు. యశస్సు(లక్ష్మి) నశిస్తుంది. ఇందువల్ల సూర్యోదయానికి ముందే నిద్ర నుంచి లేవాలి. భారతీయ సంస్కృతిలో సూర్యో దయానంతరాన్ని, సూర్యాస్తమయాన నిద్రించుట పాపంగా పరిగణిస్తోంది. భరతుడు కేకయరాజు (తాత)గారి ఇంటి నుండి వచ్చినప్పుడు తన నిర్దోషిత్వం వెల్లడించటానికి ఒట్టు పెట్టుకొనెను. అందులో ఒకటి –

ఉధే సంధ్యే శయానస్య య త్పాపం పరికల్ప్యతే।
తత్పాపం భవేత్ తస్య యస్యాఽర్యోఽసు మతే గతః||

ఎవరి అనుమతిలో ఆర్యుడైన రాముడు వనానికి బయలు దేరాడో, ఆతడు ప్రాతః సాయం సంధ్యా సమయంలో నిద్రించే వానికి ఎట్టి పాపం సంభవిస్తుందో అట్టి పాపమును అనుభవించుదురు.

– యామిజాల సుబ్రహ్మణ్యం

ధర్మ సందేహాలకు సమాధానాలు

'అశ్వత్థామ హతః కుంజరః' అని ధర్మరాజు అబద్ధం చెప్పాడు కదా! ఆ ఏనుగు ఎవరిది? అసలు ధర్మరాజు అలా చెప్పడం ధర్మవిరుద్ధం కాదా?

కౌరవపక్షం వహించి పోరాడిన మాళవేంద్రుడగు ఇంద్రవర్మకు సంబంధించినదే అశ్వత్థామ అనే ఏనుగు. ఆ ఏనుగును భీముడు చంపాడు. అశ్వత్థామ చచ్చెను – అని అరిచాడు భీముడు. ద్రోణాచార్యుడు ఆ మాట విని కూడా లెక్క చేయకుండా యుద్ధం చేస్తున్నాడు. భీముని బలవంతంతో ధర్మరాజు 'అశ్వత్థామ చచ్చెను' అనగానే ద్రోణుడు అస్త్ర సన్యాసం చేసాడు. వెంటనే ధర్మజుడు 'కుంజర' (ఏనుగు) అన్నమాట మెల్లగా పలికాడు. అస్త్రసన్యాసం చేసిన ద్రోణుడు సంహరింపబడ్డాడు.

దుర్మార్గులైన దుర్యోధనాదులను ఎదిరించలేక ద్రుపదునితో కలిగిన అవమానం అనుక్షణం గుర్తుకు వచ్చిన ద్రోణుడు రాజాస్థానం వీడలేక పోయాడు. తన ప్రియశిష్యుడు అర్జునుడికి ఎన్నోసార్లు బాసటగా నిల్చినా కురురాజ సింహాసనానికి విధేయుడిగా ఉండిపోయాడు. వశిష్ఠాది ఋషుల్లా ద్రోణుడు జీవించలేదు. క్షాత్ర ధర్మాలు తెలిసిన ఆచార్యుడు ద్రోణుడు. అయితే పాండవులు ముఖ్యంగా ధర్మరాజు ద్రోణుణ్ని చంపడం కూడా ఒక యుద్ధనీతి. లేకుంటే ద్రోణుని బలపరాక్రమాలు సామాన్యమైనవి కావు. 'ద్రోణపర్వం' పేరిట ఒక పర్వం యుద్ధపరంగా ఉన్నదంటే ద్రోణుడు ఎంత పరాక్రమవంతుడో తెలుస్తుంది. ఇక్కడ 'ధర్మవిజయం' గురించే జిజ్ఞాసువులు ఆలోచించాలి. ఈ సందర్భానికి సరిపోయే ధర్మవ్యాధుడు కౌశికునికి చెప్పిన ధర్మసూక్ష్మం.. పదిమందికి మేలు కలిగే విధంగా అబద్ధం చెప్పినప్పటికీ అది సత్యఫలాన్నే ఇస్తుంది. పదిమందికి కీడు కలిగే విధంగా నిజం చెప్పినా అది అసత్యఫలమే ఇస్తుంది.



శ్రీ తుంబురేశ్వరస్వామి

మన ఊరు–మనగుడి



శ్రీ తుంబురేశ్వరస్వామి ఆలయం..ఆ స్వామి పేరే నన్ను చాలా ఆకర్షించింది. పైగా నెట్‌లో ఆ ఆలయంలో అనేక సంగీత, నృత్యాలకి సంబంధించిన శిల్పాలు ఉన్నాయని చదివాను. అప్పటి నుంచీ ఆ ఆలయం దర్శించాలని చాలాసార్లు ప్రయత్నించాము. కానీదారి సరిగ్గా తెలియలేదు. ఒకసారి తోరణం దాకా వెళ్ళి తిరిగి వచ్చేశామని తర్వాత తెలిసింది. అందుకే, ఏదైనా చూడటానికి కూడా ప్రాప్తం వుండాలి అనిపిస్తుంది.

మళ్ళీ ఒకసారి నేను మా ఫ్రెండ్స్ మా కారులో బయల్దేరాం. ఈ మారు వేలుపుగొండ, తుంబురేశ్వరస్వామి ఆలయం అనకుండా టెక్ మల్ ఊరు పేరు జపం చేసుకుంటూ వెళ్ళాము జోగిపేటనుంచీ. దోవలో ఒక బైక్ మీద వెళ్తున్నాయన నేను అటువైపే వెళ్తున్నాను రమ్మన్నారు. తుంబురేశ్వరుడే దోవ చూపిస్తున్నాడనుకున్నాం. మొత్తానికి అనేక మలుపులు తిరిగి టెక్‌మల్ వెళ్ళాము. అక్కడికెళ్ళాక మళ్ళీ వేలుపుగొండ అంటే ఒక రోడ్డు చూపించి దానిలో 6 కి.మీ.లు వెళ్తే టి.జంక్షన్ వస్తుంది, అక్కడ ఎడమవైపు తిరిగితే ఎల్లుపేట అనే ఊరు వస్తుంది. అక్కడివారందరికీ తెలుసు, అక్కడ అడగండి అని మా తుంబురేశ్వరుడు వేరే దోవలో వెళ్ళిపోయాడు. హమ్మయ్య అనుకుంటూ ఎల్లుపేట దోవ పట్టాము.

ఇప్పుడు మాకు కనిపించిన తుంబురేశ్వరుడి మూలంగా తేలిగ్గానే ఆ ఊరు చేరుకున్నాము. కానీ రోడ్డు చాలా మలుపులు తిరిగింది. మళ్ళీ ఆ దోవలో ఎవరినీ అడగకుండా రాగలమా అనిపించింది. దోవలో చిట్కుల్ శ్రీ చాముండేశ్వరీదేవి ఆలయం 4 కి.మీ. అనే బోర్డు, ఏడుపాయలు వన దుర్గాదేవి ఆలయం బోర్డులు కనిపించాయి.

ఏ బోర్డు లేకపోయినా కొప్పోలు శ్రీ సంగమేశ్వరస్వామి ఆలయం కమాను కనిపించింది. ఇవ్వన్నీ అక్కడికి 7, 8 కి.మీల లోపే. అవ్వన్నీ మేము తిరిగినవే, అక్కడ కూడా తుంబురేశ్వరుడి అడ్రస్ ఎవరూ చెప్పలేకపోయారు..

ఎల్లుపేటలో మాత్రం దాదాపు అంతా వేలుపుగొండ గురించి చెప్పారు. దోవ చూపించారు. వాళ్ళు దోవ చూపించినా, మేము కొంచెం వేరే దోవలో వెళ్ళి ఓ పేద్ద ఊడల మఱ్ఱి చెట్టుని చూసి, ఫోటోలు తీసేసుకున్నాంలేండి అవకాశం దొరికిందిగదాని. మళ్ళీ దోవలోకి వచ్చి కొంత దూరం వెళ్ళాక అప్పుడు కనిపించిందండీ .. ఆలయం కాదు...బోర్డు. యురేకా అని, ఆ ఆలయం కనిపెట్టినందుకు అవధులు లేని సంతోషంలో మునిగి పోయా. మరి కాస్తా కూస్తా అవస్త పడ్డానా దానికోసం. ఊళ్ళోకెళ్ళాక కూడా మా దోవలో ఎక్కడా గుడి కనబడలేదు. సర్పంచ్ గారిల్లు అడిగాము. 15 ఏళ్ళ పిల్లాడు ఆయన ఇల్లు చూపించాడు. ఆయన ఊళ్ళో లేరని పిల్లలెవరో సమాధానం చెప్పారు. మేము వచ్చిన పని చెప్పి ఎవరన్నా ఆ గుడి చూపిస్తారా అని అడిగితే మాకు ఇల్లు చూపించిన అబ్బాయినే పంపించారు. ఇంతకీ ఆ అబ్బాయి పేరేమిటో తెలుసా!? చక్కనయ్య. సరే ఆ అబ్బాయిని కూడా కారులో ఎక్కించుకుని బయల్దేరాము. చక్కనయ్య చెప్పిన విశేషం ఆ ఊళ్ళో రెండు గుళ్ళున్నాయి. ఒకటి కొండమీద రాములవారి గుడి, పంతులుగారు కూడా అక్కడే వుంటారు అన్నాడు. అయితే ముందు అటే వెళ్దామన్నాము. ఊరు చివర వున్న కొండ చేరుకున్నాము. ఎక్కడా మనిషి ఛాయ లేదు. . తుంబురేశ్వరస్వామి ఆలయానికి కూడా ఆయనే పూజారి. ఆ ఆలయం గురించి చెప్పాలంటే ఆయన రావాలి. మావాళ్ళు కొండమీదకి వెళ్ళారు కానీ ఎవరూ లేరని వచ్చేశారు.

మళ్ళీ బయల్దేరి తుంబురేశ్వరాలయానికి వచ్చాము. ఒక చిన్న కొండ ముందు కారు ఆపించాడు చక్కనయ్య. నాలుగడుగులు వేశామో లేదో, చాలా ఆశ్చర్యం వేసింది. ఎందుకంటారా .. మరి అక్కడిదాకా వచ్చి మేము కనుక్కోలేక తిరిగి వెళ్ళిపోయిన ఆలయం..ఆ చిన్న కొండ ఎక్కి దిగితే అక్కడే ..ఆ ఊరు సర్పంచ్, శ్రీ పాల్ గారు చెప్పిన విశేషాలు .. పెద్ద చెరువు మధ్యలో వున్న కొండే వేలుపుగొండ అనీ, తమ గ్రామంలో ఎక్కడ చూసినా దేవతా విగ్రహాలు, నాగినుల విగ్రహాలు కనబడతాయి అన్నారు. గ్రామంలోకి ప్రవేశించటానికి ముందే పెద్ద గణపతి విగ్రహం వున్నదని, అది ఒకే రాతిలో మలచబడ్డదనీ తెలియజేశారు. పూర్వం ఆ కొండమీద ఋషులు తపస్సు చేసుకునేవారట, అక్కడనుంచి భజనలు వగైరాలు వినపడేవని పూర్వీకులు చెప్పుకుంటూ వుండేవారుట.

వెయ్యి సంవత్సరాల క్రితం ఈ ప్రాంతమంతా పెద్ద అడవి. క్రూర మృగాలు సంచరించేవి. పూర్వం ఈ ప్రాంతాలలో జైన మతం చాలా ఉన్నత స్థాయిలో వుండేది. ఆ సమయంలో బహుశా ఈ వేలుపుకొండ మీద జైన ఆలయం నిర్మించాలనుకున్నారేమో కానీ అది జరిగి వుండక పోవచ్చని ఒక అభిప్రాయం..కారణం ఆ కొండమీద పడివున్న భవన నిర్మాణానికి పనికి వచ్చే రాతి దూలాలు వగైరాలేకాక, నేటికీ చెక్కు చెదరక నిలచి వున్న మహావీరుని విగ్రహం. ఇంకా అక్కడ శివలింగం వుండే పానవట్టం, నంది విగ్రహాలు కూడా వున్నాయి. కొండ రాళ్ళ కింద శివ లింగం కూడా వుండి వుండవచ్చు. వీటిని చూడాలంటే కొండదాకా వెళ్ళి, కొండపైకి కొంత దూరం ఎక్కాలి. అంత పెద్ద చెరువులో ప్రస్తుతం నీరు లేదు. ఎప్పుడైనా నీరు వుంటుందా అని అడిగితే వుంటుంది, 4, 5 గ్రామాలకు తాగు నీరందుతుంది, ప్రస్తుతం వానలు లేక పైర్లు ఎండిపోతుంటే చుట్టుపక్కల గ్రామాల వారికి పంటలకోసం ఆ నీరు వదిలాము అని చెప్పారు. నీరు ఎక్కువగా వున్నప్పుడు వేలుపుగొండ వెళ్ళాలంటే పుట్టీల మీద వెళ్తారుట.



ఈ ఊరిలో ఎక్కడ చూసినా దేవతా విగ్రహాలు, నాగినులు చాలా లభ్యమయినాయట. అవి ఎక్కడున్నాయో ఇప్పుడు తెలియదు. ఉన్నవాటినైనా పరిరక్షించుకోవాలని ఈ సర్పంచ్ ఆశ పడుతున్నారు.

శ్రీ రామాలయం

కొండమీద వున్న ఈ ఆలయం చిన్నదే. సర్పంచ్ గారి ద్వారా తెలిసిన సమాచారం.. దీనిని దాదాపు 40 సంవత్సరాల క్రితం ఋస్తుంపేట పీఠాధిపతి శ్రీ వెంకటస్వామి అక్కడ రామాలయం వుంటే బాగుంటుందనే ఉద్దేశ్యంతో పెద్దల సహకా రంతో నిర్మించారు. అక్కడ ఏ ఆదరణ లేని పెద్ద శివలింగం వున్నది. అది ఈ ఆలయం కన్నా ముందు నుంచే అక్కడ వున్నదట. ఆ కాలం నాటి పెద్ద పెద్ద ఇటుకలు కూడా చూడవచ్చు. కొండమీద దర్గా కూడా వున్నది. కొండమీద తవ్వకాల సమయంలో కత్తులు, లోహ విగ్రహాలు బయట పడ్డాయట. కొండ మీద ఆది మానవుల రాతలు కూడా వున్నాయట. కొండమీద వున్న నీటి కుంటలో ఎప్పుడూ నీరు వుంటుంది.

ఇంక తుంబురేశ్వరాలయానికొస్తే...
(వచ్చే ఆదివార సంచికలో)

-పి.యస్.యమ్. లక్ష్మి
(అత్యధిక యాత్రా విశేషాలు రాసిన తొలి తెలుగు మహిళ)

గ్రహం అనుగ్రహం



మేషం

అందరితో సఖ్యతగా ఉంటూ చేపట్టిన పనులను లాభాలతో పూర్తి చేస్తారు. స్నేహ లాభము, విందు వినోదాల్లో పాల్గొంటారు, కొన్ని అనుకోని సమస్యలు ఏర్పడవచ్చు, జాగ్రత్తలు అవసర. స్థిర, చరాస్థి క్రయ విక్రయాలతో లాభాలుంటాయి. కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు లాభిస్తాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు కనిపిస్తున్నాయి. నూతన గృహనిర్మాణాలు ఫలిస్తాయి.


పరిహారం: శ్రీ సుబ్రహ్మణ్య స్వామిని దర్శించండి.



వృషభం

బ్యాంకు సంబంధ ఆదాయాలు పెంచుకోగలుగుతారు, వృత్తులయందు అభివృద్ధి, మీరు చేపట్టిన పనులకు కుటుంబ పెద్దల సహకారం పొందగలుగుతారు. రావలసిన బాకీల కోసం అధిక ప్రయత్నంతోపాటు ఒత్తిడి అవసరం. కుటుంబ సభ్యులతో పాటు కలసి శుభకార్యాల్లో పాల్గొంటారు. నూతన వాహనాలు కొనే ఆలోచనలు కలిసివస్తాయి. వ్యాపార విషయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి.


పరిహారం: సూర్యుడిని మందార పుష్పాలతో అర్చించండి.



మిథునం

వ్యాపార లాభాలుంటాయి. అనుకోని సంఘటనలు ఎదురవుతాయి. వ్యసనములకు బానిసలవుతారు జాగ్రత్తలు అవసరం. పెండింగులో ఉన్న వృత్తి, ఉద్యోగ పనులు చివరి దశకు వస్తాయి. చేపట్టిన పనులందు అధిక ప్రయత్నాలు అవసరం. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా వుంటుంది. వాహనయోగం ఉంది. ఆకస్మిక ధనలాభం కలుగును. కీలక విషయాల్లో జాగ్రత్తలు తీసుకోండి. నిరుద్యోగులకు ఆశాజనకంగా ఉంటుంది.

పరిహారం: పార్వతీ అమ్మవారికి కుంకుమార్చన జరిపించండి.



కర్కాటకం

దైవ సంబంధ కార్యములలో పాల్గొంటారు, అనుకోని ధన లాభం. సినిమా, టీవీ రంగాలలో పనిచేస్తున్న వారు ఆర్థిక విషయాల్లో ప్రణాళికబద్ధంగా నిర్ణయాలు తీసుకోవాలి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. అనుకోని అవకాశాలు లభిస్తాయి. వాటిని సద్వినియోగం చేసుకోవాలి. స్నేహితులతో, బంధువులతో విందు, వినోదాలలో పాల్గొంటారు. వృత్తి రీత్యా ప్రోత్సాహకరంగా ఉంటుంది.

పరిహారం: దుర్గా సప్తశ్లోక పారాయణ చేయండి.



సింహం

స్త్రీమూలక ధన లాభం, నూతన వస్త్ర లాభాలు కలుగుతాయి. జీవిత భాగస్వామితో దైవ దర్శనము చేసుకుంటారు. విద్యార్థులు చదువులందు శ్రద్ధ చూపాలి. లక్ష్యాలు నిర్దేశించుకోవడం మంచిది. సకాలంలో రావలసిన బకాయిలు వసూలు అవుతాయి. వృత్తిరీత్యా శుభకరంగా వుంటుంది. గృహంలో శుభకార్యములకు అధిక ఖర్చులు చేయవలసి వస్తుంది. నిరుద్యోగులకు, విద్యార్థులకు నూతన అవకాశాలు కలిసి వస్తాయి.


పరిహారం: రాహు గ్రహాన్ని పూజించండి.




కన్య

మీవద్ద పనిచేస్తున్న సేవకుల వలన కీర్తిని పొందుతారు, చేపట్టిన పనులయందు నిర్లక్ష్యంగా వ్యవరించడం వలన ఆటంకములు ఏర్పడుతుంటాయి. జాగ్రత్తలు అవసరం, ఇతరులతో అకారణ విరోధాలు కలుగుతాయి దూర ప్రాంతాల నుండి బంధువులరాక జరుగును. కొన్ని విషయాల్లో మిత్రులే శత్రువులుగా వ్యవహరిస్తారు. అనుకోని వార్తలు వినవలసి వస్తుంది. గృహ నిర్మాణాలు సకాలంలో పూర్తవుతాయి.

పరిహారం: పార్వతీ పరమేశ్వరుల ఆలయాన్ని దర్శించండి.




-రాయప్రోలు
మల్లికార్జున శర్మ
99890 77388



తుల

సంఘ కార్యక్రమములందు అనుకూలత ఉంటుంది, మిత్రుల సహకారము, నూతన వస్త్ర లాభం, దుబారా ఖర్చులు ఈ వారంలో ప్రధానంగా వుంటాయి. కొన్ని ముఖ్యమైన వార్తలు అందుతాయి. వ్యవహారాల్లో మాటకు విలువ పెరుగుతుంది. ఆకస్మిక ధన, వస్తు, వాహన లాభాలు కలుగుతాయి. ఆర్థిక విషయాలు ప్రోత్సాహకరంగా వుంటుంది. నిరుద్యోగులకు, విద్యార్థులకు నూతన అవకాశాలు కలిసివస్తాయి.

పరిహారం: శ్రీ రామ రక్షా స్తోత్రాన్ని పారాయణ చేయండి.



వృశ్చికం

కుటుంబ పెద్దల అనారోగ్యము ఆందోళనకు గురిచేస్తుంది . సన్నిహితుల సహకారము పొందగలుగుతారు. ప్రభుత్వ అధికారుల వలన ఇబ్బందులు కలుగును. ఒప్పందాల విషయంలో తెలివి అవసరం. ప్రయత్నిస్తే రావలసిన సొమ్మును సకాలంలో పొందుతారు. వాహన విషయాల్లో నిదానంగా వ్యవహరించాలి. వివాహ ప్రయత్నాలు మనసుకి చికాకుని కలిగిస్తాయి, విద్యార్థులు చదువులపై శ్రద్ధ వహించాలి. ఆధ్యాత్మిక కార్యాల్లో పాల్గొంటారు.


పరిహారం: గణపతిని పూజించండి.



ధనుస్సు

శుభకార్యములందు పాల్గొంటారు. మిత్ర సంతోషము కలుగుతుంది. ఉద్యోగలాభం, అనుకోని విధంగా ఖర్చులు పెరుగుతాయి. నిర్ణయాల విషయంలో తొందరపాటు పనికిరాదు. సాంఘీకపరమైన కార్యములకు దూరంగా వుండండి. ముఖ్యమైన వారితో రహస్యపు చర్చలు ఫలిస్తాయి. ఆర్థికపరమైన విషయాలు ఉత్సాహకరంగా ఉంటాయి. వివాహ ప్రయత్నాలు అనుకూలిస్తాయి.


పరిహారం: శ్రీ దత్తాత్రేయ స్వామిని దర్శించండి.



మకరరాశి

కుటుంబ మనస్పర్థలు చికాకును కలిగిస్తుంది, అధికారులతో పరిచయము ఉపయోగపడుతుంది. షేర్లు, పెట్టుబడుల విషయంలో సమీక్షల అనంతరం నిర్ణయాలు తీసుకోవడం మంచిది. ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. కుటుంబ సభ్యులతో కలసి విందూ, వినోదాలలో పాల్గొంటారు. మీ తెలివితేటలతో కష్టమైన పనులను సులువుగా చేసుకోగలుగుతారు. మత్స్య, వ్యవసాయ రంగాల్లోని వారు జాగ్రత్తలు తీసుకోవాలి.

పరిహారం: శివాలయంలో రుద్రాభిషేకం జరిపించండి.



కుంభం

ఈ వారం దూర ప్రయాణాలు చేసే సూచన. ఆర్థిక పరిస్థితులు చికాకును కలిగిస్తుంది. ముఖ్యమైన వారితో కొద్దిగా శారీరక బాధలకు గురవుతారు. బంధువుల నుండి విలువైన సమాచారాన్ని పొందుతారు. స్థిరాస్తులు, వాహనాల కొనుగోలు ప్రయత్నాలు కొంతవరకు పూర్తి అవుతాయి. స్త్రీమూలకముగా సహకారం ఉంటుంది. జీవిత భాగస్వామితో మనస్పర్థలు చోటుచేసుకుంటాయి. ఆర్థిక లావాదేవీలు జాగ్రత్తగా నిర్వహించండి.

పరిహారం: భవాని అమ్మవారిని దర్శనం చేసుకోండి.



మీనం

అన్ని రంగాల వారికి శుభకరముగా ఉంటుంది , చేపట్టిన, తలచిన పనులు అవలీలగా పూర్తి అగును, కొన్ని విషయాల్లో మాత్రం మనోవిచారము తప్పక పోవచ్చు. . ఆరోగ్యం బాగుంటుంది. దూర ప్రయాణాలు చేయవలసి వస్తుంది. అప్పులవలన ఒత్తిడి ఎదుర్కొనవలసి వస్తుంది. ధనలాభం, ఆదాయంలో వృద్ధిని పొందడం జరుగును. కుటుంబ విషయాల్లో ఆశించిన ప్రయోజనాలు చేకురుతాయి. పిల్లల ఆరోగ్య విషయాల్లో జాగ్రత్తలు అవసరం.

పరిహారం: అష్టలక్ష్మి స్తోత్రం పారాయణ చేయండి.

బైరెడ్ సంస్థలో మహిళలకు ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

విజయక్రాంతి, రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని బ్యాంకర్ల ఔత్సాహికుల అభివృద్ధి సంస్థలో గ్రామీణ నిరుద్యోగ మహిళలకు ఆరు వారాల ఉచిత ఉపాధి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ యేసేపు ఓ ప్రకటనలో వెల్లడించారు. ఫిబ్రవరి 5వ తేదీ నుంచి మార్చి 15 వ తేదీ వరకు నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమంలో 18 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్ కోర్సుకు పదవ తరగతి పాసై ఆపైన చదువుకొని ఉండాలి, జర్దోసి, మగ్గం కోర్సుకు కనీసం 8వ తరగతి చదివి ఉండాలి, కంప్యూటర్ ఎంఎస్ ఆఫీస్‌కు ఇంటర్ , ఆపైన చదవుకొని ఉండాలి. అకౌంటింగ్ ప్యాకేజికి (ట్యాలి),జిఎస్‌టీ (బికాం పాస్) అర్హులని తెలిపారు.

డ్రైవర్లను కార్మికులుగా గుర్తించండి



- తెలంగాణ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు గోపాల రాములు

విజయక్రాంతి, ముషీరాబాద్: తెలంగాణలో అసంఘటిత రంగంలో ఉన్న డ్రైవర్లను అందరిని కార్మికులుగా గుర్తించాలని తెలంగాణ రాష్ట్ర డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు గోపాల రాములు అన్నారు. శనివారం హైదరాబాద్ హిమాయత్ నగర్ బీసీ భవన్ లో తెలంగాణ రాష్ట్ర డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఆ సందర్భంగా మాట్లాడుతూ అసంఘటిత రంగంలో ఉన్న డ్రైవర్లను కార్మికులుగా గుర్తించి ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని అలానే ప్రమాద భీమాను 10 లక్షలు చేయాలని కోరారు. రాష్ట్రంలో తిరుగుతున్న ఓలా, ఉబెర్ సంస్థలను కార్మిక చట్టాల పరిధిలోకి తీసుకు వచ్చి ప్రభుత్వం క్యాబ్ డ్రైవర్ లకు న్యాయం చేయాలన్నారు. దేశవ్యాప్తంగా జనవరి 8, 9 తేదీలలో జరిగే సార్వత్రిక సమ్మెలో తమ యూనియన్ పాల్గొనడం లేదని సమావేశంలో నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జీగరి సత్యం, వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ మోయిజ్, అబ్దుల్ ఖాదర్ జిలాని,శోభన్ గౌడ్, అల్లాడి కనకయ్య, లింగాల నరసింగరావు, జి. వీరస్వామి, శ్యామ్, సర్దార్ కాన్, క్రిష్ణ నాయక్, నాగరాజు, నాను నాయక్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు జన్మదిన వేడుకలు

విజయక్రాంతి, కుత్బుల్లాపూర్: రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ,టీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు శంభీపూర్ రాజు జన్మదిన వేడుకలు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని దుండిగల్ మండల్ శంభీపూర్ గ్రామంలో ఘనంగా జరిగాయి.ఉదయం నుండి అభిమానులు టీఆర్ఎస్ కార్యకర్తలు యువనాయకుడు ఎమ్మెల్సీ రాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడానికి తన నివాసానికి చేరుకుని సంబరాలు చేసుకున్నారు. అభిమాన నాయకుడికి శుభాకాంక్షలు తెలియజేయడానికిప్రజా ప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. దీంతో శంభీపూర్ గ్రామంలో సందడి వాతవరణం నెలకోంది. నిజాంపేట నుండి కోలన్ శ్రీనివాస్ రెడ్డి, బి.హేమంత్ రెడ్డి, మద్దికుంట సంజీవ రెడ్డి, శంకర్ చౌహన్, ఎండీ జహింగీర్, తలారి యాదగిరి తదితర నాయకులు శంభీపూర్ రాజుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

మహిళలపై అత్యాచారాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ర్యాలీలు

విజయక్రాంతి, ఖైరతాబాద్: మహిళలు మరియు చిన్నారులపై అత్యాచారాలకు వ్యతిరేకంగా నిర్భయ చట్టం లాంటి ఎన్నో చట్టాలు వచ్చినా.. ఇప్పటికీ మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు ఆగడం లేదని అందుకే మహిళలపై అత్యాచారాలకు వ్యతిరేకంగా అవగాహన కల్పించేందుకు గాను డిగ్నిటీ మార్చును ముంబై నుంచి ఢిల్లీ వరకు నిర్వహిస్తున్నామని టూ అండ్ సెక్సువల్ వయోలెన్స్ అగెనెస్ట్ ఉమెన్స్ అండ్ చిల్డ్రన్స్ ఆర్గనైజేషన్ తెలిపింది. డిసెంబర్ 22 నుంచి ఫిబ్రవరి 22 వరకు నిర్వహించే డిగ్నిటీ మార్చ్ శనివారం హైదరాబాద్ కు చేరుకున్న సందర్భంగా సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ బాలల హక్కుల పరిరక్షణ జాతీయ సమితి మాజీ చైర్‌పర్సన్ శాంతా సిన్హా తదితరులు పాల్గొని మాట్లాడారు.

సాంప్రదాయక ఆహార విధానాలపై సదస్సు



విజయక్రాంతి, మెహిదిపట్నం: భారతీయ ఆహార పదార్థాల ఆవశ్యకత ను తెలియజేసి రాబోయే తరాలకు అందజేయాలని ఫ్యాప్సి(ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణా అండ్ ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రి) ప్రెసిడెంట్ సి.ఎ. అరణ్ లుహారుకా అన్నారు. ఫ్యాప్సిలో జరిగిన సాంప్రధాయ ఆహారాపదార్థాల పాత్రపై జాతీయస్థాయి సదస్సు నిర్వహించారు.తృణధాన్యాలను ఉపయోగించి పురాతన కాలం నుండి భారతదేశంలో ఆహారపదార్థాలు నిల్వ ఉంచే పద్ధతులు, వాటి ఉపయోగాలు వివరిస్తూ తృణధాన్యాల వినియోగం పెంచాలని వక్తలు తెలిపారు.ఆహార అనుబంద పరిశ్రమలకు ప్రభుత్వం ఇస్తున్న పథకాలు, సబ్సిడిలను వినియోగించుకోవాలని తెలిపారు.

ఓటు హక్కు చాలా ముఖ్యం

విజయక్రాంతి, సికింద్రాబాద్: ఓటు హక్కు ప్రతి ఒక్కరు కలిగి ఉండాలని ఓటర్ల నమోదును పకడ్బందీగా చేపట్టాలని, ఏ ఒక్కరి ఓటు తొలగిపోకుండా జాగ్రత్త పడాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్ ఆదేశించారు. సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన పోలింగ్ బూత్ లెవెల్ అధికారుల సమావేశం శనివారం సీతాఫల్‌మండీలో జరిగింది. ఈ సమావేశానికి పద్మారావు గౌడ్ హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో వేల సంఖ్యలో ఓట్లు గల్లంతయ్యాయని, గల్లంతు కాకపోతే తమ మెజారిటీ పెరిగేందుకు ఆస్కారం కలిగేదన్నారు. ప్రస్తుత దఫాగా చేపడుతున్న సవరణ ప్రక్రియలో భాగంగా ప్రతి ఓటరు పేరు నమోదయ్యేల్లా జాగ్రత్తలు తీసుకోవాలని పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా అధికారులను పార్టీ నాయకులను కోరారు.

మహిళలను వేధిస్తే షీటీంకు సమాచారం ఇవ్వండి

విజయక్రాంతి, రాజేంద్రనగర్: మహిళలు, విద్యార్థినీల రక్షణకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత షీటీంలను ఏర్పాటు చేసిందని, మహిళలను, విద్యార్థీనిలను ఎవరైన ఇబ్బంది కలిగిస్తే షీ టీం నిమిషాల్లో అందుబాటులోకి వస్తుందని, శంషాబాద్ జోన్ షీ టీం ఎస్సై దెబోరా తెలిపారు. శనివారం మైలార్‌దేవ్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు షీటీం ప్రాధాన్యత, మహిలు, విద్యార్థినీలకు బరోస కల్పించారు. ఎవరైన పోకీరీలు మహిల్ని వేధించినా, ఇబ్బందులకు గురి చేసినా, లైంగికంగా హింసించిన వెంటనే షీ టీంకు ఫిర్యాదు చేయాలన్నారు. లేదంటే 100 నెంబర్‌కు ఫోన్‌ద్వారా సమచారం ఇస్తే నిమిషాల్లోనే పోకీరీల పట్టుకోవడం జరుగుతుందన్నారు. షీటీం ప్రత్యేకతపై విద్యార్థులకు ఏర్పాటు చేసిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆమె బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు మల్లారెడ్డి, హన్మంతు, జయశ్రీ, గ్లోరీ, బాస్కర్, కేశవులు, షీటీం పోలీసులు పాల్గొన్నారు.



విజయక్రాంతి, ఎల్బీనగర్: లింగోజిగూడ డివిజన్‌లోని ఎల్బీనగర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎల్బీనగర్ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో గెలవటానికి యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు, ఎనలేని కృషి చేశారన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పగలనక, రాత్రనక కష్టపడ్డారని గుర్తు చేశారు. ఎన్నికలు అయిపోయాయని , ఎన్నికలు ముందు ఇచ్చిన వాగ్దానాలను తీర్చాల్సిన భాధ్యత మన మీద ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంటు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్యామ్‌గౌడ్, నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు సుమన్‌గౌడ్, తిలక్‌రావు, రవి ముదిరాజ్, జక్కిడి రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లు, వార్డు మెంబర్ల అర్హతలపై...
మార్గదర్శకాలు జారీ

- నామినేషన్లల్లో నేర చరిత్ర స్పష్టం చేయాలి
- ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న వారు పోటీకి అనర్హులు
- ఉమ్మడి ఆస్తులను కూడా వెల్లడించాలి
- తప్పుడు సమాచారమిస్తే అనర్హుడిగా ప్రకటిస్తారు



విజయక్రాంతి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం లోని పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయనున్న సర్పంచ్, వార్డు సభ్యులకు ఉండాల్సిన అర్హతలు, అనర్హతలపై సర్వత్రా చర్చానీయాంశమైంది. గ్రామాల్లో ఎవరికి తెలిసిన రీతిలో వారు వెల్లడిస్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులకు కూడా అర్హతలు, అనర్హతల పై పెద్దగా స్పష్టత లేదు. దీంతో సర్పంచ్, వార్డు మెంబర్లుగా పోటీ చేసే అభ్యర్థులకు ఏయే అర్హతలుం డాలనే అంశాలపై రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను జారీ చేసింది.

సర్పంచ్, వార్డు మెంబర్‌గా పోటీ చేసే అభ్యర్థులు గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితాలో తమ పేరు నమోదు చేసుకుని ఉండి 21 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి. ఏదేని గ్రామ సేవకులు (నీరడి, కావల్కా ర్, సేత్సింధి, మాచ్కురీ స్థానికంగా ఏదేని పేరుతో పిలువబడే గ్రామ పంచాయతీ సిబ్బంది), కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, స్థానిక సంస్థల ఉద్యోగులు అనర్హులు.

ప్రభుత్వ నిధుల నుంచి సాయం పొందు తున్న ఏదేని సంస్థలోని ఉద్యోగులు, శాసనసభ, పార్లమెంట్ ఉభయ సభలు ఏర్పాటు చేసిన చట్టం కింద ఏర్పాటైన ఏదైనా సంస్థ కార్యనిర్వాహక సభ్యుడు, ఉద్యోగులు వీరిలో ఎవరు కూడా పోటీ చేయరాదు. ప్రజాప్రాతి నిధ్య చట్టం కింద ఏదేని నేరానికి శిక్ష పడిన వ్యక్తి, శిక్ష విధించిన తేదీ నుంచి 6 సంవత్సరాల కాల పరిమితి వరకు పోటీకి వీలు లేదు. పౌర హక్కుల చట్టం కింద నేరానికి, నైతిక అపరాధంతో కూడిన నేరానికి శిక్ష విధించిన తేదీ నుంచి 5 సంవత్సరాల కాల పరిమితి వరకు లేదా అతడికి జైలు శిక్ష విధించబడి ఆ శిక్ష అనుభవిస్తున్నప్పుడు ముగింపు నుంచి 5 సంవత్స రాల పాటు పోటీ చేయడానికి అనర్హులు. మతి స్థిమితం లేకపోవడం, దివాళాదారుగా న్యాయ నిర్ణ యం కోసం దరఖాస్తు చేసుకునే వ్యక్తి, రుణ వి మోచన పొందని దివాళాదారులు కూడా అనర్హులు.

నగర పంచాయతీ మున్సిపాలిటీ, కార్పొరేషన్‌ల్లోని సభ్యులు, మండల పరిషత్, జిల్లా పరిషత్, గ్రామ పంచాయతీల నుంచి జీతం పొందే న్యాయవాది, ఉద్యోగం చేస్తున్న వారు అనర్హులు. రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం కంటే ఎక్కువ చెల్లించిన వాటా మూలధనం గల ఏదేని కంపెనీ లేక కార్పొరేషన్‌లోని మేనేజర్, కార్యదర్శిగా పని చేసే వ్యక్తి అనర్హుడు. భారత శిక్షాస్మృతి 9ఏ విభాగం కింద ఏదేని నేరానికి శిక్షించబడిన వారు, లంచం, దుష్ప్రవర్తనకు పాల్పడటంలో ప్రమేయం ఉన్నట్లు పేర్కొన్న వారు కూడా పోటీచేసేందుకు అవకాశం లేదు.

గతంలో ఎన్నికల్లో పోటీ చేసి నిర్ణీత గడువులో ఖర్చుల లెక్కలను దాఖలు చేయడంలో విఫలమైన వారు, పంచాయతీకి సంబంధించిన విధుల నిర్వహణ కార్యాచరణలో విఫలమైన సందర్భా ల్లో పదవి నుంచి తొలగించబడిన సర్పంచ్, ఉప సర్పంచ్ అభ్యర్థులు ఆరు సంవత్సరాల పాటు తిరిగి ఎన్నికల్లో పోటీ చేసే వీలు లేదు.

సర్పంచ్, వార్డు సభ్యుల ఆస్తులు, నేరచరిత్ర, విద్యార్హతలు తప్పని సరిగా ఎన్నికల సంఘానికి సమర్పించాలి. నామినేష న్ పత్రాలతో పాటు వాటికి సంబంధించిన వివరాలతో కూడిన అఫిడవిట్‌లను అందించాల్సి ఉంటుంది. ఆస్తుల వివరాలతోపాటు, ఉమ్మడి కుటుంబ ఆస్తులు, పోలీస్ కేసులు, కోర్టు కేసులు, శిక్షలు ఇలా అన్ని సమర్పించాల్సి ఉంది. పోటీ చేసే అభ్యర్థులు ఏదీ రహస్యంగా దాచుకోవడానికి వీలు లేకుండా ప్రతి విషయాన్ని స్పష్టం చేయాలి. ఎమ్మెల్యే అభ్యర్థి అందించే అఫిడవిట్ మాదిరిగానే సర్పంచ్ అభ్యర్థులు కూడా సమర్పించాలి. తప్పుడు సమాచారంతో నామి నేషన్ దాఖలు చేస్తే తిరస్కరించ డం జరుగుతుంది. తప్పుడు సమాచారం ఇచ్చి గెలిచిన సర్పంచ్‌ను అనర్హుడిగా ప్రకటిస్తారు.

ఈ నేపథ్యంలో సర్పంచ్ అభ్యర్థులకు అఫిడవిట్ సవాలుగా మారింది. ఇదిలా ఉండగా ఉమ్మడి రాష్ట్రంలో రూపొందించిన పంచా యతీ రాజ్ చట్టాన్ని సవరించి తెలంగాణ ప్రభుత్వం నూతన పంచాయతీ రాజ్ చట్టం 2018 రూపొందిం చింది. గ్రామ పరిపాలకుడు ఎన్నిక నుంచి గ్రామాల్లో జరపాల్సిన పాలన వరకు ఈ చట్టంలో పొందు పర్చడం జరిగింది. 2003లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం పంచాయతీరాజ్ సంస్థల్లో పోటీ చేసే అభ్యర్థులు నేర చరిత్ర, ఆదాయం, వ్యయాలు, ఉమ్మడి ఆస్తులు, విద్యార్హతలతో కూడిన సమా చారన్ని నామి నేషన్ పత్రాలతో సమర్పించి బహిరంగ పర్చాలనే నిబంధన పెట్టింది. ఆ పత్రాలపై సర్పంచ్, వార్డు సభ్యుడిగా పోటీ చేసే అభ్యర్థి సంతకంతో పాటు మరో ఇద్దరు సాక్షులతో సంతకం చేయించి డిక్లరేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు సమర్పించాలి.

అధికారులు సమన్వయంతో పని చేయాలి: సీఎస్ ఎస్.కె. జోషి

- పంచాయతీ ఎన్నికలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

విజయక్రాంతి, హైదరాబాద్: మూడు విడుతలలో జరుగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా , ప్రశాంత వాతావరణంలో జరిగేలా జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎస్‌పీలు, కమీషనర్లు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్ కె జోషి కోరారు.శనివారం సచివాలయం నుండి రాష్ట్ర ఎన్నికల కమీషనర్ నాగిరెడ్డి, డిజిపి మహేందర్ రెడ్డి లతో కలసి పంచాయతీ ఎన్నికల సన్నద్దతపై జిల్లా కలెక్టర్లు, ఎస్ పీ లతో ప్రధాన కార్య దర్శి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని పంచాయతీ ఎన్నికలకు పకడ్బంది ఏర్పాట్లు చేయాలన్నారు. అధికారులు అందరు సమన్వయంతో పనిచేయాలని. అధికారి వివరాలను పోలింగ్ సిబ్బందికి తెలపాలన్నారు. రాష్ట్ర ఎన్నికల కమీషనర్ నాగిరెడ్డి మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సిబ్బంది, పోలింగ్ మెటీరియల్ , సెక్యూరిటి ప్లాన్ , వాహనాలు, పోలింగ్ స్టేషన్లు, కౌంటింగ్ హాళ్లు, డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్ , స్టోరేజ్ సెంటర్ల గుర్తింపు , బడ్జెట్ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లకు సూచనలు ఇచ్చారు.

25 రోజులలో ఎన్నికలు పూర్తి కావలసి ఉన్నందున కలెక్టర్లు పూర్తి సన్నద్దంగా ఉండాలన్నారు. గ్రామ పంచాయతీలలో మొదటి , రెండవ విడత ఎన్నికలు జరిగే గ్రామ పంచాయతీలకు రిటర్నింగ్ అధికారుల నియామకం , ప్రిసైడింగ్ అధికా రులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు మొదటి దశ శిక్షణ , కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ , మైక్రో అబ్జర్వర్ల నియామకం, మండలాలకు అబర్వర్ల నియామకం తదితర అంశాలపై సమీక్షించారు. పోలింగ్ మెటీరియల్ ను సిద్దంగా ఉంచుకోవాలన్నారు. ఓటరు స్లిప్పుల ప్రింటింగ్ , డిస్ట్రిబ్యూషన్, బ్యాలట్ పేపర్ల ప్రింటింగ్, పెపర్ సీల్స్ అవసరమైన వన్నీ సిద్దంగా ఉంచుకొని పంపిణీ చేయాలన్నారు.డీజీపీ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఎస్ పి లందరికీ అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించిన అనుభవం ఉందని అన్నారు. అధికారుల మధ్య మంచి కమ్యూనికేషన్ ఉండాలన్నారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్ రాజ్ , హోం శాఖ ముఖ్యకా ర్యదర్శి రాజీవ్ త్రివేది, పంచాయతీ రాజ్ కమీషనర్ నీతూ ప్రసాద్ పాల్గొన్నారు.

నెలాఖరుకు ఉప్పల్ మినీ శిల్పారామం ప్రారంభం

- వేగంగా జరుగుతున్న పనులు



విజయక్రాంతి, ఉప్పల్: హైదరాబాద్ విశ్వ నగరంగా అభివృద్ధి చెందుతోంది. జనాభా కోటిని దాటింది. నగర ప్రజలకు ఆహ్లాదాన్ని పంచడం కోసం ప్రస్తుతం మాదాపూర్‌లో ఉన్న శిల్పారామానికి తోడుగా ఉప్పల్ వద్ద మరో మినీ శిల్పారామం ఏర్పాటు కానుంది. ఇందుకు సంబంధించి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించే హస్తకళా ప్రావీణ్యులు తమ చేతి పనితనానికి జీవం పోస్తూ తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన, మార్కెట్ వంటి సౌకర్యాలను కల్పిస్తోంది.

గ్రేటర్ హైదరాబాద్ శివారు ప్రాంతాల వారికి అందుబాటులో ఉండే విధంగా ఒక పక్క ఉప్పల్ భగాయత్ మరో పక్క మూసీ నది ఒడ్డున హెచ్ఎమ్‌డిఏ లేఅవుట్ మధ్యలో పది ఎకరాలలో అందమైన కళాఖండంగా మినీ శిల్పారామం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పిల్లలు ,పెద్దలు , కుటుంబ సభ్యులతో మంచి వాతావరణంలో ఉల్లాసంగా గడిపేందుకు ఏర్పా టు చేస్తున్న మినీ శిల్పారామాన్ని ఒక విభిన్న సంస్కృతీ సాంప్రదాయాల ,ఆనందాన్ని ,ఆహ్లాదాన్ని పంచే వేదికగా సంక్రాంతి నాటికి ప్రజలకు అందుబాటులోకి రానుంది. హైదరాబాదు మహానగర అభివృద్ది సంస్థ ఆద్వర్యంలో 10 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులు జరు గుతున్నాయి.హైటెక్ సిటీలోని శిల్పారామం తరహాలో హస్తకళ ప్రదర్శనకు ప్రత్యేక యాంపీ దియేటర్ దీనిలో ఒకేసారి వెయ్యిమంది తిలకించేలా , యాంపీ దియేటర్‌లో వివిద రకాల సాంస్కృ తిక కార్యక్రమాలు ,కళాకారులకోసం ప్రత్యేక గదులు నిర్మాణం జరుగుతుంది. వివ రకాల హస్తకళా వస్తువులు విక్రయానికి అనుగుణంగా 40 స్టాళ్ళను పల్లె సౌందర్యాల ముగ్గులతో తీర్చి దిద్దారు. హస్తకళా శాఖతో గర్తింపు పొందిన వారికి మాత్రమే స్టాల్స్‌లో అవకాశం ఇస్తారు. స్టాళ్లకు– ఆంపీ దియేటర్‌కు మద్య అందమైన గ్రీనరీని, మద్యలో రక రకాల పూల మొక్కలతో డిజైన్ చేశారు. పక్కనే ఉన్న మూసీని కనిపించకుండా శిల్పారామం చుట్టూ మొక్కలు పెంచుతు న్నారు. ఇక్కడికి వచ్చే పర్యాటకులకు రుచికరమైన ఆహారం అందించడానికి ఫుడ్ కోర్టులు కూడా నిర్మిస్తున్నారు. వీటితో పాటుగా మరో రెండెకరాలలో పంక్షన్ హాలు నిర్మించి అందరికీ అందుబా టులోకి తీసుకొచ్చి విందులు , వినోదాలు, రక రకాల శుభకార్యాలకు అద్దెకిస్తారు. 10కోట్ల నిధులతో పనులకు గత ఏడాది ఏప్రిల్‌లో భూమి పూజ చేసిన మంత్రి కేటీఆర్ దసరా నాటికి అందుబాటులోకి తేవాలని సూచించారు. కాని కొన్ని అనివార్య కారణాలతో పనులు ఆలస్యమయ్యాయి. 10 కోట్ల రూపాయలు హెచ్ఎమ్‌డీఏ నుండి నిధులు మంజూరి చేసింది. మినీ శిల్పారామం పనులను త్వరిత గతిన పూర్తిచేసి సంక్రాంతి పండుగ సందర్భంగా సకల సౌకర్యాలతో, హంగులతో ముస్తాబవుతోంది. శిల్పారామం ప్రారంభంతో ఉప్పల్ పట్టణ పరిసర ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందుతాయి. హైదరాబాదు ప్రజలకే కాక ఇక్కడికి వచ్చే పర్యాటకులకు , దేశ నలు మూ లలు నుండి వచ్చే హస్తకళా ప్రావీణ్యులు , తమ చేతి పనితనాన్ని ఇక్కడ ప్రదర్శిస్తారు. ఆహ్లాద వాతావరణాన్ని ఆస్వాదించడానికి వచ్చే పర్యాటకుల వలన అభివృద్ధికి సాధ్యమవుతుంది.

మూసీ ఒడ్డున నిర్మాణం– వ్యాధులు ప్రబలే అవకాశం

ఉప్పల్ మూసీ న ది ఒడ్డున కిలోమీట రు పొడవునా మినీ శి ల్పారామం నిర్మించట ం వల్ల మూసీ నది ను ండి వచ్చే మురుగు వాసనల వల్ల పర్యాటకులకు వైరల్ పీవర్‌లు, ఎలర్జీలు వచ్చే అవకాశాలు ఉన్నాయని డాక్టర్లు చెబుతున్నారు. అంశంపై ఇ.ఇ. అంజిరెడ్డిని వివరణ కోరగా ఇక్కడి నాగోల్ బ్రిడ్జి కారణంగా ,బిడ్జి పౌండేషన్ వలన మురుగు నీరు స్టోరేజి అయి వెళుతోందని ఆ నీరుని డైరెక్టు రన్నింగ్ అయ్యే విధంగా చేస్తే మురుగు వాసన రాదని చెప్పారు. ఈ విషయాన్ని హెచ్ఎమ్‌డిఏ అధికారులకు సూచించామన్నారు.



మురుగు నీటి శుద్ది ప్లాంట్

మినీ శిల్పారామం 10 ఎకరాలలో 1 కిలో మీటరు పొడవునా మూసీనది ఒడ్డున నిర్మిస్తున్నారు. పర్యాటకులకు వ్యాధులు ప్రబలకుండా ఉం డాలంటే మూసీ రిజర్వాయర్ పై ఒక మురుగు ట్రీట్ మెంటు ప్లాంట్ ను నిర్మిస్తే వచ్చే పర్యాటకులకు వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని వైద్య రంగ నిపుణులు సూచిస్తున్నారు.

ప్రతికూల పరిస్థితుల్లో జనసేన స్థాపించాను



విజయక్రాంతి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితులు ప్రతికూలంగా ఉన్న సమయంలో తాను జనసేన పార్టీని స్థాపించానని పార్టీ వ్యవస్థాపకుడు పవన్ కళ్యాణ్ అన్నారు. శనివారం ఆంధ్ర ప్రదేశ్ లోని ప్రకాశం జిల్లా జనసేన పార్టీ కార్యకర్తలు, నాయకుల సమీక్షా సమావేశంలో పవన్ మాట్లాడుతూ.. భావజాలం లేని పార్టీలు రాజ్యాలు ఏలుతున్న తరుణంలో కొత్త పార్టీ పెట్టడానికి సమయం ఆసన్నమైందని తనకు అనిపించిందని, అందువల్ల జనసేన పార్టీ ని స్థాపించానని అన్నారు. ప్రస్తుతం ఎన్నికల్లో పోటీ చేయాలంటే రెండు వేల కోట్లు రూపాయలు అవసరం అని చాలా మంది తనతో అంటున్నారని, ఇప్పుడున్న రాజకీయ పక్షాలు అందుకు సన్నద్ధంగా ఉన్నాయని చెబుతున్నారని పవన్ కళ్యాణ్ అన్నారు. 'మరి ఆ పార్టీలతో నువ్వెలా పోటీ పడతావని ప్రశ్నిస్తున్నారు. నేను వారికి ఒకటే చెబుతున్నాను. ఈ విషయంలో నాకు స్వర్గీయ కాన్షీరాం స్ఫూర్తి. రాజకీయాలు నడపడానికి డబ్బు అవసరం లేదని రుజువు చేసిన మహానేత ఆయన అని చెప్పారు.

ఐ.ఎ.పి.టి ఒలింపియాడ్‌లో శ్రీ చైతన్య విజయకేతనం

విజయక్రాంతి, హైదరాబాద్: కేంద్రప్రభుత్వం హెచ్.బి.సి యస్.ఇ ముంబయి మరియు ఐ.ఎ.పి.టి వారు సంయుక్తంగా నిర్వహించిన ఐఏపీటి ఒలింపియాడ్‌లో ఒక్క శ్రీ చైతన్య 144మంది విద్యార్థులు ఎంపికై విజయకేతనం ఎగురువేశారని శ్రీ చైతన్య స్కూల్ అకాడమిక్ డైరెక్టర్ సీమ తెలిపారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌నుండి 82 మంది విద్యార్థులు, తెలంగాణ నుండి 59మంది విద్యార్థులుమరియు బెంగుళూరు నుండి ముగ్గురు ఎంపికయ్యారని తెలిపారు. ఈవిద్యార్థులంతా ఫిబ్రవరి నెలలో జరగబోయే ఇండియన్ నేషనల్ ఒలింపియాడ్‌లో పాల్గొంటారని శ్రీచైతన విద్యాసంస్థల అధినేత డా।।బి.యస్,రావు తెలిపారు.

బీసీ రిజర్వేషన్లు పెంపు కోసం నేడు ధర్నా

విజయక్రాంతి, ముషీరాబాద్: గ్రామపంచాయితీ ఎన్నికలలో బిసి రిజర్వేషన్లను 34 శాతం కు పునరుద్దరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ లో ఉదయం 11.00 గం నుంచి భారీ ఎత్తున ధర్నా జరుపుతున్నామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య తెలిపారు. శనివారం తన కార్యాలయంలో మాట్లాడుతూ ఈ ధర్నా కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీలందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేసారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ, విద్యార్థి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ అరిగే జైపాల్ ముదిరాజ్, జాతీయ కార్యదర్శి కోలా జనార్ధన్, గణేశ్వర్ పాల్గొన్నారు.

గ్రేటర్ హైదరాబాద్ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షునిగా ఆంజనేయులు

విజయక్రాంతి, ముషీరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులుగా కె.ఆంజనేయులును బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు అర్.కృష్ణయ్య నియమించారు. ఈ సందర్భంగా విద్యానగర్ బీసీ భవన్ లో జరిగిన విద్యార్థి సంఘం కార్యవర్గ సమావేశంలో కృష్ణయ్య మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ, విద్యార్థి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ అరిగే జైపాల్ ముదిరాజ్, జాతీయ కార్యదర్శి కోలా జనార్ధన్, గణేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీలలోని సమస్యలు పరిష్కారానికి కృషిచేస్తా



విజయక్రాంతి, ఉప్పల్: 5,కాలనీలలోని వివిద సమస్యలను త్వరిత గతిన పరిష్కారం చూపుతానని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. శనివారం కాప్రా సర్కిల్‌లోని శ్రీనివాసనగర్ కాలనీ వాసుల డైరీ ఆవిష్కరణకు ముఖ్యఅతిథులుగా ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, స్థానిక కార్పోరేటర్ పజ్జూరి పావనీమణిపాల్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమం కాలనీ అధ్యక్షుడు ఏనుగు సీతారాంరెడ్డి అధ్యక్షతన జరిగింది. అనంతరం కాలనీ అసోసియేషన్ సభ్యులు కాలనీలోని పలు సమస్యలును వివరించి మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ పాతదై లీకేజులు అవటం, రోడ్లు ,మంచీనీరు పైపులైన్లు పాడయి పోయాయని, వాటిని త్వరలోనే కొత్తగా పైపులైన్లు, రోడ్లు వేసి పనులను పునరుద్దరిస్తానన్నారు. కార్పోరేటర్ పావనీ మణిపాల్‌రెడ్డి మాట్లాడుతూ వాటర్ పైప్‌లైన్లు ను డయా పెంచాలని , రోడ్లు ,వీధి లైట్లు తదితర సౌకర్యాలు చేపడతామని తెలిపారు. అనంతరం క్యాలెండర్ ఆఆవిష్కరణ చేశారు. కాలనీ అసోసియేషన్ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి , స్థానిక కారోరేటర్ పావనీ మణిపాల్‌రెడ్డి కి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాలనీ మాజీ కార్పోరేటర్ కొత్త రామారావు, కాలనీ కార్యదర్శి కుంటల కిరణ్‌కుమార్, ఏరియా కమిటీ మెంబర్ కందాడి నర్సింహారెడ్డి, టీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు మహిపాల్‌రెడ్డి, సీనియర్ సిటిజన్ అధ్యక్షుడు ఎమ్ఎన్.చారి, మొహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాయిబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు సన్మానం

ఉప్పల్ నియోజకవర్గ నాయిబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఉప్పల కృష్ణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేగా ఎన్నికైన సందర్భంగా ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎన్.బాలరాజు, వై.యాదగిరి, సిహెచ్.సంపత్, పి.నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా నరెడ్ల

విజయక్రాంతి, వరంగల్ అర్బన్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా నరెడ్ల ప్రవీణ్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఏబీవీపీ 64వ జాతీయ మహాసభలు డిసెంబర్ 27 నుంచి 30 తేదీలలో గుజరాజ్ రాష్ట్రంలోని అహ్మదాబాద్ నగరంలో ఘనంగా జరిగాయి. ఈ జాతీయ మహాసభలలో జాతీయ కమిటీని ఎన్నుకున్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లా విభాగ్ సంఘటనా కార్యదర్శిగా పనిచేస్తున్న నరెడ్ల ప్రవీణ్‌రెడ్డిని జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకున్నట్లు ఏబీవీపీ జాతీయ అధ్యక్షుడు సుబ్బయ్య మహాసభలలో ప్రకటించారు. నరెడ్ల ప్రవీణ్‌రెడ్డి 2010 నుంచి కార్యకర్తగా, 2012 నుంచి పూర్తి సమయ కార్యకర్తగా పనిచేస్తున్నారు. ఖమ్మంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా, జిల్లా కన్వీనర్‌గా పనిచేసి, ఖమ్మంలో ఏబీవీపీ పని పెంచడంలో విశేషకృషి చేశారు. 2010 సంవత్సరంలో పూర్తి సమయ కార్యకర్తగా, స్టేట్ టెక్నికల్ సెల్ కో కన్వీనర్‌గా, స్టేట్ టెక్నికల్ సెల్ కన్వీనర్‌గా, ఖమ్మం విభాగ్ సంఘటనా కార్యదర్శిగా పనిచేశారు. 2017 నుంచి వరంగల్ కేంద్రంగా వరంగల్ విభాగ్ సంఘటనా కార్యదర్శిగా పనిచేస్తూ మొన్న జరిగిన 64వ జాతీయ మహాసభలలో జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నిక్యారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు కృతజ్ఞతలు చెప్పారు. రానున్న రోజుల్లో విద్యారంగ సమస్యల పట్ల నిరంతరం పోరాడుతానని తెలిపారు.

రాజకీయాల్లో గెలుపు, ఓటమి సహజం



విజయక్రాంతి, షాదనగర్: షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలో స్థానిక ASP ఫంక్షన్ హాల్ నందు బీజేపీ పార్టీ సమీక్ష సమావేశం నిర్వహించ బడింది. రాజకీ యాల్లో గెలుపు, ఓటమిలు సహజ మని అధైర్యపడవలసిన అవసరం లేదని, రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులు పోటీ చేయాలని, కార్యచరణ రూపొందించాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న ప్రజరక్షణ పథకాలు చేరువ చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలచే ప్రయత్నం చేయాలని బీజేపీ నేత తెలగాణా విమోచన కమిటి చైర్మన్ శ్రీవర్ధనరెడ్డి గారు తెలిపారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు బి.నర్సింహ్మారెడ్డి రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మరిభూపాలాచారి, వెంకటేష్ గుప్తా, మనోహర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి

విజయక్రాంతి, ఎల్బీనగర్: చైతన్యపురి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమం హనుమాన్‌నగర్ కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సవంత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. గత ఎన్నికల్లో ఓటరు కార్డు ఉండి లిస్టులో పేరు లేని ప్రతి ఒక్కరు నమోదు చేయించుకోవాలని తెలిపారు. మంచి నాయకుడిని ఎన్నుకునే బాధ్యత యువతపై ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో శశిధర్‌రెడ్డి, నరేంద్ర చారి, జ్యోతిరెడ్డి, దేవేందర్‌రెడ్డి చంద్రకుమార్, ప్రసాద్, యశోద తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ స్పెషల్ పండుగ బాదుడు

(మొదటిపేజీ తరువాయి) యాదగిరి ప్రకటించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న 5252 బస్సులతో పాటు రెగ్యులర్‌గా తిరిగే 3400 బస్సులు యాథావిధిగా నడుస్తాయని ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లే ప్రయాణికుల కోసం 1579 సర్వీసులు నడిపిస్తున్నట్టు వెల్లడించారు. రద్దీని దృష్టిలో పెట్టుకొని కొన్ని ప్రాంతాల్లో ప్రత్యేకంగా పాయింట్లు ఏర్పాటు చేశామని చెప్పారు. ఇప్పటికే 3000 బస్సుల్లో ఆన్‌లైన్ ద్వారా టికెట్లు బుకింగ్ జరిగిందని వెల్లడించారు.

ప్రాంతాల వారిగా బస్సుల పాయింట్లు..

- జేబీఎస్ నుంచి ఉత్తర తెలంగాణకు, ఏపీకి 1656 బస్సులు
- ఎంజీబీఎస్, బెంగళూరు నుంచి ఖమ్మం, ఏపీ వైపునకు 1656 బస్సులు
- ఎల్బీనగర్ నుంచి నల్గొండ, ఏపీ వైపునకు 981 బస్సులు
- సీబీఎస్ నుంచి ఏపీకి 350 బస్సులు
- కేపీహెచ్‌బీ నుంచి 436 బస్సులు
- ఉప్పల్ నుంచి వరంగల్ వైపునకు 474 (ఇందులో ఏపీకి 20 సర్వీసులు)

యూపీలో కాంగ్రెస్‌కు బీపీ

(మొదటిపేజీ తరువాయి) కొద్దిరోజులుగా రహస్య మంతనాలు జరుపుతున్న వీరిద్దరి మధ్య తాజాగా సీట్ల పొత్తు కొలిక్కి వచ్చినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. కాంగ్రెస్ నేతృత్వం వహించే కూటమికి దూరంగా ఉండటానికి ఆయా పార్టీల అధినేతలు మొగ్గు చూపారు. న్యూఢిల్లీలోని మాయావతి నివాసంలో ఇద్దరు నేతలు భేటీ అయినట్లు తెలిసింది. సుమారు గంటన్నరకు పైగా సమావేశం జరిగింది. ఎస్పీ జనరల్ సెక్రటరీ, అఖిలేష్ యాదవ్ సన్నిహితుడు రామ్ గోపాల్ యాదవ్ చర్చలో పాల్గొన్నారు. ఉత్తరప్రదేశ్‌లో రెండు పార్టీల పొత్తు దాదాపు ఖరారు కాగా సీట్ల పంపకాలపై త్వరలో ఒక ప్రకటన విడుదల చేయనున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. రెండు పార్టీలు సమాన సీట్లలో పోటీచేయనుండగా పశ్చిమ యూపీలో బలంగా ఉన్న ఆర్ఎల్డీ లాంటి చిన్న పార్టీలను కలుపుకొని ఎన్నికల బరిలో నిలువనున్నాయి.

కూటమి ఖాయమనుకున్న కాంగ్రెస్‌కు ఆశాభంగం


తాజాగా మూడు రాష్ట్రాల్లో విజయం సాధించి ఊపుమీదున్న కాంగ్రెస్ పార్టీకి.. ఎస్పీ, బీఎస్పీలు తీసుకున్న నిర్ణయం ఊహించని షాకిచ్చింది. తాజా ఫలితాల జోష్‌తో బీజేపీ వ్యతిరేక కూటమిని ఏర్పాటు చేయడంలో స్పీడు పెంచిన కాంగ్రెస్ పార్టీ.. యూపీలో ఎస్పీ, బీఎస్పీలను కలుపుకొని ముందుకు వెళ్లాలని నిర్ణయించింది. అయితే, ఎస్పీ, బీఎస్పీల అధినేతలు మాత్రం కాంగ్రెస్‌కు ఊహించని ట్విస్టునిచ్చారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా మహాకూటమి ఏర్పాటు చేసే దిశగా కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. కూటమిలో భాగస్వామ్యం అవుతారని భావించిన ఎస్పీ, బీఎస్పీలు కాంగ్రెస్కు షాకిచ్చాయి. దేశంలో అత్యధిక లోక్‌సభ స్థానాలు ఉత్తరప్రదేశ్‌లోనే ఉన్నాయి. ప్రధాన ప్రాంతీయ పార్టీలైన ఎస్పీ, బీఎస్పీ మాత్రమే కూటమిగా ఏర్పడి సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచేందుకు నిర్ణయించాయి. ఉత్తరప్రదేశ్‌లో ఎస్పీ, బీఎస్పీలకు మంచి పట్టుంది. వాటితో జతకట్టడం ద్వారా.. లబ్ధి పొందాలనుకున్న హస్తానికి ఈ పరిణామాలు తీవ్ర పార్టీకి ఆశాభంగం కిందే లెక్క, దీనితో ఉత్తరప్రదేశ్లో కాంగ్రెస్ పార్టీది ఉత్తకథేనన్న ప్రచారం రాజకీయవర్గాల్లో జోరందుకుంది. ఎస్పీ, బీఎస్పీల కొత్త కూటమి నేపథ్యంలో.. యూపీలో రాజకీయాలు ఎలా ఉండబోతాయన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ప్రధానంగా రాహుల్ గాంధీ, సోనియా గాంధీ ప్రాతినిధ్యం వహించే అమేథీ, రాయ్‌బరేలీ పార్లమెంటు స్థానాల విషయంలో ఈ రెండు పార్టీల వైఖరి ఎలా ఉండబోతోందనేది తెలియాల్సి ఉంది. అయితే, కాంగ్రెస్ పట్ల ఎస్పీ, బీఎస్పీలు ఇలా వ్యవహరించడానికి కారణాలు లేకపోలేదంటున్నారు రాజకీయ విశ్లేషకులు. ఇటీవల మధ్యప్రదేశ్, రాజస్థాన్ ఈ రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలకు ఎస్పీ, బీఎస్పీలు మద్దతు తెలిపాయి. అయితే వారి ఎమ్మెల్యేలకు కాంగ్రెస్ పార్టీ మంత్రిపదవులను ఇవ్వలేదు. దీంతో అటు మాయావతి, ఇటు అఖిలేశ్ యాదవ్.. కాంగ్రెస్పై ఆగ్రహంతో ఉన్నట్టు తెలుస్తోంది. ఇటీవల వారు చేసిన వ్యాఖ్యలు చేసిన కూడా దాన్ని బలపరుస్తున్నాయి. మరి, యూపీలో కాంగ్రెస్ పార్టీ ఎలా వ్యవహరిస్తుందో చూడాలి. 80 ఎంపీ సీట్లున్న యూపీలో ఎస్పీ, బీఎస్పీ కలిసి పోటీచేయనుండటంతో రాహుల్ గాంధీ సారథ్యంలోని కాంగ్రెస్కు ఇది భారీ ఎదురుదెబ్బేనంటున్నారు రాజకీయ విశ్లేషకులు.

మాయావతి, ఫెడరల్ ఫ్రంట్ దిశగా అడుగులు

యూపీ పరిణామాలతో కేసీఆర్ ప్రతిపాదించిన ఫెడరల్ ఫ్రంట్ దిశగా కీలక అడుగులు పడుతున్నాయి. ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. లోక్‌సభ ఎన్నికల ముందు చోటుచేసుకున్న ఈ పరిణామాలతో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి.. కాంగ్రెస్, బీజేపీయేతర కూటమికే మొగ్గు చూపుతున్నట్టు తేలిపోతోంది. ఈ దిశగా అఖిలేశ్ యాదవ్ నేతృత్వంలోని ఎస్పీ, మాయావతికి చెందిన బీఎస్పీ మధ్య పొత్తు చర్చలు దాదాపు ముగిశాయని బీఎస్పీ నేతలు జాతీయ మీడియాకు వెల్లడించారు. మూడో కూటమి తరపున ప్రధాని అభ్యర్థికి మాయావతికి మద్దతు పెరుగుతోందని తెలిపారు.

బీసీలకు ప్రమోషన్లలో
రిజర్వేషన్లు కల్పించేవరకు పోరాటం

- బీసీ విద్యుత్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సమావేశం డిమాండ్
- ఈ నెల 7న రాష్ట్ర బీసీ విద్యుత్ ఉద్యోగుల మహాసభ



విజయక్రాంతి, హైదరాబాద్: బీసీ విద్యుత్ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, క్రిమీలేయర్ ఎత్తివేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. విద్యానగర్ బీసీ భవన్‌లో జరిగిన రాష్ట్ర బీసీ విద్యుత్ ఉద్యోగుల సంఘం విస్తృత స్థాయి సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన విచ్చేసి మాట్లాడారు. ఈ నెల 7న హైదరాబాద్ ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో సంఘం మహాసభ జరపాలని సమావేశం నిర్ణయించింది. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టడానికి చట్టపరమైన, రాజ్యంగాపరమైన, న్యాయపరమైన అవరోధాలు, అడ్డంకులు ఏమీలేవు. కేంద్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకపోవడం, బీసీ వ్యతిరేక వైఖరి అవలంభించడం మూలంగానే పెట్టడం లేదని విమర్శిచారు.

కమిషన్‌ల సిఫార్సులు బుట్టదాఖలు

రాజ్యాంగ బద్ధమైన మండల్ కమిషన్ బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని సిఫార్సు చేసింది. చట్టబద్ధమైన పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్ నాచియప్పన్ కమిటీ బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని సిఫార్సు చేసింది. ఇటీవల సుప్రీంకోర్టు ఉత్తరప్రదేశ్ రిజర్వేషన్ల కేసు సందర్భంగా జనాభా ప్రకారం ఉద్యోగుల సంఖ్య లేకపోతే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని తీర్పు చెప్పింది. అన్ని వైపుల నుంచి బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని సిఫార్సులున్నాయి. ఉంటే కానీ కేంద్ర ప్రభుత్వం ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టకుండా బీసీలకు అన్యాయం చేస్తుందని ధ్వజమెత్తారు. కేంద్రస్థాయి ఉద్యోగాలలో 54 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగాలు ఉంటే బీసీ ఉద్యోగులు కేవలం 7 లక్షల 50 వేలకే పరిమితం అయ్యారు. దేశ జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు 14 శాతం ప్రాతినిధ్యం మాత్రమే ఉంది. 71 సంవత్సరాల తర్వాత కూడా బీసీలకు న్యాయం జరగడం లేదని వాపోయారు. వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలలో, ప్రభుత్వరంగ సంస్థలు, కార్పొరేషన్లు, బ్యాంకింగ్, రక్షణ రంగం నుంచి మొదలుకొని రాష్ట్రపతి, ప్రధానమంత్రి కార్యాలయాల వరకు బీసీలకు ప్రాతినిధ్యం లేదు. బీసీ ఉద్యోగులు అటెండర్లు, వాచ్‌మెన్లుగానే మిగిలిపోతూ, గెజిటెడ్ అధికారి కాకుండానే పదవీ విరమణ పొందుతున్నారు. మండల కమిషన్ సిఫార్సు ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాలలో 27శాతం బీసీ రిజర్వేషన్లు ప్రవేశపెట్టిన 25 సంవత్సరాల తరువాత కూడా బీసీ ఉద్యోగుల శాతం పెరుగకపోవడం శోచనీయమన్నారు. ఉద్యోగుల సంఖ్య 12 శాతాన్ని దాటకపోవడం బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించకపోవడం వల్లనేని ఆరోపించారు.

బీసీలకు దేశంలో ఉన్నత పదవులేవీ

మొదటిసారి బీసీ వర్గానికి చెందిన నాయకుడు నరేంద్రమోడీ ప్రధానమంత్రి అయ్యారు. ఇప్పుడైనా బీసీలకు ఇవ్వవలిసిన న్యాయమైన వాటా ఇవ్వకపోతే పోరాటం తప్పదని హెచ్చరించారు. గతంలో పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వాలు, ఇతర పార్టీల సంకీర్ణ ప్రభుత్వాలు, బీసీలకు అన్యాయం చేశాయి. అన్నిరంగాల్లో వివక్షత చూపించి ఉద్ధేశ్యపూర్వకంగా అణిజచివేవారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెజారిటీ ప్రజలైన 56 శాతం జనాభా గల బీసీలకు దేశంలో రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిలాంటి ఉన్నత పదవులు ఇవ్వలేదన్నారు. అన్నిపార్టీలు బీసీలను కేవలం ఓట్లేసే యంత్రాలుగా వాడుకుంటున్నాయని విమర్శించారు. 56 శాతం జనాభా గల బీసీలకు దేశంలో రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీసీలకు పదవులెందుకివ్వరు అని ప్రశ్నించారు. రాజకీయంగా అసెంబ్లీ, పార్లమెంట్లలో 14 శాతం కూడా ప్రాతినిధ్యం లభించడం లేదు. దేశంలోని 29 రాష్ట్రాలలో 18 రాష్ట్రాల నుంచి ఒక్క ఎంపీ లేరంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో తెలుస్తుందన్నారు. 2,600 బీసీ కులాలు ఉండగా వాటిలో 2,550 కులాలు పార్లమెంటులో అడుగు పెట్టలేదు. అందుకే చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్లు పెట్టాలని కృష్ణయ్య పునరుద్ఘాటించారు. ఇది ప్రజాస్వామిక హక్కుగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర అద్యక్షులు కుమార స్వామి, ప్రధాన కార్యదర్శి ముత్యం. వెంకన్నగౌడ్, గుజ్జ కృష్ణ, యాదగిరి, డాక్టర్ చంద్రుడు, అశోక్ కుమార్, రవీందర్, మేఘనాథ్, నీల వెంకటేష్, అనంతయ్య, దయానంద్ తదితరులు ప్రసంగించారు.

మిషన్ భగీరథ, కాకతీయలకు..
కేంద్రం చిల్లిగవ్వ ఇవ్వలేదు

- నీతిఆయోగ్ సిఫార్సు చేసినా దిక్కులేదు
- రాష్ట్రంపై సవతి తల్లి ప్రేమ
- పద్ధతి మార్చుకోకుంటే బీజేపీకి ఓటమి తప్పదు
- 17 ఎంపీ స్థానాల్లో డిపాజిట్లు కోల్పోతుంది
- కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్



విజయక్రాంతి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం చిల్లిగవ్వ ఇవ్వలేదని టీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంపై కేంద్రం ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపుతోందని మండిపడ్డారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయకు రూ.24 వేల కోట్లు ఇవ్వాలని నీతి ఆయోగ్ కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. రాజకీయ దురుద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రంపై సవతితల్లి ప్రేమ చూపుతోందన్నారు. ఇప్పటికైనా మార్పు రాకపోవతే బీజేపీ నేతలకు మరింత ఘోర పరాభవం తప్పదన్నారు. ఇదే పక్షపాత వైఖరి కొనసాగిస్తే భాజపాకు 17 ఎంపీ సీట్లలో డిపాజిట్లు గల్లంతవుతుందన్నారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ పార్టీ ఒకే ఒక పార్లమెంటు సీటును గెలుచుకున్నదని గుర్తు చేశారు. మరో రెండు నెలల్లో జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ ఆ ఒక్క సీటు కూడా దక్కదని తెలిపారు. మిషన్ భగీరథ ప్రాజెక్టు, మిషన్ కాకతీయలను అందరూ ప్రశంసించారని, మిషన్ భగీరథకు జాతీయ స్థాయిలో అవార్డు లభించిందన్నారు. పశ్చిమ బెంగాల్, బీహార్, తమిళనాడు, ఒడిశా తదితర రాష్ట్రాల అధికారులు మిషన్ భగీరథను అధ్యయనం చేస్తున్నారని తెలిపారు. గజ్వేల్‌లో మిషన్ భగీరథ ప్రాజెక్టు తొలి దశను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారని గుర్తు చేశారు. మిషన్ భగీరథ పథకం ఆచరణాత్మకంగా ఉందని కేంద్రం పేర్కొన్నదని వెల్లడించారు. అయితే ప్రశంసలు తప్ప కేంద్ర ప్రభుత్వం నిధులు ఇచ్చేందుకు సు ముఖంగా లేదని అసహనం వ్యక్తం చేశారు.

తెలంగాణపై కేంద్రం అనుసరిస్తున్న విధానాన్ని తీవ్రంగా నిరసిస్తున్నామని అన్నారు. ఐటీఐఆర్, బయ్యారం ఉక్కు పరిశ్రమ, గిరిజన యూనివర్సిటీ, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై కేంద్రం నుంచి స్పందించడం లేదు. బయ్యారం ఉక్కు పరిశ్రమ ఇవ్వలేమని కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తే రాష్ట్ర ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందని తెలిపారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఒకరకంగా, అధికారంలోని రాష్ట్రాల్లో మరోలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. కేంద్రం నుంచి రావాల్సిన బకాయిల్లోనూ తీవ్ర జాప్యం జరుగుతుంద న్నా రు. బీబీనగర్‌కు ఎయి మ్స్ రావడంలో ఎంపీ బూర నర్సయ్య గౌడ్ కృషి ఉందని కేటీఆర్ తెలిపారు. మహారాష్ట్ర సాగునీటి పథకాలకు కేంద్ర ప్రభుత్వం ఇటీవలే రూ.3,883 కోట్లు సాయం అందించిందని గుర్తు చేశారు. ప్రధాని మోడీ బీజేపీ పాలిత రాష్ట్రాలకే ప్రధాని అన్నట్లుగా వ్యవహరిస్తు న్నా రని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పోలవరం ప్రాజె క్టుకు 95శాతం నిధులను కేంద్రప్రభుత్వం ఇస్తున్నదని, కానీ కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కేంద్రం అనుసరిస్తున్న వైఖరిని టీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంటులో నిలదీస్తారని కేటీఆర్ స్పష్టం చేశారు.

శాసనసభా సమావేశాలకు అసెంబ్లీ సిద్ధం

(మొదటిపేజీ తరువాయి) స్పీకర్‌గా ఎన్నికయిన సభ్యుడిని ముఖ్యమంత్రి, ప్రతిపక్షనాయకుడు స్పీకర్ స్థానం వద్దకు తోడ్కొని వెళ్లి సభాపతి స్థానంలో ఆశీనులు చేస్తారు. 19వ తేదీన రాష్ట్ర గవర్నర్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసింగిస్తారు. గవర్నర్ ప్రసంగం తరువాత 20వ తేదీకి వాయిదా పడుతుంది. 20వ తేదీన గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ముఖ్యమంత్రి ప్రవేశపెడతారు. ఈ తీర్మానంపై చర్చ పూర్తి అయిన తరువాత సభ ఆమోదం తెలుపుతుంది. అనంతరం సభ నిరవధికంగా వాయిదా పడుతుంది. ఇదిలా ఉండగా శనివారం ప్రగతిభవన్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కే.జోషి, శాసనసభ కార్యదర్శి నరసింహాచారి, ఇతర అధికారులతో సమావేశమై శాసనసభ నిర్వహణ తేదీలపై ముఖ్యమంత్రి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రొటెం స్పీకర్‌గా ఎవరిని నియమించాలన్న దానిపై చర్చించారు. శాసనసభలో సీనియర్ అయిన చార్మినార్ శాసనసభ్యుడు ముంతాజ్ అహ్మద్‌ఖాన్‌ను ప్రొటెం స్పీకర్‌గా నియమించాలని నిర్ణయించి ముఖ్యమంత్రి స్వయంగా ఆయనకు ఈ విషయాన్ని ఫోన్‌లో తెలియజేశారు.

ఏర్పాట్లు పూర్తి

నూతన సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి శాసన సభ ముస్తాబయింది. సభ్యుల ప్రమాణ స్వీకారంతో పాటు అక్షర క్రమంలో సభ్యులకు సీట్లు కేటాయించే పనిలో శాసనసభ సచివాలయం నిమగ్నమై ఉంది. మొత్తం శాసనసభ ప్రాంగణాన్ని అంతా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది కొత్త సభ్యులకు స్వాగతం పలుకడానికి సిద్ధమైంది. ఈ సమావేశాల్లోనే అధికార ప్రతిపక్ష పార్టీలకు కార్యాలయాలు కేటాయించే అవకాశం ఉందని తెలుస్తోంది. 119 మంది సభ్యులు గల ప్రస్తుత సభలో టీఆర్ఎస్ పార్టీ తరుపు నుంచి గెలిచిన 88 మంది సభ్యులతో పాటు, కొత్తగా పార్టీలో చేరిన ఇద్దరు ఇండిపెండెంట్లతో కలపి ఆ పార్టీ సభ్యుల సంఖ్య 90 అయింది. ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ బలం 19 కాగా ప్రజాకూటమిలో భాగస్వామ్యమైన టీడీపీ నుంచి ఇద్దరు సభ్యులు ఉన్నారు. టీఆర్ఎస్ మిత్రపక్షమైన ఎంఐఎం సభ్యులు ఏడు మంది కాగా భారతీయ జనతా పార్టీ నుంచి ఒక సభ్యుడు ఉన్నారు. ఆంగ్లో ఇండియన్ నుంచి సభ్యుడి నియామకం జరగాల్సి ఉంది. ఉమ్మడి శాసనసభ చరిత్రలో తొలిసారిగా కమ్యూనిస్టు పార్టీ అయిన సీపీఎం, సీపీఐలకు ఈ సభలో స్థానం దక్కలేదు. శాసనసభ సమావేశాల తేదీ లు ఖరారు కావడంతో సభలో అనుసరించాల్సిన వ్యూహంపై అన్ని పార్టీల శాసనసభా పక్షాలు త్వరలో సమావేశమవడానికి సన్నద్ధమవుతున్నాయి. చాలా కాలం నుంచి శాసనసభ్యులుగా ఎన్నికైన చాలామంది సీనియర్ సభ్యులకు ఈ సభలో స్థానం దక్కక పోవడం విశేషం.

శాసనసభ సమావేశాల షెడ్యూల్

- 16 సాయంత్రం ప్రొటెం స్పీకర్ గా ముంతాజ్ అహ్మద్ ఖాన్ ప్రమాణం చేస్తారు. (చార్మినార్ ఎమ్మెల్యే)
- 17న ఉదయం 11.30 గంటలకు సభ ప్రారంభం. శాసనసభ్యలచే ప్రొటెం స్పీకర్ ప్రమాణ స్వీకారం, నూతన సభాపతి ఎన్నికకు నోటిఫికేషన్, నామినేషన్ల స్వీకారం
- 18న స్పీకర్ ఎన్నిక, కొత్త స్పీకర్ అధ్యక్షతన సమావేశం.
- 19న ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం
- 20 గవర్నర్ కు ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ, ఆమోదం, సమావేశాలు ముగింపు.

రుణ మాఫీతో రాజకీయాలు చేయలేం



(మొదటిపేజీ తరువాయి) పెంచే ప్రయత్నం చేస్తున్నామని మోదీ స్పష్టం చేశారు. ప్రధానమంత్రి సించాయ్ పరియోజన కింద 99 శాతం పనులు పూర్తి చేస్తున్నామని ఆయన తెలిపారు. తాను రాజకీయం చేయాలనుకుంటే లక్ష కోట్లు రుణమాఫీ కింద రైతులకు ఇచ్చేసేవాడినని, కానీ తాను రైతులను మోసం చేసే పాపానికి ఒడిగట్టనని మోదీ అన్నారు. రుణమాఫీ చేస్తే రైతులకు కేవలం ఒక ఏడాదే ఉపశమనం ఉంటుందని, అదే లక్ష ఎకరాలకు నీరు వస్తే భవిష్యత్తులో ఎంతో మేలు చేకూరుతుందన్నారు. అన్నదాతలు అప్పుల్లో కూరుకుపోకుండా తాము పనిచేస్తున్నామని, ఓటు బ్యాంకు రాజకీయాలు కాకుండా రైతుల సామర్థ్యాన్ని పెంచే విధానాలను అనుసరిస్తున్నామని, పొలాలకు నీరందిస్తే తరాలు బతుకుతాయని మోడీ అన్నారు. ‘ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టులను పూర్తి చేసి ఉంటే రైతులు లబ్ది పొంది ఉండేవారు. రుణాలు తీసుకోవాల్సిన అవసరం వారికి ఉండేది కాదు. తొలుత రుణాలు తీసుకోవాలని రైతులను బలవంతం చేసి, ఇప్పుడు రుణ మాఫీ పేరుతో వారిని తప్పుదారి పట్టిస్తున్నారు’ అని ప్రధాని ఆరోపించారు. ఇళ్ల నిర్మాణ పథకం పేరు మార్చడంపై కాంగ్రెస్ చేస్తోన్న విమర్శలను మోదీ తిప్పికొట్టారు. ప్రధాని పేరుతోనే తాము పథకం అమలు చేస్తున్నామని, తదుపరి ప్రధాని కూడా ఈ పథకాన్ని ముందుకు తీసుకెళ్లవచ్చన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో ప్రజలకు 1 కోటి 25 లక్షల ఇళ్లు ఇచ్చిందని మోదీ స్పష్టం చేశారు.

మన్మోహన్‌సింగ్ యాక్సిడెంటల్ ప్రధాని కాదు

- పీవీ తర్వాత ఆయనే గొప్ప ప్రధాన మంత్రి
- పదేళ్ల పాటు దేశాన్ని పరిపాలించిన ఓ ప్రధానిని గౌరవించాలి
- సినిమా వివాదంపై శివసేన నేత సంజయ్ రావత్ కౌంటర్



ముంబై: మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ బయోపిక్ ‘ది యాక్సిడెంటల్ ప్రైమ్‌మినిస్టర్’పై ఓ వైపు కాంగ్రెస్, బీజేపీ మధ్య వివాదం నెలకొన్న నేపథ్యంలో ఎన్డీయేలోకి కీలకమైన శివసేన నేత సంజయ్ రావత్ ఆయనకు మద్దతుగా మాట్లాడారు. దేశానికి పదేళ్ల పాటు ప్రధానిగా పనిచేసి, ప్రజల నుంచి విశేష గౌరవం అందుకున్న మన్మోహన్ సింగ్ ను ‘యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్’ అనలేమన్నారు. ‘పదేళ్లు దేశానికి సేవ చేసిన వ్యక్తిని గౌరవించడం మన బాధ్యత. మన్మోహన్ యాక్సిడెంటల్ ప్రధాని కాదు. పీవీ నరసింహారావు తర్వాత దేశానికి సేవ చేసిన ప్రధానుల్లో మన్మోహన్ చాలా గొప్పవారు. ఆయన తన విధులను చాలా విజయవంతంగా నిర్వర్తించారు. ఆయనను ‘యాక్సిడెంటల్’ ప్రధానిగా కంటే సక్సెస్‌ఫుల్ ప్రధానిగానే చూస్తాను’ అని రావత్ అన్నారు.

ప్రముఖ బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ ప్రధాన పాత్రలో నటించిన ‘ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్’ ట్రయలర్ ఇప్పటికే విడుదల కాగా దీనిపై కాంగ్రెస్ తీవ్రంగా విమర్శించింది. యూపీఏ ఛైర్పర్సన్ సోనియా గాంధీ, ఆమె కుమారుడు ,కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీని ఈ సినిమాలో తప్పుగా చూపించారని ఆ పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సినిమాను ప్రదర్శిస్తే తర్వాత జరగబోయే పరిణామాలకు థియేటర్ యజమానులే బాధ్యత వహించాల్సి ఉంటుందంటూ మధ్యప్రదేశ్‌లోని కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి సంఘం హెచ్చరించిన సంగతి తెలిసిందే. యూపీఏ1 హయాంలో మన్మోహన్ సింగ్‌కు మీడియా సలహాదారుగా వ్యవహరించిన సంజయ్ బారు రాసిన వివాదాస్పద పుస్తకం “ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్ : ది మేకింగ్ అండ్ అన్ మేకింగ్ ఆఫ్ మన్మోహన్‌సింగ్’ ఆధారంగా తెరకెక్కిన ‘ది యాక్సిడెంటల్ ప్రైమ్‌మినిస్టర్’ సినిమా ఈ నెల 11న విడుదల కానుంది. ఈనేపథ్యంలో శివసేన నేత సంజయ్ రావత్.. బీజేపీకి ఈవిధంగా కౌంటర్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

ప్రజాఫ్రంట్ ఓటమికి కారణం జాప్యమే

- ప్రజలు ఓడారు.. కేసీఆర్ గెలిచారు..
- సీపీఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారధి

విజయక్రాంతి, మహబూబాబాద్: సాధారణ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఆలస్యంగా టికెట్ ప్రకటించడం కారణంగా అభ్యర్థులు ప్రజలలోకి వెళ్ళడానికి సమయం సరిపోలేదని, అందుకే ప్రజాఫ్రంట్ ఓటమి పాలైందని సీపీఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారధి అన్నారు. శనివారం వీరభవన్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ 100 రోజుల ముందే మోదీతో ఒప్పందం చేసుకొని ఒక ప్రణాళిక ప్రకారం ముందస్తుకు పోయారన్నారు. ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా అధికారం చలాయిస్తూ అధికారులను ఉపయోగించుకొని 21 లక్షల ఓట్లను గల్లంతు చేయించారన్నారు. 25 నుంచి 100 కోట్ల వరకు ఖర్చు చేసి అప్రజాస్వామికంగా గెలిచారని ఎద్దేవా చేశారు. పోలీసులు పట్టుకున్న సొమ్ము అంతా కూడా ప్రతిపక్ష పార్టీలకు సంబంధించినవే కావటం గమనార్హం అన్నారు. దీనికి తోడు ప్రజాఫ్రంట్ అభ్యర్థుల టిక్కెట్ల ప్రకటనలో జాప్యం జరగడం, దీనికి తోడుగా చంద్రబాబును బూచిగా చూపిస్తూ సెంటిమెంట్‌తో కేసీఆర్ అధికారం చేజిక్కించుకున్నారని దుయ్యబట్టారు. ఇది తెలంగాణ రాష్ట్రంలో టీఆర్ఎస్ పార్టీ నైతిక విజయం కాదని, ఇది కేవలం ప్రజల ఓటమి... కేసీఆర్ గెలుపుగా అభివర్ణించారు. స్థానిక ఎన్నికలలో ప్రజా స్వామ్యాన్ని ఖూనీ చేయడానికి ఏకగ్రీవం పేర మరోడ్రామాకు తెరలేపుతున్నారన్నారు. నాడు దొరలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి తమకు నచ్చిన వారిని సర్పంచ్‌ని చేశారన్నారు. నేడు అదే తంతు కొనసాగుతుందని విమర్శించారు. శాసనసభ్యులు ఏకగ్రీవం చేయడానికి 5 నుంచి 10 లక్షలు సీడీఎఫ్ ఫండ్ నుంచి ఇస్తామని అనడం అధికార దుర్వినియోగం అని, వారిపై ఈసీ చర్య తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి బి.అజయ్, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, రేషపల్లి నవీన్ పాల్గొన్నారు.

అధ్వానంగా దేవేందర్‌నగర్ కూడలి రోడ్డు



విజయక్రాంతి, కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని గాజులారామారం డివిజన్ దేవేందర్‌నగర్‌లోని కూడలి రోడ్డు అధ్వానంగా తయారైంది. చౌరస్తాలో మూడువైపుల రోడ్డు కొత్తగా నిర్మించి కూడలిలో రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గాజులారామారం నుంచి బాచుపల్లికి వెళ్లే వాహనాదారులు ఎక్కువగా ఈ మార్గం నుంచి ప్రయాణిస్తారు.

దేవెందర్‌నగర్ కూడలి రోడ్డులో గుంతలు ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంతల కారణంగా తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ ఈశ్వరయ్య , బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ తదితరులు



తెలంగాణ విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోషియేషన్ రూపొందించిన డైరీ, క్యాలెండర్‌ను రాష్ట్ర విద్యుత్ సంస్థల చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డీ. ప్రభాకర్‌రావు రవీంద్రభారతిలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు అసోషియేషన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదబీమా చెక్కులు పంపిణీ చేసిన కేటీఆర్

విజయక్రాంతి, నకిరేకల్: భువనగిరి పార్లమెంట్ సభ్యులు బూర నర్సయ్యగౌడ్ స్థాపించిన బీఎల్ఆర్ ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గంలోని చిట్యాల మండలానికి చెందిన లబ్ధిదారులకు శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో టీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్ చెక్కులు అందజేశారు. చిట్యాల మండలం పెద్దకాపర్తికి చెందిన పొట్లపల్లి అయ్యన్న, వెలిమినేడు గ్రామానికి చెందిన కన్నెబోయిన రమేష్‌లకు ప్రమాద బీమా క్రింద చెరొక రూ.5లక్షల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బూర నర్సయ్యగౌడ్, మాజీ శాసన సభ్యులు వేముల వీరేశం, మార్కెట్ కమిటీ ఛైర్మన్ కటకం వెంకటేశం, నాయకులు గోలి గణేష్, పల్లపు బుద్ధుడు, నాగరాజు, బత్తుల శ్రీరంగం, నీలకంఠ నరేష్, పొట్లపల్లి చిన్నస్వామి, పొట్లపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ప్రజారక్షణ కోసమే పోలీసు వ్యవస్థ..

- వీడియో కాన్ఫరెన్సులో రాష్ట్ర డీజీపీ ఎం మహేందర్ రెడ్డి

విజయక్రాంతి, సిరిసిల్ల: పన్ను రూపేన ప్రజల నుంచి వచ్చే సొమ్ముతో జీతాలుగా తీసుకుంటున్నామని రాష్ట్ర డీజీపీ ఎం.మహేందర్ రెడ్డి జిల్లా పోలీసులకు వీడియో కాన్ఫరెన్సులో సూచించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడారు. గడచిన నేర నివేదిక ప్రకారం క్రైమ్ రేట్ తగ్గడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహించినందుకు వారిని ప్రశంసించారు. ప్రతి పోలీసు అధికారి నీతి నిజాయితీతో నిబద్ధత కలిగి ఉండాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల రక్షణ కోసం సీఎం కేసీఆర్ అత్యాధునిక వాహనాలను పోలీసు శాఖకు కేటాయించారని ఆయన ఆ యాలకు అనుగుణంగా న్యాయం చేయాలని సూచించారు. ప్రతి స్టేషన్‌లో ఫిర్యాదుదారుడి పట్ల మాట్లాడే విధానం, అతని సమస్యను అర్థం చేసుకోవడం వంటి అంశాలపై తప్పని సరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ పిట్టీకేసు, ఈ–చలాన్, ఎన్ఫోర్స్‌మెంట్ లాంటి పిట్టీ కేసుల ద్వారా చిన్న చిన్న నేరాలను అరికట్టేందుకు వీలై, పెద్ద నేరాలను కూడా అదుపులోకి వస్తాయన్నారు. సమావేశంలో జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే, డీఎస్పీ వెంకటరమణ, నరహరి, మొగిలి, శ్రీనివాస్, అనిల్ కుమార్, వెంకటస్వామి, రఘు చందర్, విజయ్ కుమార్, రవీందర్, బన్సిలాల్, రజనీకాంత్, సుబ్రమణ్యం నాయుడు, ఎస్ఐలు పాల్గొన్నారు.

సాగర్ నీరందక ఎండుతున్న మొక్కజొన్న

- రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం

విజయక్రాంతి, మధిర: ఖమ్మం జిల్లా పరిధిలోని 17 మండలాల్లో వ్యవసాయ సాగుకోసం నాగార్జునసాగర్ కాలువలపైనే రైతులంతా ఆధారపడతారు. ఈ ఏడు ఖరీఫ్ పంటలకు కాలం అనుకూలించక పోవడంతో దిగుబడుల్లేక రైతులు నష్టాలు మూటకట్టుకున్న విషయం అందరికీ తెలిసిందే. రబీలో అదీ మొక్కజొన్న వంటి ఆరుతడి పంటల సాగుకు ఎంతో ఆశతో రైతులు వేలల్లో పెట్టుబడులు పెట్టి ఉపక్రమించారు. కాగా సాగర్ నీరు పాలేరు జలాశయం దాటి కిందకి వదిలేది లేదని అధికారులు ప్రకటించడంతో ఈ ప్రాంత రైతాంగానికి అశనిపాతంగా మారింది. మొక్కజొన్న సాగు విత్తువేసిన అనంతరం మొక్క దశలో ఉన్న సమయంలోనే కత్తెర పురుగు పైరుపై పడింది, దాదాపు మూడుమార్లు పంటపై పలురకాల మందులు పిచికారి చేస్తేనే పంటను కాపాడుకోవడం గగనంగా మారింది. ఆ దశలను దాటి పైరు చేతికొచ్చిన ఊపిరి పీల్చుకుంటున్న రైతులకు నీటిఎద్దడి పెనుభూతంలా మారింది.



లక్షలాది ఎకరాల్లోని సాగు ప్రశ్నార్థకం..

జిల్లాలోని 17 మండలాల్లో 2.76 లక్షల ఎకరాలకు సాగర్ రెండోజోన్ ద్వారా సాగునీరు అందించడం జరుగుతోంది. కాగా సాగర్ జలాశయంలో నీరు తక్కువగా ఉందనే సాకుతో కేవలం పాలేరు జలాశయం పరిధిలోని భూములకు మాత్రమే సాగునీరు సరఫరా చేసి కిందికి రానీయమని తాఖీదు అధికార్లు ప్రకటించడంతో ఈ ప్రాంత రైతులు లబోదిబోమంటున్నారు. ఇప్పటికే ఒక్కో ఎకరా మొక్కజొన్న పంటకు రూ.20 నుంచి 25 వేల మేర పెట్టుబడి అయింది, కారణం కత్తెర పురుగు పంటను ఆశించడమే. అలానే పెరిగిన డీజిల్ ధరల కారణంగా దుక్కిఖర్చులు కూడా పెరిగాయి, అలాగే ఎరువుల ధరలు కూడా 40 శాతం మేర పెరిగాయి. వీటన్నింటికీ తోడు కూలీ రేట్లుకూడా పెంచేశారు. దీంతో రైతుకు సాగు వ్యయం రెట్టింపు అయింది, మొక్కజొన్న సాగులో ఆరుతడులు వేస్తే సరిపోతుంది. అంటే 90 రోజుల కాలంలో ఇప్పుడున్న చలి వాతావరణం ఒకటి ఆరా ఉంటే తడి తక్కువైనా పర్లేదు కానీ అసలు నీరే రాదని చెప్పడంతో పాటుగా ఒక్కసారిగా నీటిని బంద్ చేయడంతో కాల్వలు నెర్రెలిచ్చాయి. దీంతో చింతకాని మండలంలోని పలు గ్రామాల్లో పంట నిలువునా ఎండిపోయే ప్రమాదం అంచున ఉంది. చింతకాని మండలంలోని పలు చోట్ల రైతులు తమ పంటల్ని కాపాడేందుకు గాను సాగర్ నీటిని విడుదల చేయాలని రోడ్డెక్కి వచ్చి నిరసనలు తెలిపారు. ఆరుతడి పంటగా సాగు చేస్తున్న మొక్కజొన్నకు కనీసం వారబందీ పద్ధతిలో విడతల వారీ అయినా నీటిని వదిలి రైతుల్ని ఆదుకోవాలని వీరు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయాన్ని స్థానిక శాసనసభ్యుడు భట్టివిక్రమార్క ప్రభుత్వప్రధానకార్యదర్శికి లేఖద్వారా తెలియపర్చడంతో పాటుగా సమస్య తీవ్రతను స్వయంగా కలిసి వివరించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పంటలను కాపాడేందుకు సాగర్ నీటిని విడతల వారీగానైనా వదలాలని కోరారు.



ఆల్ఫోర్స్ సీబీఎస్ఈ పాఠశాలకు ఇంటర్ అనుమతి

విజయక్రాంతి, కరీంనగర్: కరీంనగర్‌లోని స్థానిక ఆల్ఫోర్స్ సీబీఎస్ఈ పాఠశాలకు ఇంటర్మీడియట్ స్థాయి విద్యను అందించడానికి ఢిల్లీలోని కేంద్ర కార్యాలయం నుంచి అనుమతులు పొందడం జరిగిందని ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం నగరంలోని స్థానిక వావిలాలపల్లిలోని ఆల్ఫోర్స్ ఈ టెక్నో ఏసీ కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆల్ఫోర్స్ హైస్కూల్ సీబీఎస్ఈకి సంబంధించి 2015వ సంవత్సరంలో నర్సరీ నుండి 10వ తరగతి వరకు అనుమతి పొందడం జరిగిందని అన్నారు. పాఠశాలలో పాటిస్తున్న ప్రమాణాలను దృష్టిలో పెట్టుకొని ఢిల్లీలోని కేంద్ర కార్యాలయం వారు వచ్చే విద్యా సంవత్సరం 2019–20 నుంచి ఇటంటర్మీడియట్ స్థాయి (10+2) విద్యను అందించడానికి అన్ని రకాల అనుమతులు కల్పించడం జరిగిందని తెలిపారు. చాలా మంది తల్లిదండ్రులు వారి పిల్లలకు సీబీఎస్ఈ విద్యను అందించడానికై దూర ప్రాంతాలకు వెళ్తారని, వారు ఇప్పుడు అటువంటి అసౌకర్యాన్ని ఎదుర్కోకుండా అత్యుత్తమ వసతులతో ఆల్ఫోర్స్ సీబీఎస్ఈ పాఠశాల ద్వారా వారి పిల్లలకు నాణ్యమైన విద్యను అందించవచ్చని తెలిపారు. ఈ అనుమతి పొందడం చాలా హర్షదాయకమని కేవలం 160 సీట్ల పరిమితితో మాత్రమే వచ్చే విద్యా సంవత్సరం నుండి తరగతులు ప్రారంభించడానికి అన్ని ప్రమాణాలను పాటించి సన్నాహాలు చేయడం జరిగిందని తెలిపారు. నేటిపోటీ ప్రపంచంలో విద్యా విదానంలో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయని భోధనా పద్దతులు ఎప్పటికప్పుడు మారుతున్నాయని, ప్రత్యేకంగా విద్యార్థులందరూ ప్రాథమిక దశ నుండే సీబీఎస్ఈ విద్యను పొందుదామనే ఉత్సాహతను ప్రదర్శిస్తున్నారని అన్నారు. అంకిత భావంతో విజయాన్నే లక్ష్యంగా చేయడానికి సంసిద్ధతతో ఉన్నటువంటి నిష్ణాతులైన అధ్యాపకులచే విద్యార్థులకు ఎంపీసీ, బైపీసీ కోర్సులు ప్రవేశపెట్టడం జరుగుతుందని అన్నారు.ఎంపీసీ విద్యార్థులు అటు ఐఐటీ లేదా ఐఏఎస్ ఫౌండేషన్ పొందవచ్చని, బైపీసీ విద్యార్థులు నీట్ ఫౌండేషన్ పొందవచ్చని అన్నారు. విద్యార్థులకు అహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించి అత్యుత్తమ విద్యను అందించి వివిధ పోటీ పరీక్షల్లో సంచలన విజయాలను నమోదో చేయడమే లక్ష్యం కాకుండా సమాజంలో అగ్రగామిగా నిలిచేటట్టుగా కృషిచేస్తామని జిల్లా ప్రజలందరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం ఆల్ఫోర్స్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

ఎంపీ కవితను కలిసిన కోరుట్ల కౌన్సిలర్లు

విజయక్రాంతి, కోరుట్ల: జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గ కేంద్రానికి చెందిన కొందరు మున్సిపల్ కౌన్సిలర్లు శనివారం నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవితను హైదరాబాద్‌లో కలిశారు. అధికార పార్టీకి చెందిన సిట్టింగ్ చైర్మన్ శీలం వేణుగోపాల్‌పై అసంతృప్తితో ఉన్న స్వపక్ష సభ్యులు ఎంపీని కలిసి అవిశ్వాసం గురించి మొరపెట్టుకున్నట్లు సమాచారం. స్వపక్ష సభ్యులతో పాటూ మొత్తం 24మంది సభ్యులు సంధించిన అవిశ్వాస అస్త్రంలో భాగంగా ఈ నెల 19న బలపరీక్షకు ముహూర్తం ఖరారైంది. ఈ క్రమంలో 'తమలో చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించడానికి సిద్ధంగా ఉన్న సభ్యునికి మీ ఆశీస్సులు కావాలి' అని కొందరు స్వపక్ష సభ్యులు ఎంపీ కవితను కోరినట్లు సమాచారం. మొత్తం మీద కోరుట్ల బల్దియాలో రాజుకున్న అవిశ్వాస చిచ్చు ఎటువైపు దారి తీస్తుందో, ఏ మలుపు తిరుగుతుందో అన్న ఉత్కంఠ స్థానికంగా కొనసాగుతున్నది.



ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవాలి

- సీఐటీయు జిల్లా కార్యదర్శి శీతల రోషపతి

విజయక్రాంతి, హుజూర్‌నగర్: ప్రభుత్వ రంగ సంస్థలను బీఎస్ఎన్ఎల్‌ను కాపాడుకునేందుకు జనవరి 8, 9 తేదీలలో దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి శీతల రోషపతి కోరారు.ఈ సందర్భంగా స్థానిక బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులను కేంద్రంలో బిజేపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని,అధికారంలోకి వచ్చిన బీజేపీ నాలుగున్నర సంవత్సరాలలో లాభాలలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను నష్టాల పాలు చేసిందని, 1991 నుంచి ఇప్పటివరకు జరిగిన ప్రైవేటీకరణలో కేంద్ర ప్రభుత్వానికి వచ్చిన సొమ్ము 3,62,687 కోట్లు కాగా, ఇందులో 58 శాతం అమ్మకం 2,09,896 కోట్లని అన్నారు. వామపక్ష ప్రజాస్వామ్య శక్తులందరూ ఏకమై దేశ సంపదను ప్రజల కష్టార్జితాన్ని దోచిపెట్టే పెట్టుబడి దారుల స్వదేశీ,విదేశీ వారిని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక బీఎస్ఎన్ఎల్ యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, రాంబాబు, మంగతాయారు, సాంబశివరావు, నాగయ్య, పద్మ, శంకర్, రాములమ్మ, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

శబరిమల పవిత్రత కాపాడాలంటూ 'దీపోత్సవం'

విజయక్రాంతి, కోరుట్ల: కేరళ రాష్ట్రంలోని సుప్రసిద్ధ శబరిమల క్షేత్రం విషయంగా అనాదిగా ఉన్న ఆనవాయితీని కాదంటూ 50 ఏళ్ల లోపు వయస్సు గల మహిళల ప్రవేశాన్ని అనుమతిస్తూ సుప్రీంకోర్టు తీర్పునివ్వడాన్ని వ్యతిరేకిస్తూ జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గ కేంద్రంలో శనివారం దీపోత్సవాలతో నిరసనలు చేశారు. ఆరెస్సెస్, విశ్వహిందూ పరిషత్‌ల ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రాచీనాలయం శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం ఎదుట మహిళలు పెద్ద సంఖ్యలో దీపాలతో నిరసన తెలిపారు. 'సేవ్ శబరిమల' అంటూ నినాదాలు చేశారు. అలాగే అయ్యప్ప, జ్ఞానసరస్వతి సహిత శనైశ్చరాలయంలో అయ్యప్పకు సహస్ర దీపోత్సవంతో శబరిమల పవిత్రతను కాపాడాలంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆరెస్సెస్ బాధ్యులు రాజగంగాధర్, గట్ల శివకుమార్, తనుగుల రాజశేఖర్, కోరుట్ల గురుస్వామి చిదురాల నారాయణ, విహెచ్పీ నాయకులు మంచాల జగన్, కొత్త సురేశ్, చెట్‌పల్లి శంకర్‌లతో పాటూ భజరంగదళ్ కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కార్మిక కుటుంబాల ప్రాణాలతో సింగరేణి చెలగాటం!

- గత మూడు రోజులుగా నిలిచిన మంచినీటి సరఫరా
- నాలుగో రోజు బొగ్గుమసితో కూడిన కలుషిత నీరు సరఫరా..

విజయక్రాంతి, మంథని: బొగ్గుమసితో కూడిన కలుషిత నీరు సరఫరా చేస్తూ సింగరేణి అధికారులు, సింగరేణి కార్మిక కుటుంబాల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. సింగరేణి ఆర్జీ–3 పరిధిలోని సెంటనరీ కాలనీలో గత మూడు రోజులుగా సింగరేణి కార్మిక కుటుంబాలకు మంచి నీటి సరఫరా నిలిచిపోవడంతో కార్మిక కుటుంబాలు ఆందోళన చెందుతున్న తరుణంలో నాలుగోరోజు నీరు సరఫరా చేశారు. కానీ ఆ నీరు మొత్తం బొగ్గుమసితో కూడిన నల్లటి నీటిని సరఫరా చేయడంతో కార్మికుల కుటుంబాలు మరింత ఆందోళన, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పూర్తిగా బొగ్గు బావి నీళ్లను సరఫరా చేయడంతో తాము అనారోగ్య భారిన పడుతున్నామని కార్మిక కుటుంబాలు అవేదన వ్యక్తం చేస్తున్నాయి. కార్మికులు కష్టపడి సింగరేణికి లాభాలు తీసుకువస్తున్నా, కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోకుండా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల కార్మిక కుటుంబాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. సమస్యను వెంటనే పరిష్కరించి, మంచి నీటిని సరఫరా చేయాలని, లేకుంటే కార్మికుల కుటుంబాలతో కలిసి ఆర్జీ –3 జీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని పెద్దపల్లి ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు, సెంటనరికాలనీ ఎంపీటీసీ మోల్మూరి శ్రీనివాస్ ఈ సందర్భంగా హెచ్చరించారు.

అడుగంటి పోతున్న భూగర్భ జలాలు

- నిబంధనలకు విరుద్ధంగా బోరుబావులు
- కానరాని వాల్టాచట్టం

విజయక్రాంతి, పెద్దపల్లి: జిల్లా కేంద్రం పెద్దపల్లి పట్టణంతో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో అక్రమంగా బోరుబావులు వేయడంవల్ల భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. గృహ నిర్మాణాలతో పాటు కమర్షియల్ కాంప్లెక్స్‌లు, భవన సముదాయాలు, వ్యవసాయ అవసరాలకు ఇష్టానుసారంగా బోర్లు, బోరుబావులు వేస్తున్నారు. భూగర్భ జలాలు అడుగంటి పోకుండా బోర్లను నియంత్రించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాల్టాచట్టం ఉనికి కోల్పోతోంది. బోరువేయాలన్న, బావి తవ్వాలన్నా, వ్యవసాయ బావులు తోడాలన్నా, వాటికి సైడ్ బోర్లు వేయాలన్నా దరఖాస్తులు చేసుకోవాలి. వాల్టా చట్టంకింద ఈ దరఖాస్తులను తహసీల్దార్లు పరిశీలించి సాధ్యాసాధ్యాలను చూసి అనుమతిస్తారు. అయితే అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల రెండు,మూడేళ్ళుగా వాల్టాచట్టం కింద దరకాస్తులే రావడం లేదు. దీంతో జిల్లా కేంద్రంతో పాటు గ్రామాల్లో విచ్చల విడిగా బోర్లు వేస్తున్నారు. ప్రభుత్వ సెలవుదినాల్లో, రాత్రివేళల్లో బోర్లు వేస్తున్నప్పటికి నియంత్రణ చేసే అధికార యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. క్షేత్ర స్థాయిలో అవినీతి వల్ల అక్రమంగా బోర్లు వెలుస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. పెద్దపల్లి, సుల్తానాబాద్ పట్టణాల్లో బహిరంగంగా బోర్‌వెల్ మిషన్ దుకాణాలు కూడా వెలిసినప్పటికి అధికారుల అజమాయిషి కరువైంది. వీరు గ్రామాల్లోకి వెళ్ళి ఏజెంట్ల ద్వారా ప్యాకేజీ రేట్లతో అడ్డూఅదుపు లేకుండా బోర్లు వేస్తున్నారు.



ముంచుకొస్తున్న ముప్పు..

నీటి అవసరాలకోసం ఇష్టానుసారంగా బోర్లు వేయడం వల్ల వచ్చే వేసవిలో నీటి కష్టాలు పెరిగే పరిస్థితి ఉంది. శ్రీరాంసాగర్ ఆయకట్టు ప్రాంతమైన పెద్దపల్లి నియోజకవర్గంలో కాల్వనీళ్ళు వస్తేనే చెరువులు, కుంటల్లో నీరు చేరుతుంది. లేని పక్షంలో నీటివనరుల్లో జలాలు అడుగంటి పోతాయి. ఇక బావులు నోర్లు తెరుస్తాయి. ఈ క్రమంలో ఇటీవల కాలంలో శ్రీరాంసాగర్ నీరు సరిగారాకపోవడం వల్ల చెరువులు, కుంటల్లో నీటి మట్టం అంతంత మాత్రం గానే ఉంటోంది. రక్షిత మంచినీటి పథకాలకు నీరును అందించే మానేరు, హుసేన్‌మియా వాగులుకూడా నీళ్ళులేక ఎడారిని తలపిస్తున్నాయి. గత ఐదేళ్ళుగా వాగుల పరిస్థితి ఇదేవిధంగా ఉంది. సాగర్ నీరు సరిగా రాకపోవడం వల్ల వ్యవసాయ అవసరాల కోసం వాగుల్లోను ఇబ్బడి ముబ్బడిగా వందలాది బోర్లు రైతులు వేయక తప్పడంలేదు. ఈ నేపథ్యంలో మంచినీటి పథకాలకు నీటి కష్టాలు తప్పేపరిస్థితి కనబడటంలేదు. నీటిని పొదుపుగా వాడేందుకు కూడా ఎవరు ముందుకు రాకపోవడం వల్ల వృధాగా నీరు పోతోంది. నీటిని వృధాచేయకుండా ఇంకుడుగుంతల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా, ఈకార్యక్రమం కూడా అంతంత మాత్రంగానే కొనసాగుతోంది.

అతివలకు అందలం ఆవేదనలో ఆశావహులు

విజయక్రాంతి, నాగార్జునసాగర్: మహిళలకు యాభైశాతం రిజర్వేషన్లు పాటించడంతో సర్పంచ్‌లపై ఆశలు పెంచుకున్న అభ్యర్థుల కలలు కల్లలు అయ్యాయి. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో మొత్తం 179 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో అన్ని రిజర్వేషన్లు కలిపి మహిళలకు 92 స్థానాలు దక్కాయి. మిగిలిన 87 స్థానాల్లో మాత్రమే పురుషులు పోటీ చేసే అవకాశం ఉంది. కొంతకాలంగా సర్పంచ్ ఎన్నికల కోసం చూస్తున్న ఆశావహుల ఆశలు మహిళలకు యాభై శాతం రిజర్వేషన్‌తో తలకిందులయ్యాయి. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో మొత్తం ఆరు మండలాలు ఉన్నాయి. ఇందులో నాగార్జునసాగర్ , హాలియాలు మున్సిపాలిటీలు పోను మిగిలిన పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహిస్తారు. కాగా చదువుకున్న వారై ఉండటంతో పాటు గ్రామాల్లో మంచి పేరున్న యువతనే ఎన్నుకునేందుకు ఓటర్లు ఆసక్తి చూపుతున్నారు. అయితే ఎక్కువ మంది మహిళలు పోటీ చేసేందుకు అవకాశం ఉండటంతో ఈసారి పోరు వారి మధ్యే రసవత్తరంగా ఉండబోతోంది. రాజకీయ పలుకుబడి ఉన్న నాయకులు తమకి అవకాశం రాకపోవడంతో తమ భార్యలనైనా బరిలో దింపేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. డబ్బులు ఖర్చు పెడితే తప్ప పోటీచేసే పరిస్థితి లేకపోవడంతో ఆశావహుల్లో ఆందోళన మొదలైంది. పతుల బదులు సతులు పోటీ చేసే ప్రాంతాల్లోనూ అభ్యర్థుల్లో డబ్బు భయం పట్టుకుంది. దీంతో ఎన్నికల్లో పెరిగిన వ్యయాన్ని చూసి అసలు పోటీకి దిగాలో వద్దోనన్న సందిగ్ధ స్థితిలో అభ్యర్థులు ఉన్నారనడంలో సందేహం లేదు.

ప్రభుత్వం స్పందించకుంటే ఆమరణ నిరాహారదీక్ష..

విజయక్రాంతి, మిర్యాలగూడ: ప్రభుత్వం స్పందించి మిర్యాలగూడను జిల్లాగా ప్రకటించకుంటే ఆమరణ నిరాహారదీక్షకు పూనుకుంటామని జిల్లా సాధన సమితి సభ్యులు పలువురు హెచ్చరించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య సీఎం కేసీఆర్‌కు రాసిన లేఖను శనివారం ఆర్డీవో కెఎంవి. జగన్నాధరావుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ నూతన జిల్లాల ఏర్పాటు సందర్భంగా మిర్యాలగూడను జిల్లాగా ఏర్పాటు చేయాలని పెద్ద ఎత్తున ఉద్యమాలు జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. మిర్యాలగూడ, నాగార్జునసాగర్, హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన శాసనసభ్యులు, అన్ని రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్లు ముక్తకంఠంతో ప్రభుత్వానికి వివరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సాధన కమిటీ సభ్యులు ఎంఎ.సాజిద్‌ఖాన్, కందుకూరి శ్రీధర్‌గుప్త, వైద్యులు జాడి రాజు, ముజ్జా రామకృష్ణ, పద్మ, నూకల వేణుగోపాల్‌రెడ్డి, హమ్ము, చిత్రం ఉమ, గౌస్ పాల్గొన్నారు.





పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీదే విజయం

- బీజేపీ రాష్ట్ర కార్యదర్శి చింతా సాంబమూర్తి

విజయక్రాంతి, నల్లగొండ: మొన్నటి ఎన్నికల్లో అభ్యర్థులను ఆలస్యంగా ప్రకటించడం మోడి పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోవడంతో భాజపా అభ్యర్థులు ఓటమి చవిచూశారని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి చింతా సాంబమూర్తి అన్నారు. శనివారం బిజెపి జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నూకల నర్సింహ్మారెడ్డి సభాధ్యక్షతన జరిగిన నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఎన్నికల్లో జరిగిన పొరపాట్లను సమీక్షించుకుంటూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలు పట్టుదలతో పనిచేయాలని ప్రధాని నరేంద్రమోడి ఆద్వర్యంలో పార్లమెంట్ ఎన్నికల్లో భాజపా పార్టీ తిరుగులేని విజయం సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నరేంద్రమోడి ప్రవేశపెట్టిన పథకాలను కార్యకర్తలు ఇప్పటి నుండే ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రచారం చేయాలని నరేంద్ర మోడి నాయకత్వం దేశానికి అవసరమని రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో భాజపా అధికారంలోకి వచ్చి తీరుతుందని ఆయన కార్యకర్తలకు భరోసానిచ్చారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా అద్యక్షుడు నూకల నర్సింహ్మారెడ్డి కిసాన్ మోర్చా అధ్యక్షుడు గోలి మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీరెల్లి చంద్రశేఖర్, శ్యాంసుందర్, వెంకటనారాయణరెడ్డి, భాకి పాపయ్య, జిల్లా కార్యదర్శి పోతెపాక సాంబయ్య, భూపాల్‌రెడ్డి, పాశం శ్రీనివాస్‌రెడ్డి, బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు పోతెపాక లింగస్వామి, పట్టణాధ్యక్షుడు నిమ్మల రాజశేఖర్‌రెడ్డి, నాయకులు భోగరి అనిల్ కుమార్, కనకయ్య, పల్లె ప్రకాష్, గడ్డం వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

APGVB
ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్
జహీరాబాద్ బ్రాంచ్, పటాన్‌చెరు మండలం, సంగారెడ్డి జిల్లా
స్వాధీన ప్రకటన (స్థిరాస్తుల కొరకు)
తేది: 03-01-2019, ప్రదేశం: జహీరాబాద్ — అధీకృత అధికారి

కెనరా బ్యాంక్
(భారత ప్రభుత్వ రంగ సంస్థ)
నల్లకుంట బ్రాంచ్, 2-1-564 485, గాయత్రి బిల్డింగ్, మెయిన్ రోడ్, నల్లకుంట, హైదరాబాద్ - 500044
అనుబంధం-2A-డిమాండ్ నోటీసు
తేది: 05-01-2019, ప్రదేశం: హైదరాబాద్ — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

ఆంధ్రా బ్యాంక్
(భారత ప్రభుత్వ రంగ సంస్థ)
ఫోన్: 040-23421209.
అమ్మకం గురించి తెలియజేస్తూ రుణగ్రహీతకు నోటీసు (30 రోజుల నోటీసు)
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 6(2)/8(6))
ఆస్తి షెడ్యూలు : స్థిరాస్తి
ప్రదేశం: హైదరాబాద్, తేది: 04-01-2019 — సం/- అధీకృత అధికారి, ఆంధ్రా బ్యాంక్



'మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్'

అమెరికా, చైనా , రష్యా దేశాలు ఒకరికి మించి ఒకరు అధునాతన మైన , శక్తి వంతమైన బాంబులను తయారుచేస్తూ తమ సామర్థ్యాన్ని చాటుతున్నారు. తాజాగా చైనా అమెరికా ప్రయోగించిన మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్ అనే బాంబుకు దీటుగా అంతటి సామర్థ్యం గల బాంబును రూపొందించినట్లు తెలుస్తోంది. హెచ్ –6కె అనే బాంబర్ సాయంతో దానిని పరీక్షించినట్లు చైనా మీడియా గ్లోబల్ టైమ్స్ పేర్కొంది. చైనా అమ్ములపొదిలో అతి శక్తిమంతమైన బాంబు చేరింది. దీనికి మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్ అని నామకరణం చేశారు. చైనా రక్షణ సంస్థ ఎన్‌ఓఆర్‌ఎన్‌సీఓ రూపొందించిన ఈ బాంబు అణు బాంబులకు ప్రత్యామ్నాయంగా పనిచేస్తుంది. దీనిని ఉపయోగించి అత్యధిక స్థాయిలో విధ్వంసాన్ని సృష్టించవచ్చు అని ట్వీట్ చేసింది. ఈ బాంబును పరీక్షించిన వీడియోను, చైనా దేశ రక్షణ సంస్థ నార్త్ ఇండస్ట్రీస్ గ్రూప్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌ఓఆర్‌ఎన్‌సీఓ) తన వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేసింది. తద్వారా తమ వద్ద కూడా అణు బాంబులకు ప్రత్యామ్నాయంగా, అత్యంత శక్తిమంతమైన బాంబులు ఉన్నాయని చైనా ప్రపంచ దేశాలకు ముఖ్యంగా అమెరికాకు పరోక్ష హెచ్చరికలు జారీచేసింది. అమెరికా రూపొందించిన బాంబు కంటే తాము రూపొందించిన ఈ బాంబు అత్యంత చిన్నది, తేలికైనదని, దీనిని మోసుకువెళ్లేందుకు పెద్ద పెద్ద ఎయిర్‌క్రాఫ్టులు అక్కర్లేదని చైనాకు చెందిన ఓ అధికారి తెలిపారు. కాగా, అఫ్గనిస్తాన్‌లో అలకల్లోలం సృష్టిస్తున్న ఉగ్రవాదులను మట్టుబెట్టేందుకు అమెరికా సైన్యం గతేడాది జీబీయూ–43/బి అనే బాంబును ప్రయోగించింది. దీనికి మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్ అనే పేరు పెట్టారు. ఈ క్రమంలో చైనా కూడా తమ కొత్త బాంబుకు అదే పేరు పెట్టి అగ్రరాజ్యానికి సవాల్ విసిరింది. రష్యా కూడా ఇటువంటి బాంబునే తయారు చేసి దానికి ఫాదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్‌గా నామకరణం చేసింది. అత్యంత పెద్దది, థర్మోబరిక్ అయిన ఈ బాంబు గ్యాస్‌ను ఉపయోగించుకుని పెద్ద పెద్ద ఫైర్‌బాల్స్‌ను విసరడం ద్వారా లక్ష్యాలను ధ్వంసం చేస్తుంది. చైనా రూపొందించిన బాంబు మాత్రం థర్మోబరిక్ బాంబు కాదని గ్లోబల్ టైమ్స్ వెల్లడించింది.

రక్షణ, భద్రతా సవాళ్లకు సిద్ధమేనా?

రక్షణ, భద్రత, అంతర్జాతీయ సంబంధాల విషయంలో భారత్ 2019లో పెను సవాళ్లను ఎదుర్కొనే అవకాశాలున్నాయన్నది క్రమేపీ స్పష్టమౌతోంది. గతేడాది డోక్లమ్ తరహా సంఘటనలు పునరావృతం కాకుండా చేయడంలో భారత్ విజయం సాధించింది. మరో వైపు భారత్ పొరుగు దేశాల్లో చైనా ప్రభావం పెరగకుండా నియంత్రించడంలోనూ భారత్ సఫలమైంది. అదే విధంగా అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామిగా ఎదగడంలో కూడా దేశం విజయం సాధించింది. భారత్ సఫల దౌత్య నీతి ఫలితంగానే రష్యా నుంచి ఎస్–400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ కొనుగోలు చేసినప్పటికీ అమెరికా పెద్దగా అభ్యంతరపెట్టలేదు. ఇదేపని చేసిన మిగతా దేశాలను అమెరికా, కౌంటరింగ్ అమెరికా అడ్వర్సరీస్ త్రూ సాంక్షన్స్ యాక్ట్ (సీ ఏ ఏ టీ ఎస్ ఏ) చట్టం పేరిట పలు ఆంక్షలతో ఇబ్బంది పెట్టింది. కానీ భారత్ విషయంలో మినహాయింపును ఇచ్చింది. ఇరాన్ నుంచి భారత్ ఇంధనాన్ని కొనుగోలు చేసినా అమెరికా మనల్ని ఇబ్బంది పెట్టలేదు. ఇది కూడా మన దేశం సాధించిన దౌత్య విజయం.

అదే సమయంలో షాంఘై సహకార సంస్థ, ఆసియాన్, ఈస్ట్ ఏషియా సమ్మిట్, ప్రజాస్వామ్య చతుర్భుజి, బ్రిక్స్, బిమ్ స్టెక్, సార్క్ వంటి బహుళ దేశీయ సంస్థాగత సమాఖ్యలలోనూ భారత్ అత్యంత క్రియాశీలకమైన పాత్ర పోషించింది. ఇవన్నీ భారత్ అంతర్జాతీయ ప్రభావాన్ని, ప్రాభవాన్ని పెంచడంలో ఉపయోగపడ్డాయి. మరో వైపు పాకిస్తాన్‌తో సంబంధాలు ఉన్నస్థాయి నుంచి దిగజారలేదు. అయితే పెద్దగా పెరుగుదల కూడా లేదు. ప్రస్తుతానికి యథాతథ స్థితే కొనసాగుతోంది.

అంతర్గత భద్రత విషయంలోనూ 2018లో భారత ప్రభుత్వం గణనీయమైన విజయాలు సాధించింది. అంతర్గతంగా ఉగ్రవాదాన్ని అదుపులో ఉంచడమే కాక, నక్సల్ కార్యకలాపాల ప్రభావాన్ని తగ్గించగలిగింది. జమ్మూ కశ్మీర్ లోనూ ఉగ్రవాదం తిరోగమనంలో ఉంది. ప్రజలలోనూ ఉగ్రవాదం పట్ల వ్యతిరేకత పెరిగింది. అయితే ఈ విజయాలతో పాటు సామాజిక, ఆర్థిక, సంక్షేమ విధానాలను అవలంబించే విషయంలో ఇంకా ముందడుగు సాధించాల్సిన అవసరం ఉంది. ఈ విషయంలో పెద్దగా సాఫల్యం లేకపోయిన కారణంగానే దక్షిణ కశ్మీర్ నుంచి 189 మంది యువకులు ఇటీవలే సరిహద్దు దాటి వెళ్లి ఉగ్రవాద శిక్షణ పొందగలుగుతున్నారు.

2019లో అమెరికా ఇండోపసిఫిక్ క్షేత్రంలో తన ప్రభావాన్ని పెంచుకునేందుకు ప్రయత్నిస్తుంది. దీని కోసం అమెరికాకు భారత్ సహకారం చాలా అవసరం. ఈ నేపథ్యంలో చైనా,భారత్ లు చేరువ కావటం అమెరికాకు ఇష్టం లేదు. చైనా వ్యతిరేక కూటమికి భారత్ నేతృత్వం వహించాలన్నదే అమెరికా ఆలోచన. అదే విధంగా అఫ్గనిస్తాన్ నుంచి తాము వైదొలగిన తరువాత అక్కడ సైనిక కార్యకలాపాలలో భారత్ పాలు పంచుకోవాలన్నది కూడా అమెరికా ఆశ. ఈ ప్రయత్నంలో నాయకత్వం అమెరికాది. కూలీదనం భారతదేశానిది కావాలన్నది అమెరికా ఆలోచన. ఈ చట్రంలో పడకుండా, తన ప్రయోజనాలను కాపాడుకుంటూ భారత్ ఎలా వ్యవహరించాలన్నదే మనముందున్న ప్రధానమైన సవాలు. ఈ పరిస్థిని భారత్ ఎలా ఎదుర్కొంటుందన్న అంశంపైనే 2019లో మన దౌత్య సాఫల్యం ఆధారపడి ఉంటుంది. మరో వైపు చైనా కూడా భారతదేశాన్ని ఇరుకున పెట్టేందుకు హిమాలయ సరిహద్దుల్లో, పాక్ ఆక్రమిత కశ్మీర్, గిల్గిత్ బల్తిస్తాన్‌లలో తన కార్యకలాపాలను పెంచుతుంది. పాకిస్తాన్‌ను భారత వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేలా రెచ్చగొట్టే అవకాశం కూడా ఉంది. భారత్ తనకు పోటీగా వస్తుందన్న ప్రతి రంగంలోనూ చైనా మనల్ని చికాకులపాలు చేసే అవకాశాలే ఉన్నాయి. మరోవైపు పాకిస్తాన్ నుంచి పంజాబ్, కశ్మీర్ లలోకి ఉగ్రవాదాన్ని మరింత ఉధృతంగా ఎగుమతి చేసే పరిస్థితులున్నాయి. ముఖ్యంగా అమెరికా అఫ్గనిస్తాన్ నుంచి వైదొలగిన తరువాత పాకిస్తాన్ ప్రయత్నాలకు మరింత బలిమి చేకూరుతుంది. జమ్మూ కశ్మీర్‌లో నియంత్రణ రేఖ వద్ద ఉద్రిక్తతలు మరింతగా పెంచే దిశగా పాకిస్తాన్ ప్రయత్నిస్తుంది. అదే విధంగా ఉగ్రవాదాన్ని పెంచే దిశగా కూడా ప్రయత్నాలు సాగిస్తుంది. ఈ సవాలును కూడా భారత్ ఈ సంవత్సరంలో ఎదుర్కోవాల్సి ఉంటుంది.

ఈ నేపథ్యంలో 2019లో భారత్ మరింత పరిపక్వమైన దౌత్యనీతిని ప్రదర్శించాల్సి ఉంటుంది. అమెరికా, చైనాలను సంభాళించుకుంటూనే, పాకిస్తాన్ విసిరే సవాళ్లను స్వీకరించాల్సి ఉంటుంది. దీనికి తోడు భారత్ ఇరుగు పొరుగులో ఉన్న దేశాల్లో పరిస్థితులు భారత్ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉండకుండా చూసుకోవాలి. ఈ దిశగా మాల్దీవ్స్, శ్రీలంక, బంగ్లాదేశ్‌లలో సానుకూల పరిస్థితులు ఉన్న నేపథ్యంలో ఇక నేపాల్ పై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అదే విధంగా గల్ఫ్ దేశాల పట్ల భారత్ తన విధానానికి మరింత పదును పెట్టాల్సిన అవసరం ఉంది.

ఒకే సమయంలో మనం సౌదీ అరేబియాతో, ఇరాన్‌తో దోస్తీ చేయడంలో మనం చాతుర్యాన్ని ప్రదర్శిస్తున్నాం. ఇరాన్ మనకు ఛబహార్ ఓడరేవును లీజుకు ఇచ్చింది. కానీ గల్ఫ్‌లో క్షణక్షణం పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో మనం నిత్య జాగరూకతతో వ్యవహరించాలి. రానున్న రోజుల సవాళ్లకు భారత్‌ను సంసిద్ధం చేయాల్సిన అవసరం ఉంది. కేంద్రంలో ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోవాలి.

మేలు చేసినవారికి కృతజ్ఞులమై ఉండాలి

మనకు మేలు చేసినవారిని గుర్తుంచుకుని, అవకాశం వచ్చినప్పుడు వారికి తగిన సహాయం చేయాలి. అలానే మనకు సహాయం చేయని వారికి గూడా, వీలైన సహాయం చేయటం ఉత్తమ లక్షణం. నీకు ఎవరన్నా సహాయం చేస్తే, నువ్వు మరో ముగ్గురికి సహాయం చెయ్యి. అప్పుడు ఆ రుణం తీరుతుంది.

యదార్థ గాథ – పూర్వం రోమ్ నగరంలో ఒక యజమాని వద్ద అనేక మంది బానిసలలో ఆండ్రోక్లిస్ ఒకరు. యజమాని అతనిని చాలా క్రూరంగా హింసించేవాడు. ఇది భరించలేక ఒక నాటి రాత్రి ఆండ్రోక్లిస్ అడవిలోకి పారిపోయి ఒక గుహలో తల దాచుకున్నాడు. అప్పుడు చూచాడు ఆ గుహలో ఒక సింహం మూలుగుతూ, తన కుడి కాలి పంజాను నాలుకతో నాకుతూ, బాధ పడుతున్నది. ఆండ్రోక్లిస్ సాహసించి దగ్గరకు వెళ్ళి, సింహం కాలిలో గుచ్చుకున్న ముల్లును బైటికి లాగి పారేశాడు. సింహానికి బాధతీరి, ఆండ్రోక్లిస్ చేతిని కాలును నాకుతూ తన సంతోషాన్ని తెలియచేసింది. ఇద్దరూ మంచి మిత్రులయ్యారు. కొన్నాళ్ళకు ఆ సింహం వేటగాళ్ళ వలలో పడి, రాజ్యంలోని జంతు ప్రదర్శనశాలకు చేరింది. ఆండ్రోక్లిస్ యజమాని పంపిన భటుల చేతిలో చిక్కగా, యజమాని రాజుదగ్గరకు తీసికెళ్ళి ఆండ్రోక్లిస్‌కు శిక్ష వేయమంటాడు. ఆ రోజుల్లో పారిపోయిన బానిసలకు మరణదండన వేసే వారు.ఆ విధంగా మరణ దండన పడిన ఆండ్రోక్లిస్‌ను, కొత్తగా పట్టుబడిన సింహానికి ఆహారంగా ప్రజల సమక్షంలో వేయమని రాజు ఆనతిచ్చాడు. అట్లా వేయగా, ఆ సింహం ఆండ్రోక్లిస్‌ను చంపక, ప్రేమతో నాలుకతో అతని పాదాలను నాకటం మొదలు పెట్టింది. ఆండ్రోక్లిస్ కూడా ఆ సింహాన్ని గుర్తించి దాని జూలును దువ్వుతూ, ప్రక్కనే కూర్చున్నాడు. ఈ వింత దృశ్యాన్ని చూచిన ప్రజలు ఆశ్చర్యంతో కేరింతలు కొట్టారు. రాజు ఆండ్రోక్లిస్ ద్వారా జరిగిన విషయమును తెలుసుకొని అద్భుతంగా భావించి, ఆండ్రోక్లిస్‌కు ప్రాణదానం చెయ్యటమేగాక, అతనికి, సింహానికి స్వేచ్ఛ ఇచ్చాడు. ఆండ్రోక్లిస్ సింహంతో అడవికి వెళ్ళి హాయిగా గడిపాడు.

అందరితో సఖ్యంగా ఉండాలి

మనిషి సంఘజీవి. ఇరుగు పొరుగు వారితో సఖ్యతగా ఉండాలి. కష్టాలలో తనవాళ్ళు దూరంగా ఉన్నపుడు, ఇరుగు పొరుగు వారే దిక్కు. ఈ రోజుల్లో తమ పిల్లలంతా దూరదేశాల్లో ఉంటున్నారు. అత్యవసర పరిస్థితులలో పక్కవారి సహాయం లేకుండా మనుగడ చేయలేము. మనవాళ్ళు రావటానికి సమయం పడుతుంది. వాళ్ళు వచ్చేదాకా చూడాల్సింది ఇరుగుపొరుగు వారే. కనుక అందరితో సఖ్యంగా ఉండాలి.

నిజమైన మిత్రుల మధ్య త్యాగం, ప్రేమ వంటి మహా లక్షణాలు ఎప్పుడూ పరిమళిస్తుంటాయి. దారి చూపేవాడు హితుడు, కలిసి నడిచేవాడు స్నేహితుడు. యదార్థ మిత్రులు నీలోని సుగుణాలను ప్రోత్సహిస్తారు. నీలోని చెడు గుణాలను చూపి అవి మానేటట్లు చేస్తారు. స్నేహానికి ఆర్థిక అవసరాలతో ముడిపెట్టకూడదు. స్నేహం అత్యవసర అవసరాలకు ఆదుకుంటుంది. ఇచ్చిపుచ్చుకునే భావన స్నేహాన్ని పెంచుతుంది. నిజాయితీ, నిర్మోహమాటం, సహనం, సంయమనం మంచి స్నేహానికి మార్గాలు. అమ్మా నాన్నలు మొదటి మంచి స్నేహితులు. బాల్యంలో మంచి స్నేహితులు దొరకటం అదృష్టం.

సూర్యుడు మనం అడగకపోయినా, మనకు వెలుగును, వేడిని, నీటిని, అన్నాన్ని (వర్షాల ద్వారా) ప్రసాదిస్తున్నాడు. కనుక ఆయనకు 'మిత్రుడు' అని పేరు ఉంది. మనలో జఠరాగ్ని రూపంలో ఉండి, మనం తిన్న ఆహారాన్ని అరిగించే పరమాత్మ మనకు మంచి మిత్రుడు. లోకంలో అందరూ మనను వదలి పోయినా, ఆయనను ఆశ్రయిస్తే ఆదుకునే మంచి మిత్రుడు పరమాత్మ.

మంచి మిత్రుని విమర్శ సద్బుద్ధితో ఉంటుంది. ప్రశంస సహృదయంతో ఉంటుంది. మంచి మిత్రుడు లేని వాడు, మంచి మిత్రుడిగా ఉండలేని వాడి జీవితం వ్యర్థం. మిత్రుని దుఃఖాన్ని, కష్టనష్టాలను చూచి స్పందించిన వాడే నిజమైన మిత్రుడు. కలతలు లేని స్నేహం ఉండాలంటే, కపటం లేని హృదయం ఉండాలి. నీతి, నిజాయితీ, విశ్వసనీయత వంటి విలువలు పునాదులుగా ఉన్నపుడే స్నేహం దృఢంగా ఉంటుంది. అవసరాన్ని బట్టి మనసు తెలుసుకొని, ఆదుకునేవాడే నిజమైన మిత్రుడు. చెలికాడి హితం కోరి, చేదుమాటలైనా నిర్మోహమాటంగా నిజం చెప్పే వాడే నిజమైన స్నేహితుడు.

స్నేహం యొక్క ప్రాముఖ్యత

బాల్యంలో అమ్మా నాన్నల సాన్నిహిత్యమే లోకం. కౌమార దశలో హాస్టలులో ఉన్నపుడు స్నేహితులే సర్వస్వం అనే స్థాయికి వస్తారు. అప్పుడు తల్లి తండ్రులు మధ్య మధ్యలో వెళ్ళి, ఆ స్నేహితులు ఎలాంటివారో గమనించి పిల్లలకు తగిన సూచనలిస్తుండాలి. లేకపోతే చెడు సహవాసాల ఉచ్చులో పడే ప్రమాదం ఉంది. మంచి స్నేహానికి శ్రీకృష్ణ–కుచేలురు ఆదర్శం. శ్రీకృష్ణుడు, కుచేలుడు బాల్యంలో గురువు సాందీపుని దగ్గర విద్యాభ్యాసం చేసిన మంచి మిత్రులు. పెద్దయిన తర్వాత దరిద్రబాధ అనుభవిస్తున్న కుచేలుడు, శ్రీకృష్ణుడిని చూడటానికి వచ్చినప్పుడు అడగకపోయినా, కుచేలుడిని అష్టైశ్వర్యాలు ప్రసాదించాడు శ్రీకృష్ణుడు.

చెడు స్నేహానికి ద్రుపదుడు–ద్రోణుడు ఉదాహరణ. ఇద్దరూ ఒకే గురువు దగ్గర విద్యాభ్యాసం చేశారు. ద్రుపదుడు రాజపుత్రుడు. ద్రోణుడు బీద బ్రాహ్మడు. విద్యాభ్యాసం అయిన తర్వాత ద్రోణుడిని ఏదైనా సహాయం కావాలంటే, తనను అడగమంటాడు ద్రుపదుడు. పెద్దయింతర్వాత ద్రోణాచార్యుడు బీదరికంతో బాధపడుతూ, తన పుత్రుడి సంరక్షణార్థం ద్రుపదుడి దగ్గరకు వెళ్ళి సాయం అర్థిస్తాడు. ద్రుపదుడు రాజగర్వంతో నీవెవరో నాకు తెలియదంటాడు. అవమాన పడ్డ ద్రోణాచార్యుడు తన శిష్యుడైన అర్జునునితో, గురుదక్షిణగా ద్రుపదుడిని ఓడించి బందీగా తెచ్చి తన ముందు నిలబెట్టమంటాడు. అలా అర్జునుడు చేయగా తన ప్రతీకారం తీర్చుకుంటాడు, ద్రోణుడు.

అత్యాశ అనర్థదాయకం: ఆశ ఉండవచ్చు కాని అత్యాశ పనికి రాదు.

కథ: వ్యాపారి గోవిందయ్య పరమలోభి, అయినా లాభం వస్తుందంటే ఎంతైనా పెట్టుబడి పెడతాడు. ఒక రోజు ఆ ఊరికి ఒక మహా మహిమలున్న సాధువు వచ్చి గుళ్ళో ఉన్నారని విన్నాడు. ఎప్పుడూ గుడికి వెళ్ళని గోవిందయ్య ఆ రోజు గుడికి వెళ్ళి, వారి దర్శనం చేసుకొని, కాళ్ళపై పడి దండం పెట్టి, వారు చెప్పినట్లు చేస్తానని, తనకు రెండు వరాలిమ్మని ప్రార్థించాడు. నీ బోటి ధనవంతులవల్ల ఊరికి ఉపకారం జరగాలి, కనుక ఊరికి మంచినీటి కొరత తీరటానికి బావి తవ్వించమని, ఊరిలో మంచి రోడ్డు వేయించమని సాధువు చెప్పారు. అవి చేయించిన తర్వాత తనకు రెండు వరాలిమ్మని అడిగి ఆ రెండు పనులు పూర్తి చేయించాడు గోవిందయ్య. అప్పుడు సాధువు గోవిందయ్య చెవిలో ఒక మంత్రం చెప్పి దానిని మూడుసార్లు స్మరించి 'నీవు ఏమి కోరుకుంటే అది జరుగుతుందని', కాని ఆ మంత్రం రెండు సార్లే పనిచేస్తుందని సాధువు చెప్పాడు.

గోవిందయ్య ఆ మంత్రాన్ని బాగా గుర్తుంచుకొని, ఇంటికి వెళ్ళి మూడుసార్లు స్మరించి, తన ఇల్లు బంగారం కావాలని కోరుకున్నాడు. ఇల్లు, గోడలు, దర్వాజాలు, పెరటిగోడతో సహా, బంగారం అయింది. అది చూసి గోవిందయ్య సంతోషించాడు. కాని అంతలో ఊరివారంతా చూస్తారని, రెండోసారి మంత్రం మూడుసార్లు స్మరించి, ఆ బంగారం తనకు తప్ప ఇతరులకు కనిపించకూడదని కోరుకున్నాడు. అప్పుడు తన పెరటి గోడనున్న ఒక ఇటుకను, బంగారం దుకాణానికి తీసికెళ్ళి ఈ బంగారు ఇటుకకు డబ్బులిమ్మని అడిగాడు. దుకాణం అతను, 'నీకేమన్నా పిచ్చి పట్టిందా, మట్టి ఇటుకను తెచ్చి, బంగారు ఇటుక అంటావేం' అన్నాడు. అప్పుడు తెలిసొచ్చింది, తనకు తప్ప అది ఇతరులకు బంగారం లాగ కనపడదని. తన అత్యాశే తనను ముంచిందని బాధ పడ్డాడు.

స్వర్గం నరకం మన నడత నిర్ణయిస్తుంది

ఎదుటి వారి బాగోగులను పట్టించుకోని వారికి అవసరమైన సాయం చేసి అందరూ సంతోషంగా ఉండేటట్లు చూస్తే అదే స్వర్గం. స్వార్థంతో తన బాగోగులను మాత్రమే చూసుకొని, ఇతరుల బాగోగులను పట్టించుకోకపోతే అదే నరకం.

కథ: రెండు ప్రదేశాలలో అన్నదానం జరుగుచున్నది. రెండు ప్రదేశాలలోనున భోజనం చెయ్యటానికి వచ్చిన వారందరికీ ఎదురెదురుగా కూర్చోపెట్టి, మోచేయి దగ్గర చెయ్యి వంగకుండా వెదురు బద్దలు కట్టారు. విస్తళ్ళలో అన్నం కూరలు వడ్డించి ఇక తినమన్నారు.

మొదటి చోట ప్రజలు చెయ్యి వంగక, అన్నం నోటి దగ్గరకు తెచ్చుకొనటం కుదరక, తినకుండానే లేచి ఆకలితో, దుఃఖంతో వెళ్ళి పోయినారు.

రెండోచోట ప్రజలు తెలివిగా, నిటారుగా ఉన్న తమ చేతులతో, ఎదుటి వారి నోటికి అన్నం అందించటం వలన, అందరూ సుష్టుగా భోంచేసి సంతోషంగా వెళ్ళి పోయినారు. రెండుచోట్ల ఒకే పరిస్థితులున్నా ఎదుటి వారికి సహాయం చెయ్యాలన్న ఆలోచనచ రెండో ప్రదేశాన్ని స్వర్గంగా మార్చింది. మొదటి చోట తమ స్వార్థమే చూసుకోవటం వల్ల, ఆ ప్రదేశాన్ని నరకంగా మార్చింది.

పరోపకారం పుణ్యం, పర పీడనం పాపం. నీకు మంచి జరగాలనుకుంటే ఇతరులకు మంచి చెయ్యి, నీవు ఇతరులకు చేసిన సహాయం వెంటనే మరిచిపో. నీకు ఇతరులు చేసిన సహాయం సదా గుర్తుంచుకో. మనకు ఉన్నదానిలో కొంత సమాజ సేవకు వినియోగించాలి. అప్పుడే సార్థకత చెందుతుంది.

– వ్యాకరణం వేణుధర శాస్త్రి

ఉద్యమంలో క్రమక్రమంగా రాజకీయ నాయకుల మమేకం

కృష్ణ నదిని దాటివచ్చిన వీరు నదికి ఈవలి వైపున ఒక పోలీసు స్టేషన్‌ను ముట్టడించగా అక్కడ కూడా పోలీసులు కాల్పులు జరిపారు. అల్లరి మూకలు ఒక సూపరింటెండెంట్ ఇంజనీర్ ఇంటిపై కూడ దాడి చేశారు.

తమ స్వయంకృతాపరాధాల వల్ల ఈ రకంగా అరాచకాలు ప్రబలిపోవడంతో పునాదులు కదిలిన ప్రభుత్వ, పోలీసు బృందాలు, అధికారులకు సాయపడటానికై సైనిక పటాలాలను పిలిపించవలసి వచ్చింది. ఉపద్రవ పరిస్థితిలో రాష్ట్రంలోని వివిధ పట్టణాలలో సుమారు పక్షం రోజులు సైనికులు మోహరించి ఉండగా ప్రజలలో ఆత్మవిశ్వాసాన్ని కల్పించడానికి సైన్యాన్ని పిలిపించామని చెప్పి ముఖ్యమంత్రి తన ముఖం దాచుకునేందుకు ప్రయత్నించారు.

ఫిబ్రవరి మొదటి వారం రోజుల్లో సైనికులు స్థానిక పోలీసుల సలహా, సహకారంతో పాశవికంగా, అభ్యంతరకరంగా ప్రవర్తించారు. విచ్చల విడిగా, విచక్షణ లేకుండా శత్రుదేశంపై పడ్డట్టుగా వ్యవహరించి ఎందరో విద్యార్థులను, అమాయక ప్రజలను ఇష్టం వచ్చినట్టు కొట్టి జైళ్ళలో కుక్కారు. అయినప్పటికీ దుష్ట పాలకుల పన్నాగాలు ఫలించలేదు. ఉద్యమం ఆగలేదు. మిగులు నిధుల గురించి, ఉద్యోగాలలో జరిగిన అన్యాయాలకు వ్యతిరేకంగా ఉద్యమం కొనసాగింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అప్రజాస్వామిక, ప్రజా వ్యతిరేక విధానాలను, దమన నీతినీ, పాలకులుగా చెలామణీ అవుతున్న వారిచే పోషించబడుతున్న గూండాల దుశ్చర్యలను, చట్టాలను శాసనాలను కాలదన్ని అధికార ముఠా తొత్తులుగా వ్యవహరించిన పైశాచిక పోలీసుల రాక్షస కృత్యాలను, ప్రజలు ఎంతో సాహసంతో ఎదుర్కొన్నారు.

మార్చి 8,9 తేదీలలో రెడ్డి హాస్టల్‌లో విద్యార్థులు జరిపిన ప్రప్రథమ 'తెలంగాణ కన్వెన్షన్ గురించి మార్చి నాటి 'బంద్' గురించి, ఫిబ్రవరి 25వ తేదీ రాత్రి నారాయణగూడలో శ్రీ యం. రామచంద్రారెడ్డి నివాస గృహంలో జరిగిన సమావేశంలోనే తుది నిర్ణయం గైకొనడం జరిగింది. ఈ సమావేశంలోనే 'పీపుల్స్ కన్వెన్షన్' ఒక రూపు సంతరించుకోవడం శ్రీ ఎ. మదన్‌మోహన్ కన్వీనర్‌గా కొనసాగాలని అందరూ అంగీకరించడం జరిగింది.

ఈ సమావేశానికి ఐదు రోజుల ముందే కన్వెన్షన్ వ్యవస్థాపక సభ్యులు అయిదారుగురు సమావేశమై ఉద్యమం ఔచిత్యం, తమ శక్తి సామర్థ్యాలు, భావి కార్యక్రమం గురించి పిచ్చాపాటి చర్చించారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని నిర్వహించే శక్తి సామర్థ్యాలు సాధన సంపత్తి తాము సమకూర్చుకొనలేమేమో అనే అనుమానం కొందరు వ్యక్తపరిచినప్పటికీ, ఆంధ్ర పాలకుల ఆగడాలు అరికట్టేందుకు ఏ త్యాగమైనా చేయవలసిన దేననీ, సాహసోపేతంగా ముందుకు పురోగమించడం, విద్యార్థులకు అండదండలుగా నిలువటం అనివార్యమని అధిక సంఖ్యాకులు వాదించారు. ఎలాగైతేనేం, ఈ సమావేశంలో పాల్గొన్నవారంతా జిల్లాలో ఉన్న నమ్మకస్తులైన తమ మిత్రులందరినీ ఫిబ్రవరి 25వ తేదీనాటికి పిలిపించాలని నిర్ణయం జరిగింది.

'తెలంగాణ పీపుల్స్ కన్వెన్షన్'తో (ప్రజాసమితి) సంబంధం పెట్టుకొన్న ప్రప్రథమ శాసన సభ్యులు శ్రీ పురుషోత్తమరావు; శ్రీ భూమరావు నాటినుండే, ప్రత్యేక రాష్ట్ర వాదాన్ని బహిరంగంగా బలపరుస్తుండగా, శాసనసభ్యులు ప్రొఫెసర్ జి.వి. సుధాకర్‌రావు, శ్రీ జి. రాజారామ్, ఉద్యమ నాయకులు సలహా సంప్రదింపులు జరపాలనుకున్నప్పుడల్లా అందుబాటులో ఉంటూ వచ్చారు.

ఆశ్చర్యకరమైన విషయమేమంటే ప్రత్యేక రాష్ట్రవాది కానప్పటికీ శ్రీ బి.పి. జీవన్ రెడ్డి, ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం క్రింద తమ నిర్బంధాన్ని సవాలు చేస్తూ ఉద్యమ నాయకులు ఎ. మదన్‌మోహన్ మరికొందరు హైకోర్టులో పిటీషన్స్ పెట్టుకున్న సందర్భంలో వారివైపు పనిచేశారు. న్యాయవాదులు శ్రీ గురు రాజారావు, శ్రీ యస్. వేదాంతరావు ఆంధ్ర ప్రాంతీయులైనప్పటికీ కొందరు నిర్బంధితుల పక్షాన ప్రతిఫలం ఆశించకుండానే తమకుతాముగా పనిచేయడం అభినందించ తగిన విషయం.

ఉద్యమాన్ని సమర్థించి నాయకత్వం వహించవలసిందిగా, కొందరు ప్రముఖులకు నచ్చజెప్పేందుకు ఫిబ్రవరి మాసాంతం నుండే తీవ్ర ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. అయితే తెలంగాణ సమస్యకు సామరస్య పూర్వకంగానే ఏదో పరిష్కారమార్గం దొరకగలదన్న ఆశ వారిలో అప్పటికి చావలేదు. కొందరు ముఖ్యమంత్రికి భయపడ్డారు. శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ తెలుగు ప్రజలు రెండు రాష్ట్రాలుగా విడిపోవడం ఆనాటి వరకు అంగీకరించలేదు.

రెడ్డి హాస్టల్లో మార్చి 8,9 తేదీలలో జరిగిన కన్వెన్షన్ ఉద్యమ చరిత్రలో ఒక ముఖ్యమైన మలుపుగా చెప్పక తప్పదు. ఆనాడే తాము ఉద్యమ నిర్వహణ బాధ్యతలను పెద్దలకు అప్పగించినట్టు విద్యార్థి నాయకులు ప్రకటించారు.

ఆనాటి అపూర్వ సభకు హాజరైన లక్షల మంది ప్రేక్షకులు తెలంగాణకు రాష్ట్ర ప్రతిపత్తి సాధించేందుకు ఎంతటి త్యాగానికైనా వెనుకాడబోమని దీక్ష పూనారు. ఆనాడే తొలి పర్యాయం తెలంగాణ చిత్రపటాన్ని (మ్యాప్) శాసనసభ్యుడు శ్రీ టి. పురుషోత్తమరావు ఆవిష్కరించారు. తెలంగాణ ఎల్లలు చూపే ఈ చిహ్నం తర్వాత సర్వామోదమై జండా రూపుకూడ సంతరించుకున్నది. దీనిని మార్చి 7వ తేదీన ట్రూప్ బజార్‌లో లీడర్ పత్రిక కార్యాలయంలో ఇ.వి. పద్మనాభం, ఆదిరాజు వెంకటేశ్వరరావు, మునీ జమాల్ రూపొందించారు. రెడ్డిహాస్టల్ సభకు శ్రీమతి సదాలక్ష్మి అధ్యక్షతన వహించగా ఉస్మానియా వైస్ ఛాన్సలర్ శ్రీ రావాడ సత్యనారాయణ ప్రారంభోత్సవం చేశారు. ఏప్రిల్ 11వ తేదీలోగా ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు అంగీకరించవలసిందిగా కేంద్రప్రభుత్వాన్ని కోరుతూ ఆదిరాజు వెంకటేశ్వరరావు ప్రవేశపెట్టిన ఒక తీర్మానం కూడా సభలో ఏకగ్రీవంగా ఆమోదించబడింది.

ఈ సదస్సు జయప్రదం కావడానికి విద్యార్థి నాయకులు అంతకు ముందు పది పదిహేను రోజులు నిర్విరామ కృషి చేసి పల్లె పల్లె తిరిగి ప్రచారం చేశారు. సభలు ఘనంగా జరపాలన్న పట్టుదలతో వారు నిద్రాహారాలు కూడా విసర్జించి పని చేశారు. వీరితో పాటు ప్రజాసమితి సభ్యులైన శ్రీ యస్. వెంకట్రామరెడ్డి, డాక్టర్ ఎ. గోపాల్, శ్రీ జి. నారాయణరావు, శ్రీ రఘువీర రావు, శ్రీ జగన్మోహన్ రెడ్డి, శ్రీ నాగం కృష్ణ, శ్రీ రాజారెడ్డి, శ్రీ మానిక్‌రావు, వరకాంతం రామకృష్ణారెడ్డి, శాయిరెడ్డి మొదలగువారు ప్రత్యక్షంగాను ఉద్యోగాలలో ఉన్న దేవులపల్లి ప్రభాకరరావు వంటి అనేకమంది పరోక్షంగానూ చాలా శ్రమించారు. జిల్లాలో ఉన్న నాయకులు గణనీయమైన కృషి చేసి ప్రతి తాలూకా నుండి వేలమంది ఈ సభలలో పాల్గొనేందుకు దోహదం చేశారు.ఆ తర్వాత వరుసగా ప్రతినిత్యం పల్లె పల్లెన వేల సభలు జరిగాయి.

(సశేషం)

– ఆదిరాజు వెంకటేశ్వర రావు

చెరువుల అభివృద్ధి చర్యలేవి?

మీ లేఖ

అధికారులు ఎన్నికల హడావుడిలో ఉండగా అక్రమార్కులు యథేచ్ఛగా ఆక్రమణల పర్వం కొనసాగిస్తున్నారు. చెరువుల పరిరక్షణ పనులు చేపట్టడంలో జీహెచ్ఎంసీ, నీటి పారుదల శాఖల నిర్లక్ష్యం ఆక్రమణల దారులకు ఊతమిస్తోంది. డిసెంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అధికారులు హడావుడిలో ఉండగా పలు చెరువుల్లో జోరుగా అక్రమ నిర్మాణాలు వెలిశాయి. చెరువులకు కంచె నిర్మించి అభివృద్ధి చేస్తే ఆక్రమణల ఇబ్బంది ఉండదు. కానీ గ్రేటర్ అధికార యంత్రాంగం ఈ విషయాన్ని పట్టించుకోవటం లేదు. జీహెచ్ఎంసీ పరిధిలో రికార్డుల ప్రకారం 600కుపైగా చెరువులుండేవని తెలుస్తుండగా ప్రస్తుతం వాటి సంఖ్య 185కు చేరింది. వాటిలో కూడ దాదాపుగా అన్ని చెరువుల్లోనూ సగానికిపైగా భూమి ఆక్రమణల్లో ఉంది. అవినీతి అధికారుల చేతివాటంతో వాటి సరిహద్దుల పత్రాలు కూడ గందరగోళంగా ఉన్నాయి. రెవెన్యూ, నీటిపారుదల శాఖలు వేర్వేరుగా తయారు చేసిన చెరువుల పటాలకు పొంతన ఉండటం లేదు . వాటిని ఆసరా చేసుకుని ఆక్రమణదారులు చుట్టూ నిర్మాణాలు చేపడుతున్నారు. వాటిని ఇతరులకు విక్రయిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకుంటే కొనుగోలుదారులు బలవుతుంటే, కొన్ని చోట్ల కొన్నవారు ఆందోళనలు చేస్తున్నారు. వారి నిరసనలను సాకుగా చూపించి అవినీతి అధికారులు చర్యలు తీసుకోలేమంటూ చేతులెత్తేస్తున్నారు. మళ్లీ ఎన్నికల హడావుడి మొదలవుతున్నందున అభివృద్ధి పనుల్లో తాత్సారం చేస్తే చెరువుల ఆక్రమణలు పెరిగేపోయే ప్రమాదం ఉంది. అధికారులు చర్యలు తీసుకుని చెరువులను ఆక్రమణల బారి నుంచి కాపాడాలి.

– సోమశేఖరరావు,
హైదరాబాద్

తెరపైకి కొత్త జిల్లాల డిమాండ్లు

తెలంగాణలో జిల్లాలు, డివిజన్లు, మండలాల పునర్వ్యవస్థీకరణ డిమాండ్లు మళ్లీ మొదలయ్యాయి. రాష్ట్రంలో ములుగు, నారాయణపేటలను జిల్లాలుగా మారుస్తామని ఇప్పటికే ప్రకటించిన కేసీఆర్ కోరుట్లను రెవెన్యూ డివిజన్‌గా, గట్టుప్పల్, మల్లంపల్లి, చండూరు, మోస్రా, ఇనుగుర్తి, నారాయణరావుపేటను మండలాలుగా మార్చాలని నిర్ణయించారు. నివేదికలు పంపాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఎక్కడికక్కడ కొత్త మండలాలు, డివిజన్లు, జిల్లాల కోసం స్థానికుల నుంచి డిమాండ్లు పెరుగుతున్నాయి. తెలంగాణలో అధికారంలోకి రాగానే కొత్త జిల్లాలు ఏర్పాటు చేస్తామని 2014లో కేసీఆర్ ప్రకటించారు. ఈ మేరకు 2015 సెప్టెంబరు 2న జిల్లాల పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని అన్వయం చేసుకోవడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు పేరుతో పూర్వ కరీంనగర్ జిల్లాలోని హుజూరాబాద్‌ను జిల్లాగా ఏర్పాటు చేయాలని ఉద్యమం తీవ్రతరం చేశారు. 14 మండలాలతో హుజురాబాద్ కేంద్రంగా కొత్త జిల్లా ప్రకటించాలని ఆందోళనలు జరుగుతున్నాయి. మిర్యాలగూడను జిల్లాగా ప్రకటించాలని సీపీఎం పట్టుబడుతోంది. సత్తుపల్లిని జిల్లా చేయాలని డిమాండ్ వినిపిస్తోంది. భూపాలపల్లి జిల్లాలోని ఏటూరునాగారం కేంద్రంగా ఆదివాసీ జిల్లా కోసం పట్టుపడుతున్నారు. వరంగల్ అర్బన్ పరిధిలోని కమలాపూర్‌తో పాటు భూపాలపల్లి డివిజన్‌లోని 11 మండలాలు కలిపి పరకాల కేంద్రంగా జయశంకర్ జిల్లా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. నర్సంపేట కేంద్రంగా పాకాల జిల్లా ఏర్పాటు చేయాలన్న డిమాండ్ వినిపిస్తోంది. సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేట జిల్లాలోని రాఘవాపూర్‌ను మండలంగా చేయాలని స్థానికులు ఉద్యమిస్తున్నారు. కేసీఆర్ స్వగ్రామం చింతమడకను మండలంగా మార్చాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.



పీవీ పేరుతో హుజూరాబాద్‌కై వినతులు

వరంగల్‌రూరల్ జిల్లాలో ప్రతిపాదిత ఇనుగుర్తి మండలంలో బూర్గుమల్ల, బొల్లికొండ గ్రామాలను కలపొద్దని ఉద్యమాలు జరుగుతున్నాయి. భూపాలపల్లి జిల్లాలోని కాటారం, మల్హార్, మహాముత్తారం, పలిమెల మండలాలతో రెవెన్యూ డివిజన్ కోసం స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఏటూరునాగారం కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని సీఎస్ ఎస్‌కె జోషికి ఎమ్మెల్యే సీతక్క వినతిపత్రం అందించారు. రేగొండ మండలంలోని గౌరికొత్తపల్లి, మంగపేట మండలంలోని రాజుపేటను మండల కేంద్రాలుగా మార్చాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

ప్రతిపాదిత నారాయణపేట జిల్లాలో కోస్గి మండలాన్ని కలపొద్దంటూ దీక్షలు చేపట్టారు. కోస్గిని డివిజన్‌గా మార్చాలని స్థానికులు కోరుతున్నారు. నారాయణపేట జిల్లాలో కోయిలకొండ మండలాన్ని చేర్చవద్దని స్థానికులు కోరుతున్నారు. నారాయణపేట మండలంలోని కోటకొండ, దామరగిద్ద మండలంలోని కానుగుర్తి, ఉట్కూరు మండలంలోని పులిమామిడి, బిజ్వార్లను మండలాలు చేయాలని, కోస్గిలోని గుండుమాల్, మక్తల్‌లోని జక్లేర్‌ను మండలాలుగా ప్రకటించాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

– రావుల రాజేశం, 98488 11424

మహిళలతో కలిసి అయ్యప్పల నిరసన

విజయక్రాంతి, బాన్సువాడ: కేరళలోని శబరిమల ఆలయంలోకి 50 సంవత్సరాలలోపు మహిళలు ప్రవేశిస్తుండటాన్ని నిరసిస్తూ శనివారం బాన్సువాడ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారులు స్థానిక మహిళలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. మహిళలు మంగళహారతులు తీసుకుని రాగా అందరూ కలిసి మానవహారంగా ఏర్పడి సేవ్ శబరిమల అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు కొత్తకొండ భాస్కర్ గురుస్వామి మాట్లాడుతూ కేరళలో కమ్యూనిస్టు ప్రభుత్వం కావాలని మహిళలను పోలీసుల సహాయంతో దొంగచాటుగా అయ్యప్ప దర్శనం చేయిస్తున్నారని అన్నారు. సుప్రీం కోర్టు భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని తీర్పును పునఃపరిశీలించాలన్నారు. ఇప్పటికైనా కేంద్రం స్పందించి భక్తుల మేలు కోసం ఏదైనా ఒక నిర్ణయం తీసుకోవాలని అన్నారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి రాజీవ్ చౌరస్తా వరకు క్యాండిల్ పట్టుకుని ర్యాలీ నిర్వహించారు.



ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- స్వచ్ఛ సర్వేక్షణ్‌ను బాధ్యతగా నిర్వహించాలి
- ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్

విజయక్రాంతి, మహబూబాబాద్: స్వచ్ఛ భారత్‌లో భాగంగా స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాన్ని పట్టణ ప్రజలు బాధ్యతగా నిర్వహించాలని, ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించుకొని పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని మహబూబాబాద్ శాసన సభ్యులు బానోత్ శంకర్ నాయక్ పిలుపునిచ్చారు. శనివారం నాడు స్థానిక తహ శీల్దార్ కార్యాలయం నుంచి వివేకానంద విగ్రహం వరకు స్వచ్ఛ సర్వేక్షణ్–2019 సైకిల్ ర్యాలీ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సాగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మానుకోట పట్టణాన్ని రాష్ట్రంలోనే స్వచ్ఛ మానుకోటగా తీర్చిదిద్ది మొదటి ర్యాంకును సాధిద్దామని, అందుకు ప్రజలందరు సహకరించాలని కోరారు. పట్టణంలోని నివాస ప్రాంతాలు, వ్యాపార సంస్థలు, కార్యాలయాలు, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి మునిసిపాలిటీ వాహనాలకు అప్పజెప్పాలన్నారు. ప్లాస్టిక్, వ్యర్థ పదార్థాలను బహిరంగ ప్రదేశాలలో వేయరాదన్నారు. మున్సిపల్ కమిషనర్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ బహిరంగ మల, మూత్ర విసర్జనను విడనాడాలన్నారు. మరుగుదొడ్ల నిర్మాణం చేసుకోవడానికి మున్సిపాలిటీని సంప్రదించాలని, అందరికీ నిర్మాణానికి సంబంధించిన ఫండ్ రిలీజ్ చేయబడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, వివిధ స్వచ్ఛంద సంస్థల వారు పాల్గొన్నారు.

'కోయిల్‌సాగర్' రైతులను పట్టించుకోరా?

- టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి

విజయక్రాంతి, మహబూబ్‌నగర్: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు ఆయకట్టు రైతులను ఆదుకోవాలని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాజెక్టు కింద ఉన్న దాదాపు 12,624 ఎకరాలకు ఒక పంటకు లేదా రెండు పంటలకు నీరు ఇవ్వాల్సి ఉన్నా అలా జరగడం లేదన్నారు. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ.300 కోట్లతో జూరాల నుంచి ఎత్తిపోతల ద్వారా కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో నీరు నింపడం జరిగిందన్నారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు కెపాసిటీ 2.2 టీఎంసీలు ఉంటే అందులో 1.1 టీఎంసీ మిషన్ భగీరథకు కేటాయిస్తే ఆయకట్టు రైతులకు నీళ్లు ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. దీంతో రైతులకు రెండు పంటలకు నీళ్లు అందకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏడాది నవంబర్‌లో ఐడీబీ సమావేశం పెట్టి ఆయకట్టు రైతులను పిలిచి నీటి విడుదలపై నిర్ణయం తీసుకునేవారని, కానీ ఇప్పటి వరకు సమావేశం పెట్టలేదన్నారు. ఐడీబీ సమావేశం పెట్టించి రబీలో కనీసం నాలుగు తడులకు నీళ్లు ఇప్పించే బాధ్యత నారాయణపేట, దేవరకద్ర ఎమ్మెల్యేలతో పాటు మహబూబ్‌నగర్ ఎంపీకి లేదా అని ప్రశ్నించారు. తమకు ఓట్లేసిన రైతుల పంటలకు నీళ్లు ఇవ్వకుండా ఇతర ప్రాంతాలకు నీళ్లు తరలిస్తుంటే ఇక్కడి ప్రజాప్రతినిధులు ఏం పట్టనట్లు వ్యవహరించడం సరికాదని దుయ్యబట్టారు. ఉత్తర తెలంగాణాలో కడుతున్న కాళేశ్వరం ప్రాజెక్టు గురించి గొప్పగా డబ్బా కొట్టే మన ఎంపీ, ఎమ్మెల్యేలు కోయిల్‌సాగర్ ప్రాజెక్టు ఆయకట్టును ఈ ఐదేళ్లలో పెంచే ప్రయత్నం ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. కోయిల్‌సాగర్ ఎడమ, కుడి కాల్వల వైశాల్యం పెంచాలని, ఆయకట్టు రైతులకు నాలుగు తడులు నీళ్లు వదలాలని డిమాండ్ చేశారు. కోయిల్‌సాగర్‌తో పాటు ఇతర ప్రాజెక్టులపై వెంటనే ఐడీబీ సమావేశాలు ఏర్పాటు చేయాలని కోరారు.

ఎన్నికలకు సన్నద్ధం కండి

- బీజేపీ నాయకులు మంత్రి శ్రీనివాసులు

విజయక్రాంతి, నిజామాబాద్‌అర్బన్: త్వరలో జరిగే పంచాయతీ ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని భారతీయ జనతాపార్టీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి మంత్రి శ్రీనివాసులు పిలుపు నిచ్చారు. శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో 2018 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై సమీక్ష పార్టీ జిల్లా అధ్యక్షులు పల్లె గంగారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమీక్ష సమావేశానికి జిల్లా ఇన్‌చార్జ్ వెంకట రమణి హాజరుకాగా, ముఖ్యఅతిథిగా రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి మంత్రి శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గాల వారీగా పార్టీ అభ్యర్థికి వచ్చిన ఓట్ల సరళిని పరిశీలించారు. ఎన్నికలలో ఓటమికి గల కారణాలను విశ్లేషించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాసులు మాట్లాడుతు... అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను సమీక్షించుకుని గ్రామపంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని కోరారు. జనవరి 16 నుంచి ఫిబ్రవరి 22 వరకు కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను లబ్ధిదారులకు చేరేవిధంగా లబ్ధిదారులతో సంప్రదింపుల ప్రముఖులు గడపగడపకు సమావేశాలను నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలి

విజయక్రాంతి, నాగర్‌కర్నూల్: రాబోయే స్థానిక పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కొండా మణెమ్మ కోరారు. శనివారం నాడు జిల్లా కేంద్రంలోని ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. స్థానిక సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా జిల్లాలో ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన సర్పంచ్ అభ్యర్థులకు ప్రజల నుండి మద్దతు లభిస్తుందని వివరించారు.అధికార పార్టీ నాయకులు గ్రామాలలో నజరానాల పేరుతో డ్రామాలు ఆడుతున్నారని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు అన్ని గ్రామాల్లో బరిలో ఉంటారని ఆమె తెలిపారు. గ్రామాలలో కార్యకర్తలు అధికార పార్టీ ప్రలోభాలకు లొంగవద్దని కోరారు.

అజ్ఞాత దళనేత రామన్న అరెస్ట్

విజయక్రాంతి, మహబూబాబాద్: గత 22 సంవత్సరాలుగా వివిధ హోదాలలో, వివిధ ప్రాంతాలలో అజ్ఞాతంగా పనిచేస్తూ 4 హత్యలు, 2 పర్యాయాలు పోలీసులతో ఎదురు కాల్పుల కేసులు, అనేక బలవంతపు వసూళ్ళు, కాంట్రాక్టర్లను బెదిరించిన కేసులలో నేరస్తుడైన బయ్యారం మండలం బాలాజీపేటకు చెందిన అజ్ఞాత దళనేత, సీపీఐఎంఎల్ (ఎన్‌డీ) రాష్ట్ర కమిటీ సభ్యులు సింగనబోయిన వీరభద్రం అలియాస్ రామన్నను అరెస్ట్ చేశామని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి తెలిపారు. శనివారం నాడు స్థానిక టౌన్ పోలీస్ స్టేషన్ కాన్ఫరెన్స్ హాలులో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. శనివారం ఉదయం డోర్నకల్ మండలం వెన్నారం గ్రామం చెరువు కట్ట వద్ద అశోక్, బెజ్జం ప్రతాప్, ఇతర దళ సభ్యులతో కలిసి తుపాకులు దాచిపెట్టి సాధారణ దుస్తులతో వచ్చి గ్రామపంచాయతీ ఎన్నికల గురించి కొంత మంది ఎన్‌డీ పార్టీకి చెందిన గ్రామస్తులను పిలిపించుకొని సమావేశం అవుతుండగా, సమాచారం అందుకున్న డోర్నకల్ పోలీస్ సీఐ జే.శ్యాంసుందర్, ఎస్ఐ ఏ.రవీందర్ వారి సిబ్బందితో పాటు స్పెషల్ పార్టీతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని రామన్నను ఒక బ్యాగుతో సహా అరెస్ట్ చేయడం జరిగిందని తెలిపారు. మిగతావారు పరారీలో ఉన్నారని, వారిని త్వరలో పట్టుకుంటామని ఎస్పీ అన్నారు.

మక్తల్ బంద్ సంపూర్ణం

విజయక్రాంతి, మక్తల్: మక్తల్ నియోజకవర్గాన్ని డివిజన్‌గా ఏర్పాటు చేయాలని, డివిజన్ కేంద్రం ఏర్పాటుకు మక్తల్ అన్ని విధాలుగా అనుకూలంగా ఉందని కోరుతూ శనివారం మక్తల్ పట్టణంలో రెవెన్యూ డివిజన్ సాధన సమితి, అఖిల పక్షం ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ సంపూర్ణమైంది. ఈ సందర్భంగా మక్తల్ పట్ణంలోని వ్యాపార సముదాయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు బంద్‌కు పూర్తిగా సహకరించారు. ఈ సందర్భంగా పలువురు అఖిలపక్షం నాయకులు, సాధన సమితి సభ్యులు మాట్లాడారు.

లెక్క తప్పిందా.. పదవి గోవిందా...

- రంగంలోకి 7 ప్రత్యేక నిఘా బృందాలు
- రోజువారీ వ్యయం అంచనా వేసేందుకు ప్రత్యేక వ్యవస్థ
- అభ్యర్థుల ప్రచార తీరుపై నిరంతర పర్యవేక్షణ
- సోషల్ మీడియాపైనా నిఘా



విజయక్రాంతి, మహబూబ్‌నగర్: బలం ఉన్న వాడిదే రాజ్యంగా మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికల సంఘం నిర్ధారించిన మేరకే డబ్బులు ఖర్చు చేయాలంటే పంచాయతీ ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. ఎలాగైనా ఎన్నికల్లో గెలిచి తమ సత్తా నిరూపించుకోవాలనే దిశగా స్థానికులు ఆలోచిస్తుండగా ప్రభుత్వ నిబంధనలు కఠినతరం కావడంతో వేరే దారులు వెతుక్కుంటున్నారు. లెక్క తప్పిందా... పదవి గోవిందా... అనే విషయాన్ని ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులంతా గుర్తించుకొని మసులుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నిబంధనలను ఉల్లంఘిస్తే అసలుకే ఎసరు వచ్చే పరిస్థితులు నెలకొన్నాయి. నిర్దేశించిన పరిమితికి మించి ఖర్చు చేసినట్లు తేలితే ఎన్నికైన వారిని కూడా అనర్హులుగా ప్రకటించేలా నిబంధనలు మరింత కఠినతరం చేశారు. అభ్యర్థులు విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేయకుండా ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. కొత్త పంచాయతీరాజ్ చట్టం ప్రకారం గ్రామ జనాభాకు అనుగుణంగా ఎన్నికల వ్యయాన్ని నిర్ణయించింది. గతంలో నిర్దేశించిన ఎన్నికల వ్యయం కంటే ఈ ఎన్నికల్లో వ్యయ పరిమితిని పెంచుతూ ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకొంది. రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత తొలిసారిగా జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థులు విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు చేయకుండా ఎన్నికల సంఘం కఠినంగా వ్యవహరించబోతుంది. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల సంఖ్య గతంలో కంటే రెండు, మూడింతలు పెరిగే అవకాశం ఉండడంతో ప్రత్యేక నిఘా బృందాలను రంగంలోకి దించనున్నారు. ప్రతి మండలానికి అయిదు నుంచి ఎనిమిది వరకు ఈ బృందాలను రంగంలోకి దించనున్నారు. కొత్త పంచాయతీరాజ్ చట్టంలో రూపొందించిన ఎన్నికల నిబంధనలను బరిలో ఉండే ఉండే అభ్యర్థులు విధిగా పాటించాల్సి ఉంటుంది. నామినేషన్లు దాఖలు చేసినప్పటి నుంచి అభ్యర్థులపై పర్యవేక్షణ బృందాల నిఘా ఉంటుంది. తమకు నిర్దేశించిన పంచాయతీల్లో అభ్యర్థులు రోజువారీ ఎన్నికల వ్యయాన్ని పర్యవేక్షక నిఘా బృందాలు అంచనా వేస్తూ రిటర్నింగ్ అధికారికి అందజేయనున్నారు. నిబంధనలను ఉల్లంఘించినట్లు వెల్లడైతే మాత్రం సంబంధిత అభ్యర్థి ఎన్నికల్లో గెలుపొందినా అనర్హుడిగా ప్రకటించే అవకాశం ఉంది. ఎన్నికల బరిలోకి దిగే అభ్యర్థులు తమ ప్రచారం కోసం ఉపయోగించే వారి వాహనాల వెంటనే తిరిగే నాయకులు, కార్యకర్తల మద్దతుదారులకయ్యే ఖర్చులను కూడా రోజువారీగా లెక్కించనున్నారు. ఎన్నికల ప్రచారానికి వినియోగించే జెండాలు, బ్యానర్లు, కార్యకర్తలకయ్యే భోజనం ఖర్చులను కూడా ఈ బృందాలు పరిగణలోకి తీసుకుంటాయి. ప్రతి మూడు రోజులకు ఒకసారి అభ్యర్థులకు సంబంధించిన ఎన్నికల ఖర్చుల వివరాలను సంబంధిత రిటర్నింగ్ అధికారికి అందజేస్తాయి. ఎన్నికల సంఘం ఆదేశాల ఏరకు పర్యవేక్షణ బృందాలు నియామకంపై కలెక్టర్ దృష్టి సారించారు. నోటిఫికేషన్ విడుదలయ్యే నాటికి పర్యవేక్షణ నిఘా బృందాలను నియమించనున్నారు.

ప్రచారంపై ప్రత్యేక నిఘా

ప్రచారంలో అభ్యర్థులు వ్యవహరిస్తున్న తీరు, సామాజిక మాధ్యమాల్లో పోస్టులు, ధన ప్రభావం తదితర విషయాలపై పూర్తి సమాచారం సేకరించనున్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో ఎక్కడ కూడా కోడ్ ఉల్లంఘన జరగకుండా పకడ్బందీగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ అధికారులను ఆదేశించారు. సామాజిక మాధ్యమాల్లో ప్రసారమౌతున్న పోస్టులపై కూడా నిఘా అధికారులు దృష్టి కేంద్రీకరించనున్నారు. ఎన్నికల నియమావళిని అతిక్రమించేలా ఉన్న పోస్టులపై ఎన్నికల సంఘానికి నివేదిక పంపించనున్నారు.

నగర పంచాయతీలో రోడ్లు ఆగమాగం

- మిషన్ భగీరథ పేరిట మెయిన్ రోడ్లకు భంగపాటు
- అధికారుల నిర్లక్ష్యంపై ప్రజలు ఆవేదన

విజయక్రాంతి, కొల్లాపూర్: కొల్లాపూర్ పట్టణంలో పుష్కరాల పుణ్యాన వచ్చిన సీసీ రోడ్లు, మిషన్ భగీరథ పేరిట ఆగమాగం అవుతున్నాయి. 2016 పుష్కరాల పుణ్యాన కొల్లాపూర్ పట్టణానికి సీసీ రోడ్లు, మెయిన్‌రోడ్లు బటర్‌ఫ్లై లైట్లతో కనిపించడానికి అందంగా వేశారు. కానీ మిషన్ భగీరథ కార్యక్రమం చేపట్టినప్పటి నుంచి పట్టణంలో మెయిన్‌రోడ్లపై గుంతలు తీసి నాణ్యతతో ఉన్న క్వాలిటీని తవ్వేస్తున్నారు. మరో వైపు పట్టణంలో సీసీ రోడ్లు ఇంటింటికి నల్లా కనెక్షన్లు అంటూ జేసీబీలతో గుంతలు తవ్వి నల్లా కనెక్షన్లు ఇవ్వకుండా మధ్యలోనే వదిలేశారు. ఇదంతా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గల్లీల్లో మోరీ కాలువలు ఏర్పడి దుర్వాసన వెదజల్లుతోంది. మిషన్ భగీరథ పేరిట రోడ్లకు అంతరాయం కలిగి ప్రభుత్వ సొమ్ముకు గండి పడుతోంది. మిషన్ భగీరథ మంచి సంక్షేమ పథకం అయినా అధికారుల నిర్లక్ష్యంతో ఎక్కడిక్కడ తొవ్వి వదిలేశారు. ప్రభుత్వ సొమ్ముకు గండిపడుతుందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. చేసిన రోడ్లను తవ్వుకుంటూ చేసిందే మళ్లీమళ్లీ చేస్తూ ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా నగర పంచాయతీ పరిధిలో రోడ్లకు మరమ్మతులు చేయకుండా వేసిన సీసీ రోడ్లను తవ్వి వదిలేస్తున్నారు. సీసీ రోడ్లను తవ్విన వెంటనే కనెక్షన్ ఇచ్చి పూడ్చివేయాలి కానీ, అలా చేయకుండా సగంలోనే వదిలేస్తున్నారు. ఇదివరకు స్థానిక ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పట్టణ వీధుల్లో తిరిగి నగర పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు. ఎంతో క్వాలిటీతో వేసిన సీసీ రోడ్లను, మేయిన్ రోడ్డును తొవ్వడంతో ప్రభుత్వ సొమ్ము ఆగమాగం అవుతుందని ప్రజలు అంటున్నారు. మరో వైపు క్వాలిటీతో వేసిన రోడ్లకు భంగం వాటిల్లుతుందని ప్రజలు సూచిస్తున్నారు .అధికారులు స్పందించి తొవ్విని గుంతలు తక్షణమే పూడ్చి వేసి త్వరగా ఇంటింటికి నల్లా కనెక్షన్లను ఇస్తే బాగుంటుందని ప్రజలు అంటున్నారు.

మార్కెట్‌కు భారీగా తరలివస్తున్న వేరుశనగ

- క్వింటాల్ ధర మొదటి రకం రూ.5,900, రెండో రకం రూ.4,500

విజయక్రాంతి, వనపర్తి: వనపర్తి తాలుకాలో ఈ ఏడాది రబీలో అన్నదాతలు అత్యధిక విస్తీర్ణంలో వేరుశనగ పంట సాగు చేశారు. ముందుగా పంట సాగు చేసిన రైతులు తమ పంటను విక్రయించడానికి వనపర్తి వ్యవసాయ మార్కెట్‌కు తరలిస్తున్నారు. గత వారం రోజుల నుంచి వేరు శనగను రైతులు తీసుకువస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ మార్కెట్‌లో రైతు ఆశించిన దాని కన్నా అధిక రేటుకు వేరుశనగ అమ్ముడుపోవడంతో ఓకింత ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో వేరుశనగ వ్యాపారులు మూడు నాలుగు రకాల రేట్లు వేస్తున్నారు. ప్రభుత్వం క్వింటాల్ వేరు శనగకు రూ.4890 మద్దతు ధర నిర్ణయించింది. అయితే, తాలు, తేమ, వంగడాల నాణ్యతలను బట్టి వేరుశనగ కాయలకు ధర నిర్ణయిస్తున్నారు. వేరుశనగలో కే–6 రకంకు వ్యాపారులు అధిక ధరలు వేస్తున్నారు. అదే విధంగా ట్యాగ్ –24 రకంకు మార్కెట్‌లో కొంత తక్కువ ధరలు వేస్తున్నారు. సెప్టెంబర్, అక్టోబర్ మొదటి వారంలో వేరుశనగ సాగు చేసిన రైతుల పంటలు చేతికి వచ్చాయి. పొలాల్లో కోసిన వేరు శనగ కాయలను అన్నదాతలు నేరుగా వ్యవయ మార్కెట్‌కు తీసుకు వస్తున్నారు. వనపర్తి తాలుకాలోనే 49వేల ఎకరాలకు పైగా వేరుశనగ పంట సాగు చేశారు. అయితే వనపర్తి వ్యవసాయ మార్కెట్‌లో వివిధ ప్రాంతాలకు చెందిన వ్యాపారులు వేరుశనగ కాయలను కొనుగోలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం వేరుశనగకు క్వింటాల్ రూ.4,890 మద్దతు ధర నిర్ణయింది. వ్యవసాయ మార్కెట్‌లో మొదటి రకం వేరుశనగ కాయలకు రూ.5,900, రెండో రకం వేరుశనగను రూ.4,500లకు కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌లో ఎక్కువ మొత్తంలో రెండో రకం ధరకు వ్యాపారులు వేరుశనగ కాయలను కొనుగోలు చేస్తున్నారని వివిధ గ్రామాల నుంచి మార్కెట్‌కు వచ్చిన రైతులు వాపోతున్నారు. రెండో రకం వేరుశనగ కాయలను కూడా మద్దతు ధర రూ.4,890కి కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పంచాయతీ బరిలో... నేనంటే నేను

- బుజ్జగించలేక తలలు పట్టుకుంటున్న నాయకులు

విజయక్రాంతి, డోర్నకల్: తెలంగాణ ప్రభుత్వం అనుకున్నట్లుగానే పంచాయతీ రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వడంతో పల్లెలో పంచాయతీ వేడి మొదలైంది. ఒకే పార్టీ మద్దతు కోసం రెండు, మూడు వర్గాల నాయకులు నేనంటే నేనని.. సమరానికి సై అంటుండడంతో నియోజకవర్గంలోని ప్రధాన పార్టీల్లో పంచాయతీ పోరు అగ్ని పరీక్షగా మారింది. నియోజకవర్గంలో 171 గ్రామ పంచాయతీలున్నాయి. కొత్త పంచాయతీల ఏర్పాటు తరువాత చాలా మంది యువకులు, సీనియర్లు పంచాయతీ ఎన్నికలపై ఆశలు పెంచుకున్నారు. ఎలాగైనా పంచాయతీ పీఠాన్ని కైవసం చేసుకోవడానికి నామినేషన్ వేయకుండానే ఎవరికి వారే ముందస్తుగా ప్రచారం చేసేకోవడం మొదలు పెట్టారు. దీంతో రాజకీయంగానూ పార్టీల్లో గ్రూపులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రతి పంచాయతీ నుంచి రెండు, మూడు వర్గాలు బరిలో దిగేందుకు సిద్ధమవుతండడంతో ప్రధాన పార్టీల నాయకులకు పంచాయతీ పోరు తలనొప్పిగా మారింది.

నాయకుల వద్దకు పంచాయతీ పోరు

టీఆర్ఎస్ పార్టీ తరుపునే చాలా మంది ఆశావహులు బరిలో దిగేందుకు మొగ్గు చూపుతున్నారు. పార్టీ అధికారంలో ఉంది కాబట్టి పనులు చేసుకోవచ్చనే ధీమాతో పార్టీ మద్దతుకోసం ప్రయత్నిస్తున్నారు. తమ అనుచరులతో కలసి ఎమ్మెల్యే చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. సార్ అసెంబ్లీ ఎన్నికల్లో మీకోసం పని చేసినం. రిజర్వేషన్ కూడా అనుకూలంగా వచ్చింది. మద్దతివ్వాలని కోరుతున్నారు. ఇలా ప్రతి పంచాయతీ నుంచి ఇద్దరు, ముగ్గురు నాయకులు బరిలో దిగేందుకు మొగ్గు చూపుతుండడంతో ఎమ్మెల్యేకు పంచాయతీ పోరు తలనొప్పిగా మారింది. ఇరువర్గాల వారిని బుజ్జగించే పనిలో పడ్డారు. ఏకగ్రీవం చేసుకుంటే ఊరికి లాభం చేకూరుతందని, లేదా ఎవరు బరిలో ఉంటారో మీరే నిర్ణయించుకోవాలంటూ నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నారు.

మహిళలే.. మహారాణులు

- సర్పంచ్ ఎన్నికల్లో సత్తా చాటనున్న మహిళలు
- 53 పంచాయితీల్లో మహిళలకు స్థానం
- భర్తల పెత్తనం కొనసాగుతుందా..?



విజయక్రాంతి, కామారెడ్డి: కామారెడ్డి నియోజకవర్గంలో త్వరలో జరగబోయే సర్పంచ్ ఎన్నికల్లో మహిళలు తమ సత్తా చాటనున్నారు. నియోజకవర్గంలో కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీలతో కలుపుకుని ప్రస్తుతం 99 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఈ గ్రామ పంచాయతీల్లో జరగబోయే సర్పంచ్ ఎన్నికల్లో మహిళలకే అత్యధిక ప్రాధాన్యం లభించింది. మొత్తం 99 పంచాయతీల్లో 53 స్థానాల్లో మహిళలే సర్పంచులుగా పోటీ చేయనున్నారు. దీంతో సరైన మహిళా అభ్యర్థుల వేటలో నాయకులు తలమునకలవుతున్నారు.

గెలిచే వారెవరు

ప్రస్తుతం జరిగే ఎన్నికల్లో ప్రధాన పార్టీలు ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన కాంగ్రెస్, బీజేపీ పార్టీలు స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని చూస్తున్నాయి. దానికోసం గ్రామాల వారీగా సమీక్షలు జరుపుతున్నారు. ఎలాగైనా సర్పంచ్ ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపించుకోవాలని తహతహలాడుతున్నాయి. గ్రామాల్లో తమ పార్టీలకు చెందిన వ్యక్తుల సతీమణులతో సంప్రదింపులు జరుపుతున్నారు. దానితో పాటు గ్రామాల్లో పలుకుబడి ఉన్న మహిళలను తమ వైపు తిప్పుకునేలా ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. సాధ్యమైనంత వరకు గ్రామాల్లో ఎన్నికలు లేకుండా ఏకగ్రీవం చేసేలా అధికార పార్టీ నాయకులు పావులు కదుపుతున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉండటంతో పాటు ఏకగ్రీవ గ్రామాలకు ప్రభుత్వం నుంచి అత్యధిక నిధులు వచ్చేలా చేసి గ్రామాలను అభివృద్ధి చేస్తామని చెబుతున్నారు. మరి స్థానిక ఎన్నికల్లో గెలిచే పార్టీలు ఎవరివో అని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

పేరుకే మహిళా సర్పంచులా..?

గతంలో సర్పంచ్‌లుగా గెలిచిన మహిళలు పేరుకు మాత్రమే సర్పంచ్‌లుగా కొనసాగారు. వారి భర్తలే పెత్తనం మొత్తం సాగించారు. చదువుకున్న మహిళలు ఉన్నా రాజకీయాల పట్ల అవగాహన లేకపోవడంతో భర్తలు చెప్పిందే వేదంగా పాలన సాగింది. గ్రామ పంచాయతీ సమావేశాల్లో సైతం వారు చెప్పిందే సాగింది. మండల కార్యాలయాల్లో, పోలీసు స్టేషన్లలో వీలైనంత హుందాతనాన్ని ప్రదర్శించారు. దాంతో పేరుకే మహిళా సర్పంచ్‌గా ముద్ర పడిపోయింది. ప్రస్తుతం ఈ విధానానికి ప్రభుత్వం స్వస్తి పలకాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే గతంలో గ్రామాల్లో రాజకీయాలు ఇప్పటి మాదిరిగా ఉండేవి కాదు. కానీ ప్రస్తుతం సీన్ మారింది. అవతలి పార్టీ వాళ్ళు వార్డు మెంబర్లుగా ఉంటే ప్రతి సమావేశంలో గొడవలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో రాజకీయ వైరం ఏర్పడే అవకశాలు మెండుగా ఉన్నాయి. గత 5 సంవత్సరాలుగా గ్రామాల్లో గ్రూపు రాజకీయాలు చాలా తయారయ్యాయి. వచ్చే రోజుల్లో ఇదే విధానం కొనసాగితే పచ్చని పల్లెల్లో చిచ్చు రేగే ప్రమాదాలు ఉన్నాయి. అదే జరిగితే ఇటు గ్రామానికి గాని ఇటు ప్రభుత్వానికి ప్రమాదమని చెప్పవచ్చు.



అధికార పార్టీ ప్రలోభాలకు లొంగకండి

- గ్రామాలకు ఉపయోగపడే వారినే ఎన్నుకోండి
- మాజీ మంత్రి డీకే అరుణ

విజయక్రాంతి, జోగుళాంబ గద్వాల: గ్రామాలకు సేవ చేస్తారనుకునే అభ్యర్థులను వచ్చే సర్పంచ్ ఎన్నికల్లో గెలిపించుకోవాలని, అధికార పార్టీ ప్రలోభాలకు లొంగవద్దని మాజీ మంత్రి డీకే అరుణ అన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని సమాయత్తం చేసేందుకు శనివారం ధరూరు మండల పరిధిలోని అల్వాలపాడు తెలుగోని పల్లెయ్య ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో రెండు మండలాలకు సంబంధించిన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో మంచి వ్యక్తులను సర్పంచ్‌లుగా ఎన్నుకుంటేనే గ్రామం అభివృద్ధి చెందుతుందని, గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉంటుందన్నారు. ఇప్పుడు డబ్బు ప్రలోభాలకో, లేక ఇతర ఒత్తిళ్లకో తలొగ్గి అభ్యర్థులను ఎన్నుకుంటే ఐదేళ్లు పశ్చాత్తాపడాల్సి వస్తుందన్నారు. అందువల్ల గ్రామాల్లోని ప్రజలంతా ఆచితూచి వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇప్పటికీ కాంగ్రెస్ పార్టీకి అన్ని గ్రామాల్లో మంచి పట్టుందని, భేషజాలకు పోకుండా గ్రామాల్లో అధికార పార్టీని ఎదుర్కోవడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలంతా ఏకతాటిపైకి వచ్చి సర్పంచ్ ఎన్నికల బరిలో నిలబడాలన్నారు. ఇప్పుడు ఎవరైతే సర్పంచ్ కోసం త్యాగాలు చేస్తారో వారికి భవిష్యత్తులో గుర్తింపు ఉంటుందన్నారు. గెలిచే అభ్యర్థులకు, గ్రామంలో మంచి పేరున్న వారిని సర్పంచు ఎన్నికల్లో నిలబెట్టి విజయం సాధించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదన్నారు. అందుకోసం అందరూ కలిసికట్టుగా ప్రయత్నం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. మనలో మనం పోటీపడితే ప్రత్యర్థుల గెలుపునకు సహకరించిన వారమవుతామన్నారు. దాన్ని దృష్టిలో ఉంచుకొని ఎవరూ వెన్నుపోటు పొడవకుండా విజయానికి బాటలు వేయాలన్నారు. టీఆర్ఎస్ పార్టీ అన్నీ అబద్ధాలే చెబుతుందని, ఆ మాటలు నమ్మి రాష్ట్ర ప్రజలంతా మోసపోయారన్నారు. మళ్లీ ఇప్పుడు అబద్ధాలు చెప్పి సర్పంచ్ ఎన్నికల్లో గెలిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. దీనిని ప్రజలు గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మెజార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొంది కాంగ్రెస్ పార్టీని పట్టును నిలపాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు గడ్డం కృష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, పద్మారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో అధిక స్థానాలు సాధిద్దాం

- టీపీసీసీ మాజీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య

విజయక్రాంతి, జనగామ: రానున్న పంచాయతీ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు సాధిద్దామని టీపీసీసీ మాజీ అధ్యక్షులు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను చూసి కార్యకర్తలు అధైర్యపడి కృంగిపోకూడదన్నారు. అంతేకాక ఎన్నికలు అన్నప్పుడు గెలుపు ఓటములు సహజమని, మీ వెంట నేను ఉంటానని ధైర్యం చెప్పారు. సర్పంచ్ ఎన్నికల్లో విజయం సాధించి తిరిగి కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చి జనగామ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరవేసే విధంగా ప్రతి కార్యకర్త కష్టపడాలని దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు బరిలో వుంటారని, ఎన్నికల కోసం మండల అధ్యక్ష, కార్యదర్శులతో పాటు మండల సీనియర్ నాయకులతో మండల సమన్వయ కమిటీ ద్వారా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని, కావున పోటీచేసే అభ్యర్థులు క్రమశిక్షణ కలిగిన కాంగ్రెస్ నాయకులు సమన్వయ కమిటీలకు సహకరించాలని పొన్నాల సూచించారు.



జర్నలిస్టులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిస్తా



- ఎమ్మెల్యే నిరంజన్‌రెడ్డి

విజయక్రాంతి, వనపర్తి: జర్నలిస్టుల యూనియన్లకు అతీతంగా వనపర్తి జిల్లా కేంద్రంలో విలేకరుల సమ్మేళనం నిర్వహిస్తానని వనపర్తి ఎమ్మెల్యే సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. శనివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఎంవైయస్ బుక్విట్ హాల్లో టీయూడబ్ల్యుజే–ఐజేయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నిరంజన్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. వనపర్తిలో విలేకర్ల సమ్మేళనం ఏర్పాటు చేసి రాష్ట్ర జర్నలిస్టు నాయకులను ఆహ్వానిస్తానని చెప్పారు. వారి ముందే విలేకర్ల సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు. వనపర్తిలో విలేకర్ల సంఘం భవన నిర్మాణానికి నిధులు కేటాయిస్తానని చెప్పారు. జర్నలిస్టులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించడానికి స్థలం కోసం అధికారుల దృష్టికి తీసుకుపోతానని తెలిపారు. అనంతరం నిరంజన్‌రెడ్డికి విలేకర్లు శాలువా కప్పి పూల మాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ రమేష్‌గౌడ్, గౌని బుచ్చారెడ్డి, సీనియర్ జర్నలిస్టులు నాగవరం బాలస్వామి, ఊషన్న, ఓంకారు, పోలిశెట్టి బాలకృష్ణ, ప్రశాంత్, మధు, చారి, కొండన్న తదితరులు ఉన్నారు.

శివునిపల్లిలో 4వ రోజుకు చేరిన దీక్షలు

విజయక్రాంతి, స్టేషన్‌ఘన్‌పూర్: గ్రామ పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లలో తమ గ్రామానికి అన్యాయం జరిగిందని, వెంటనే రిజర్వేషన్‌ను మార్చాలంటూ స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని శివునిపల్లి గ్రామస్తులు రాజకీయాలకు అతీతంగా రిలే దీక్షలను చేపట్టారు. శనివారం నాటికి నాలుగో రోజుకు చేరకున్న దీక్షలను ఉద్దేశించి ఎంపీపీ వంగాల జగన్మోహన్‌రెడ్డి, టీఆర్ఎస్ జిల్లా ప్రతినిధి బెలిదె వెంకన్నలు మాట్లాడారు. శివునిపల్లి గ్రామంలో 24 మంది ఎస్టీ ఓటర్లు ఉండగా ఎస్టీ జనరల్ స్థానంగా రిజర్వు అయిందని, బీసీ, ఎస్సీలు అత్యధికంగా ఉన్నప్పటికీ రిజర్వేషన్ ఎస్టీలకు కేటాయించడాన్ని గ్రామస్తులు తట్టుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో 6242 మంది ఓటర్లు ఉండగా, ఇందులో ఎస్సీలు 1226 మంది, ఎస్టీలు 627 మంది ఉన్నారు. మిగిలిన 4389 మంది బీసీ, ఓసీలు ఉన్నారు. శివునిపల్లి గ్రామ పరిధిలో ఎస్టీ బాలికల వసతి గృహం ఉండగా అందులో 627 మంది బాలికలు ఉన్నారు. వారందరినీ కూడా ఒకే ఇంటి నంబర్‌పై నమోదు చేయడంతో 2011 జనాభా ప్రకారం ఎస్టీల సంఖ్య అధికంగా కనిపిస్తున్నది. ప్రభుత్వం పునరాలోచించి శివునిపల్లి ఎన్నికలను నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు.

బొగ్గుగని కార్మికులకు పురస్కారం

విజయక్రాంతి, రామగుండం: విధి నిర్వహణలో అందించిన సేవలకు గాను రామగుండం రీజియన్‌లోని జిడికె–11 బొగ్గు గని కార్మికులకు పురస్కారం లభించింది. ఈ మేరకు రోలింగ్ ట్రోఫీని శనివారం అధికారులు కార్మికులకు అందించారు. గనిలోని కంటిన్యూయర్స్ మైనర్ సెక్షన్‌లో శుక్రవారం అత్యధిక బొగ్గు ఉత్పత్తిని సాధించినందుకు గాను ఈ పురస్కారాన్ని అందిస్తున్నామన్నారు. ఒకే రోజు కంటిన్యూయర్స్ మైనర్‌లో 19,130టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయడంతో పాటు డిసెంబర్ నెలలో నిర్దేశించిన 38వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి గాను 56,615టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించి 149శాతానికి చేరుకున్నారన్నారు. కార్మికులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఏ. మనోహర్, ఏ. నెహ్రూ, రమేష్ బాబు, కె. సురేష్ కుమార్, నర్సింహా రావు, బంగారు సారంగ పాణి తదితరులున్నారు.

రిజర్వేషన్‌లు పాత పద్ధతిలోనే అమలు చేయాలి

విజయక్రాంతి, ఉట్నూర్: ఏజెన్సీలోని ఏరియాలోని పంచాయతీ ఎన్నికల్లో పాత పద్ధతిలో నిర్వహించిన రిజర్వేషన్‌లనే ఎన్నికల కమిషన్ అమలు చేయాలని ఏజెన్సీస్థానిక ఎన్నికల రిజర్వేషన్‌ల సాధన కమిటీ అధ్యక్షుడు నర్సయ్య డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఏజెన్సీలోని పాత పద్ధతి రిజర్వేషన్‌లను అమలు చేస్తూ వచ్చిందన్నారు. ప్రస్తుత ఎన్నికల కమిషన్ మాత్రం స్థానిక పంచాయతీ ఎన్నికల్లో ఎస్టీ/ఆన్ రిజర్వ్ అని కేటాయించడంపై తీవ్రంగా వ్యతిరేకిస్తున్నమన్నారు. అంబేద్కర్ కల్పించిన హక్కులను ఈ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ఖచ్చితంగా జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్‌లు ఏజెన్సీలోని దళితులకు మాత్రమే కేటాయించాలని డిమాండ్ చేశారు. దీనిపై పాత పద్ధతి రిజర్వేషన్‌లు అమలు చేయాలని డిమాండ్‌తో ఆర్డీవోకు సైతం వినతి పత్రం అందజేశారు. అదే విధంగా జిల్లా కలెక్టర్‌తో పాటు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు విన్నవిస్తామన్నారు. స్పందించకుంటే ఎన్నికలను బహిష్కరించడంతో పాటు ఆందోళన కార్యక్రమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కమిటీ సభ్యులు విజయ్‌కుమార్, మహేందర్, లాజర్, రాజేశ్వర్, కేశవ్, గంగేశ్వర్, మల్లయ్యలు తదితరులున్నారు.

ఎటు చూసినా.. గుంతలే!

- తరచూ ఇబ్బందుల భారిన పడుతున్న జనం
- ఇష్టారాజ్యంగా వదిలేసిన సంబంధిత కాంట్రాక్టర్



విజయక్రాంతి, బోథ్: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పైప్‌లైన్ పథకంతో సామాన్య ప్రజలకు మాత్రం తిప్పలు తప్పడం లేదు. బోథ్ మండలకేంద్రంలోని ప్రధాన వీధుల గుండా ఈ పథకం పేరుతో తవ్వి పైపులు వేసిన అనంతరం గుంతలు పూడ్చకపోవడంతో వాహనదారులు తరచూ ప్రమాదాల భారీన పడుతున్నారు. బస్టాండ్ మెయిన్ రోడ్ నుండి వెళ్లే లింక్ రోడ్ పాత హనుమాన్ వాడ, భగత్ సింగ్ చౌక్‌ల వద్ద పెద్ద పెద్ద గుంతలు ప్రమాదకరంగా మారాయి. ఆ గుంతలలో నుండి నీరు లీక్ కావడంతో మడుగులుగా మారి రోడ్లపై పారి పూర్తి బురదమయంగా మారి నడవడానికి ఇబ్బందిగా మారింది. కనీసం లీకేజ్ సమస్యలనైనా సరిచేసి రోడ్లు బురదమయం కాకుండా చూడాలని కోరుతుండగా సంబంధిత గుత్తేదారు, అధికారులు చోద్యం చూస్తున్నారని ప్రజానీకం మండి పడుతున్నారు. ఇంటింటికి నీరిచ్చు డేమో కానీ ఉన్న బంగారం లాంటి రోడ్లను డ్రిల్ మిషన్‌ల ద్వారా నాశనం చేసి గుత్తేదారు పనులు పూర్తయ్యాక ఇటువంటి ప్రధాన సమస్యలను వదిలేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయా కాలనీల వాసులు, మహిళలు, యువకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి ప్రమాదకరంగా మారిన గుంతలను పూడ్చాలని కోరుతున్నారు.

మిషన్ భగీరథ పథకం పేరుతో ఇంటింటికి నల్లా కనెక్షన్ కోసం రోడ్లను తవ్వి పూడ్చకుండా వదిలేసి దాదాపు 3 నెలలు కావస్తుందన్నారు. ఇప్పటికి అధికారులు గుంతలను పూడ్చకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదు తక్షణమే సంభందిత కాంట్రాక్టర్ స్పందించి గుంతలను పూడ్చాలి.

రాజశేఖర్, పాత హనుమాన్‌వాడ

భగత్‌సింగ్ కాలనీలో రోడ్లను తవ్వి పూడ్చకుండా వదిలేశారు. ప్రతి రోజు ఉదయం స్కూల్ బస్సులు, ప్రైవేట్ వాహనాలు ఈ గుంతలలో దిగబడి ప్రమాదపుటంచున విద్యార్థులు ప్రయాణం చేస్తున్నారు. ఇప్పటికైనా సదరు గుత్తేదారు చిన్న పిల్లలనైనా దృష్టిలో ఉంచుకొని సమస్యను తొందరగా పరిష్కరించాలి.

ప్రవీణ్‌కుమార్, భగత్‌సింగ్ చౌక్

అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ



విజయక్రాంతి, చెన్నూర్ (మంచిర్యాల): మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజక వర్గంలోని నూతనంగా ఏర్పడిన పులిమడుగు గ్రామపంచాయితిని ఆరోగ్య హక్కుల వేదిక సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాజలింగు మోతె మాట్లాడుతూ చెన్నూరు నియోజక వర్గంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని ప్రత్యేత అధికారుల అలసత్వంతో గత కొన్ని నెలలుగా అభివృద్ధి చర్యలు ఏమి తీసుకోలేదని ఆయన తెలిపారు. ప్రత్యేక అధికారుల పాలనతో గ్రామాల్లో చెత్తా చెదారం పేరుకుపోయిందని, మురుగునీరు ఎక్కడ పడితే అక్కడ పారుతుందని, రోడ్లు అన్ని అధ్వాన్నంగా తయారయ్యాయని అన్నారు. మిషన్ భగీరథ వలన గ్రామాలు చెరువులను తలపిస్తున్నాయి అలాగే బురదమయంగా రోడ్లు కావడంతో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. ప్రత్యేక అధికారులు గ్రామాల్లో పర్యటించకుండా పదవులు అలంకార ప్రాయంగా మారాయని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా అధికార నాయకులు సమన్వయంతో పనిచేసి గ్రామాలను అభివృద్ధి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నందిపాటు రాజు, కనకరాజు, బుక్య రాజకుమార్, ఆనంద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు
రేషన్ బియ్యం స్వాధీనం



విజయక్రాంతి, కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్, ఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఖాజీపేట్ నుంచి మహారాష్ట్రకు వెళ్ళే భాగ్యనగర్, అజ్ని ప్యాసింజర్ రైళ్లలో తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో సుమారు మూడు లక్షల రూపాయల విలువ చేసే రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుకున్న బియ్యాన్ని కాగజ్‌నగర్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించినట్లు తెలిపారు. ఇటీవల రైళ్లలో ఉత్తర తెలంగాణ జిల్లాలోంచి అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు పలు పత్రికల్లో కథనాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆకస్మికంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులకు పూనుకుంది. అందులో భాగం గానే రేషన్ బియ్యం పట్టుబడింది.

ప్రజాస్వామ్యానికి పత్రికలే పట్టుగొమ్మలు

'విజయక్రాంతి' క్యాలెండర్ ఆవిష్కరణలో పోలీస్ కమిషనర్ సత్యనారాయణ



విజయక్రాంతి, రామగుండం: పత్రికలు ప్రజాస్వామ్య పరిరక్షణకు పట్టుగొమ్మలుగా ఉంటాయని రామగుండం పోలీస్ కమిషనర్ వి. సత్యనారాయణ అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా, పెద్దపల్లి జిల్లాల వేర్వేరు 'విజయక్రాంతి' నూతన సంవత్సర క్యాలెండర్‌ను సిపి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ జీవనములో ఉన్న సమస్యలను, అభివృద్ధిని అద్దంపట్టి పాలకులకే కాకుండా కార్యనిర్వాహణ శాఖలకు పత్రికలు దిక్సూచిగా ఉంటాయన్నారు. సంక్షేమ ఫలాలు ప్రజలు అందుకోవడంలో చైతన్య పరుస్తాయన్నారు. ఈ కోవలో విజయక్రాంతి ముందుకు సాగడం అభినందనీయమన్నారు. అనతికాలంలోనే తెలంగాణ పాఠక లోకానికి విజయక్రాంతి దగ్గర కావాలన్నారు. ఈ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పెద్దపల్లి డిసిపి టి. సుదర్శన్ గౌడ్, అడిషనల్ డిసిపి అడ్మిన్ ఎన్. అశోక్‌కుమార్, అడిషనల్ డిసిపి లాఅండ్ ఆర్డర్ యం. రవికుమార్, గోదావరిఖని ఏసిపి రక్షిత కె. మూర్తి, ఏఆర్ కమాండెంట్ సంజీవ్, పెద్దపల్లి, మంచిర్యాల, జైపూర్, బెల్లంపల్లి ఏసిపిలు వెంకటరమణా రెడ్డి, గౌస్‌బాబా, వెంకట్ రెడ్డి, బాలు జాదవ్, ట్రాఫిక్ వై. వెంకటేశ్వర్ రావులతో పాటు విజయక్రాంతి ఉమ్మడి కరీంనగర్ జిల్లా యాడ్స్ మేనేజర్ ఎలిగేటి కమలాకర్, పెద్దపల్లి జిల్లా యాడ్స్ ఇంచార్జ్ డి. ఆంజనేయులు, సర్క్యులేషన్ ఇంచార్జ్ బుర్ర శంకర్ గౌడ్, మంచిర్యాల జిల్లా యాడ్స్ ఇంచార్జ్ మంచాల మధుకర్, రెండు జిల్లాల సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

మహిళలపై దాడులు
డిగ్నిటీ మార్చ్ అవగాహన

విజయక్రాంతి, పరిగి: మహిళలపై రోజురోజుకు దాడులు పెచ్చుమీరుతున్నాయని దాడులను అరికట్టేలా అవగాహన కల్పించే ఉద్దేశ్యంతోనే డిగ్నిటీ మార్చ్ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నేషనల్ కోఆర్డినేటర్ పి.నవీన్ కుమార్ అన్నారు. ప్రెస్‌క్లబ్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సౌజన్యంతో పరిగి పట్టణంలోని ఏబీఎస్ ప్లాజాలో నిర్వహించిన డిగ్నిటీ మార్చ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ అత్యాచారా బాధితులను గుర్తించి వారికి అండగా ఉంటు అలాంటి సంఘటనలు సమాజంలో పునారావృత్తం కాకుండా బాధితులతో కలిసి డిగ్నిటి మార్చ్ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొని సహకరించిన మీడియా ప్రజాప్రతినిధులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిగ్నిటీ మార్చ్ కన్వీనర్ ఆసిఫ్, ఐవీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు మేఘమాల, పరిగి మాజీ జెడ్పిటీసీ చంద్రయ్య, ఎస్సై హాఫీజ్, టిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చెర్క సత్తయ్య, టి.వెంకటయ్య, మహిళాసమాఖ్య అధ్యక్షురాలు అనూషా, రజకసంఘం జిల్లా అధ్యక్షురాలు వనజ, సుధిక్ష స్కూల్ కరస్పాండెంట్ చంద్రమ్మ, అడ్వకేట్ నరేంద్ర యాదవ్, నాయకులు ముకుంద నాగేశ్వర్, మాధవి, సునిత, వానీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం డిగ్నిటీ మార్చ్ కార్యక్రమం పరిగిలో ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

చెన్నూరులో అటకెక్కిన పారిశుధ్యం



విజయక్రాంతి, చెన్నూర్ (మంచిర్యాల): మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజక వర్గంలో పారిశుధ్యం పనులు అటకెక్కాయి. అధికార యంత్రాంగం అలసత్వం వెరసి ఎక్కడి చెత్త చెదారం అక్కడే పేరుకు పోయింది. చెన్నూరు మున్సిపాలిటిగా అవతరించిన నాటినుంచి ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయలేదని నాయకులు మారినా చెన్నూరు పట్టణంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది. చెన్నూరులో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అయిన శ్రీ జగన్నాథ స్వామి ఆలయం చుట్టూ ఎక్కడ చూసినా చెత్త పేరుకు పోయిన తీరు దర్శనం ఇస్తుంది. ఈ పుణ్య క్షేత్ర దర్శనానికి వచ్చే భక్తులు ముక్కుమూసుకొని స్వామివారిని దర్శించుకు వెళుతున్నారు. చెన్నూరు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా ఇక్కడే దేవుణ్ణి దర్శించుకోవడానికి పెద్ద సంఖ్యలో వస్తారు. ఇప్పటికైనా ఈ పుణ్య క్షేత్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి క్షేత్ర పవిత్రతను కాపాడాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

క్యాన్సర్ నిర్ధారణ ఉచిత శిబిరం

విజయక్రాంతి, కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ పట్టణంలోని శ్రీలక్ష్మి నర్సింగ్ హోంలో శనివారం నిర్వహించిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిభిరానికి విశేష స్పందన లభించింది. సృశ్రత కాన్సర్ హస్పటల్ వారిచే లయన్స్ క్లబ్ ఆఫ్ కాగజ్‌నగర్ కొత్తపేట వారి ఆధ్వర్యంలో శ్రీలక్ష్మి నర్సింగ్ హోంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరానికి స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి లయన్స్ డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, ఎంజెఎఫ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దాదాపు ఈ మధ్యకాలంలో క్యాన్సర్ వ్యాధి భారీన పడి చాలమంది చనిపోతున్నారని, క్యాన్సర్‌ని తొలి దశలోనే గమనించి నిర్ధారించుకుంటే వందశాతం బయటపడ్డటే అని, 70శాతం క్యాన్సర్ మహిళలల్లో బ్రెస్ట్‌క్యాన్సర్ రావడానికి అవకాశం ఉంటుందని అవగాహన కల్పించడా నికికై క్యాన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ ఇంచార్జ్ ప్రొ సతీష్, లయన్స్ క్లబ్ సభ్యులు శ్రీనివాస్, కోశాధికారిమాచర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

విజయక్రాంతి, మంచిర్యాల: మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం టీకానపల్లి గ్రామానికి చెందిన తొడు మల్లమ్మ అనారోగ్యానికి గురికావడంతో వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రెండు లక్షల రూపాయల చెక్కును శనివారం మంచిర్యాల ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మల్లమ్మ అనార్యోగానికి గురై సీఎం సహాయనిధికి అర్జీ పెట్టుకుందని, ఆమెకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 2 లక్షల రూపాయల చెక్కును అందజేశామన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఇలా ఎంతో మంది వారి వైద్య ఖర్చుల నిమిత్తం సహాయం అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టికానపల్లి గ్రామస్తులు, మండల టిఆర్ఎస్ పార్టీ నాయకులు ఉన్నారు.

సామాన్యుల వాకిట్లోకి పోలీసు సేవలు

విజయక్రాంతి, రామగుండం: సామాన్యుల వాకిట్లోకి పోలీసు సేవలు అందే విధంగా పోలీసులు విధి నిర్వహణలో సమర్థతను చూపాలని రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు సూచించారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర డీజీపీ యం. మహేందర్ రెడ్డి పోలీసు ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా ఎన్టీపీసీ జ్యోతినగర్‌లోని మిలీనియం హాల్‌లో రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పోలీసు అధికారులు ఇందులో పాల్గొన్నారు. రామగుండం పోలీసు కమిషనర్ వి. సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణాలో శాంతి భద్రతల పరిరక్షణకు చేపట్టాల్సిన ప్రణాళికాబద్ధ చర్యలను డిజిపి అధికారులకు సూచించారు. నిబద్ధతతో విధులను నిర్వహించి పోలీసు శాఖ ఔనత్యాన్ని పెంపొందించాలన్నారు. ఈ సందర్భంగా రామగుండం కమీషనరేట్ పరిధిలో ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికల నిర్వహణ ప్రశాంతంగా జరిగే విధంగా చర్యలు చేపట్టడాన్ని డీజీపీ అభినందించినట్లు తెలుస్తోంది. కాగా, రాష్ట్ర డీజీపీ ఇచ్చిన నిర్దేశాలతో కమిషనరేట్‌లోని పోలీసు అధికారులు ముందుకు అడుగులు వేయాలని రామగుండం సీపీ సత్యనారాయణ ఆదేశించారు. ఈ సమావేశంలో కమిషనరేట్ అధికారులు టి. సుదర్శన్ గౌడ్, ఎన్. అశోక్ కుమార్, యం. రవికుమార్, రక్షిత కె. మూర్తి, సంజీవ్, వెంకటరమణా రెడ్డి, బాలు జాదవ్, గౌస్‌బాబ, వెంకట్ రెడ్డి, వెంకటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

టిఎస్‌యుటిఎస్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

విజయక్రాంతి, మంచిర్యాల: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (టిఎస్‌యుటిఎస్) డైరీ, క్యాలెండర్‌ను శనివారం మంచిర్యాల జిల్లా విద్యాధికారి కార్యాలయంలో జిల్లా విద్యాధికారి ఎం.ఎ.రషీద్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి మాట్లాడుతూ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (టిఎస్‌యుటిఎస్) చరిత్ర గల సంఘం అని, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంలో ఎప్పుడు ముందుంటుందని అన్నారు. జిల్లాలో 10వ తరగతిలో మంచి ఫలితాలు సాధించి రాష్ట్రంలో మంచిర్యాల జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. ఎస్.టి.యు అధ్యక్ష. ప్రధాన కార్యదర్శులు బిసగౌని శంకర్ గౌడ్, పోకల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు పరచాలని, సి.పి.ఎస్ విధానం రద్దు చేయాలని, ఉద్యోగుల పదవి విరమణ వయస్సు 61 సంIIలకు పెంచాలని, 63 శాతం ఫిట్మెంట్‌తో పి.ఆర్.సి వెంటనే అమలు చేయాలని, పండిట్, పి.ఈ.టి పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలను వీలైనంత త్వరలో పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు కె.భీం రావు, స్టేట్ కౌన్సిలర్, వి.కరుణాకర్, మంచిర్యాల మండల విద్యాధికారి దాసరి శ్రీనివాస్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు భట్టారి వెంకటేశ్వర్లు, సిహెచ్.నాగేందర్ గౌడ్, ట్రేజరర్, ఎ.సత్తయ్య, మంచిర్యాల మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.మల్లేశం, ఎం.సుమ న్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.శ్రీనివాస్, చెన్నూర్ మండల ప్రధాన కార్యదర్శి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

'రోడ్డు' పాలవనున్న 48 కుటుంబాలు!

- పరిహారం ఊసెత్తకుండానే ఇల్లు కూల్చేందుకు అధికారులు సిద్ధం
- పరిహారం ఇచ్చాక ఇండ్లు కూల్చాలంటున్న గ్రామస్తులు



విజయక్రాంతి, వికారాబాద్: గ్రామాల నుంచి మండలాలకు బీటీ రోడ్లు, మండలాల నుంచి నియోజకవర్గ కేంద్రాలకు డబుల్ లైన్ల రోడ్లు విస్తరణ మాట ఎలా ఉన్నా.. పరిహారం ఇచ్చాకే కూల్చాలని ఇళ్ల యాజమానులు డిమాండ్ చేస్తున్నా.. పరిహారం అందకముందే ఇళ్లను కూల్చేందుకు సిద్ధపడుతున్న అధికారుల తీరు పలువురికి ఆగ్రహం తెప్పిస్తోంది. వివరాల్లోకి వెళితే.. ధారూరు మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ 100 ఫీట్ల మేర చేయడంతో అదే తీరుగా కెరెళ్లి గ్రామంలో సైతం 100 ఫీట్లు రోడ్డును విస్తరించాలని అధికారులు యోచిస్తున్నారు. రోడ్డుకు ఇరువైపుల 50 ఫీట్ల మేరనే రోడ్డును విస్తరించాల్సి ఉన్నా కొంతమంది అధికారుల అత్యుత్సాహంతో 100 ఫీట్లు రోడ్డును విస్తరించేందుకు చర్యలు చేపడుతున్నారు. దీంతో 48 కుటుంబాలకు చెందిన ఇండ్లు కూల్చి వేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే సంబంధిత అధికారులు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇండ్లను కూల్చివేసేందుకు మౌఖిక ఆదేశాలను బాధితులకు ఇచ్చారు. సంక్రాంతి పండుగ అనంతరం ఏ సమయంలోనైనా ఇండ్లను కూల్చివేస్తామని, స్వచ్ఛందంగా ఎవరి ఇండ్లను వారు కూల్చి వేసి అధికారులకు సహకరించాలని సంబంధిత శాఖ అధికారులు బాధితులను హెచ్చరించారు. దీంతో 48 కుటుంబాల వారు పండుగ అనంతరం నిరాశ్రయులు అవడంతో పాటు రోడ్డున పడనున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పరిహారం ఇవ్వాలి: నాగిరెడ్డి గ్రామస్థుడు

ప్రస్తుతం ఉన్న రోడ్డు మార్గానికి ఇరువైపులా ఉన్న ఇండ్లు ప్రభుత్వ స్థలంలో నిర్మించినవి కాదని మా పెద్దలు చెబుతున్నారు. రెవెన్యూ రికార్డులు తిరగేసిన పెద్దలు చెప్పిన విధంగానే రోడ్డు మార్గం ఉందని, కొంతమంది అధికారుల అత్యుత్సాహం వల్ల 48 కుటుంబాలకు చెందిన ఇండ్లు రోడ్డు విస్తరణలో కూల్చి వేయాల్సి వస్తుంది. నిబంధనల ప్రకారం రోడ్డుకు ఇరువైపుల 50 ఫీట్ల మేరనే కూల్చి వేయాల్సి ఉండగా, కొందరు నాయకుల ఒత్తిడి మేరకు 100 ఫీట్లు కూల్చి వేసేందుకు అధికారులు సన్నద్ధం అవుతున్నారు. ఇండ్లు కోల్పోతున్న వారికి ముందుగా గ్రామంలో ఉన్న గ్రామ కంఠంలో ఇండ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు ఇండ్లు నిర్మించుకునేందుకు ఆర్థికంగా సాయం అందించాలి. ఆ తర్వాతనే రోడ్డు విస్తరించాలి. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతాం.

అభివృద్ధి లేమి.. పాలకుల నిర్లక్ష్యమే

విజయక్రాంతి, తాండూరు: తాండూరులో గత పాలకుల నిర్లక్ష్యం వల్లే అభివృద్ధి జరగలేదని చేవేళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. శనివారం తాండూరు పట్టణంలో ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డితో కలిసి పట్టణంలోని వాల్మీకి నగర్‌లో వెలసిన నాగ ఎల్లమ్మను దర్శించుకున్నారు, అనంతరం మోటర్ మెకానిక్ అసోసియేషన్ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా తాండూరు ప్రాంతం అభివృద్ధి చెందలేదని మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి స్థానికేతరుడు కావడంతో అభివృద్ధిపై దృష్టి సారించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి తాండూరు ఎమ్మెల్యేగా గెలుపొందిన పైలెట్ రోహిత్ రెడ్డి తాండూరు ప్రాంతాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తారని చెప్పారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు ఎంపీ, ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

విజయక్రాంతి, నిర్మల్: గ్రామ పంచాయతీ ఎన్నికలకు సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన అధికారి ఎస్‌కే జోషి అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులతో మాట్లాడారు. ఈ వీసీ జిల్లా కలెక్టర్ ప్రశాంతి హాజరయ్యారు. పంచాయతీ ఎన్నికల నిర్వాహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రెవెన్యూ, పోలీసు అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి సైతం మాట్లాడారు. ప్రతి జిల్లాలో మూడు విడతలుగా ఎన్నికలు జరుగుతాయన్నారు. ఎన్నికల నిర్వాహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ శశిధర్ రాజు, ఏఎస్పీ దక్షిణమూర్తి, డీపీఓ శ్రీనివాస్, ఆర్డీవోలు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

మందిరాన్ని పునర్ నిర్మిద్దాం

విజయక్రాంతి, పటాన్‌చెరు: పటాన్‌చెరు పట్టణంలోని పురాతన శివాలయం, మాణిక్‌ప్రభు మందిరాలను పునర్ నిర్మాణం చేపడదామని స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం ఇందుకోసం పట్టణ ప్రముఖులు ఆలయ ప్రాంగణంలో సమావేశం నిర్వహించి అభిప్రాయాలను, సూచనలను, సలహాలను సేకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఆలయం హుమ్నాబాద్‌లోని మాణిక్‌ప్రభు ట్రస్టు వారి ఆధీనంలో ఉన్నదని, త్వరలో వారితో సంప్రదించి ఆలయ అభివృద్ధి విషయంలో చర్చిద్దామని తెలిపారు. ఫిబ్రవరి నెలలో ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించి, ఏడాదిలోపు పనులను పూర్తి చేసి విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం చేపడదామన్నారు. కబ్జాకు గురవుతున్న ప్రార్థనా మందిరాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేవేందర్‌రాజు, నాయకులు పి.మనోహర్‌రెడ్డి, కె.రామచంద్రారెడ్డి, వి.ప్రకాష్‌రావు, ప్రతాప్‌కృష్ణ, నాగసాని మాణిక్యం, రుద్రారం శంకర్, ఉప్పరి నర్సింలు, నర్ర బిక్షపతి, జి.మాణిక్‌ప్రభు, శ్రీధర్‌చారి, మెట్టుకుమార్‌యాదవ్, మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములపై పాగా

- యథేచ్ఛగా కబ్జా చేస్తున్న వైనం
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

విజయక్రాంతి, మంచిర్యాల: కోట్లాది రూపాయాల విలువ గల ప్రభుత్వ భూములపై రియల్ ఎస్టేట్ వ్యాపారులు కన్ను వేశారు. బెల్లంపల్లి నియోజకవర్గంలోని జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూములను కబ్జా చేసి ప్లాట్లుగా మార్చి అమ్మకాలు చేపడుతున్నారు. రియల్టర్లు ప్రభుత్వ భూములను కబ్జా చేసి అమ్మకాలు సాగిస్తున్నప్పటి రెవెన్యూ అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. రెవెన్యూ అధికారులు కబ్జా భూముల విషయంలో 'మామూళ్లు'గా తీసుకోవడంతో ఆ ప్రాంతంలో రియల్టర్లది ఆడిందే ఆట, పాడిందే పాటగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పూర్తి వివరాల్లోకి వెళితే బెల్లంపల్లి పట్టణంలోని కన్నాల శివారులో జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న సింగరేణికి సంబంధించిన సుమారు 400 ఎకరాల భూమి 2016లో సింగరేణి రెవెన్యూ శాఖకు స్వాధీనం చేసింది. అప్పటి నుంచి కబ్జాల పర్వం జోరందుకుంది. కొంతమంది రియల్టర్లు ఏకరాల కొద్ది భూముల్లో రాత్రికి రాత్రే కంచవేసి కబ్జాలు చేయడంతో పాటు ప్లాట్లుగా మార్చి లక్షలాది రూపాయాలకు అమ్మకాలు చేపడుతున్నారు. అయితే ఒక్క ప్రభుత్వ భూములనే కాకుండా రియల్టర్లు సింగరేణి భూములను కబ్జా చేస్తూ యథేచ్ఛగా అమ్మకాలు సాగిస్తున్నారు. ప్రభుత్వ భూములు జాతీయ రహదారికి అనుకోని ఉండడంతో గుంటకు రెండు లక్షల రూపాయాల నుంచి మూడు లక్షల రూపాయాల వరకు ధర పలుకుతుంది. రెవెన్యూ అధికారులు మామ్ముళ్లకు తలొగ్గి కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నారని అక్కడి ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ప్రజలు సబ్ కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కలిసి కన్నాల శివారులో కబ్జాకు గురవుతున్న భూములను కాపాడాలని కోరుతూ వినతి పత్రం కూడా అందజేశారు.

ప్రజల ఆందోళన..

కన్నాల శివారులో గల సర్వే నెంబర్ 60లో గల ప్రభుత్వ భూమిని కొంత మంది వ్యక్తులు రాత్రికి రాత్రే దున్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. కన్నాలకు చెందిన భూములు కబ్జాకు గురవుతున్నాయని తెలిపిన ప్రజలు కబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూములను కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు. కన్నాల గ్రామంలో భూమి లేని నిరుపేదలు చాలా మంది ఉన్నారని, ఆ భూమిని భూమి లేని నిరుపేదలకు ఇవ్వాలని అధికారులు కోరుతున్నారు.

మానవత్వం చాటిన పోలీస్!

విజయక్రాంతి, రామగుండం: పోలీసులు విధి నిర్వహణలో కఠినంగా ఉంటారని, దురుసుగా ప్రవర్తిస్తారని అన్న మాటల్లో నిజంలేదని ఓ పోలీసు అధికారి నిరూపించారు. నిరాశ్రయులుగా ఉన్న అనాథలకు ఆ అధికారి ఆపన్న హస్తం అందించారు. రాను రాను చలి తీవ్రత పెరిగిపోతున్న నేపథ్యంలో పలువురు అధికారులు, అనాధికారులు రోడ్లపై ఉన్న అభాగ్యుల కు దుప్పట్లు పంచే కార్యక్రమాలను చేపడుతున్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు, యువకులు ఈ సేవాతత్పరతకు ముందుకు రావడం ఎంతో గర్వకారణమని పలువురు అభినందిస్తున్నారు.

ఈ నేపథ్యంలో గోదావరిఖని ఆర్టీసి బస్ స్టేషన్‌లో చలిలో వనికిపోతున్న నిరాశ్రయులకు గోదావరిఖని ఏసీపీ రక్షిత కె.మూర్తి ఓదార్పునిచ్చారు. శుక్రవారం అర్ధరాత్రి బస్‌స్టేషన్‌లో నిద్రిస్తున్న నిర్భాగ్యులను నిద్రలేపి దుప్పట్లు, బ్లాంకెట్లను పంపిణీ చేశారు. ఏసీపీ రక్షిత మూర్తి చేసిన ఈ సామాజిక కార్యక్రమాన్ని పలువురు అభినందించారు. ఏసీపీ వెంట స్థానిక వన్‌టౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ వాసుదేవ రావు, సిబ్బంది ప్రభాకర్, ఏలియా, శంకర్ తదితరులున్నారు.

సీతాఫలంతో ఆరోగ్యం

బరువు పెంచుతుంది: ఎవరైతే బరువు పెరగాలనుకుంటారో, అటువంటి వారు సీతాఫలం జ్యూస్ లో తేనె, పాలు మిక్స్ చేసి రెగ్యులర్ గా తీసుకోవాలి. ఇది క్యాలరీలను పెంచుతుంది.

గర్భధారణ సమయంలో: గర్భిణీ స్త్రీలు సీతాఫలం తినడం వల్ల పొట్టలో పెరిగే శిశువు మెదడు, నాడీవ్యవస్థ, వ్యాధినిరోధకత పెరగడానికి సహాయపడుతుంది. మరో ముఖ్యమైన ప్రయోజనం గర్భస్రావాన్ని నివారిస్తుంది.

ఆస్మా: సీతాఫలంలో విటమిన్ బి6 అధికంగా ఉంటుంది. ఈ విటమిన్ వల్ల బ్రోంకైట్‌ను తగ్గించి ఆస్మాటిక్స్ అటాక్ ను తగ్గిస్తుంది.

హార్ట్ అటాక్: సీతాఫలంలో మెగ్నీషియం అధికంగా ఉంటుంది. దీన్ని వల్ల ఒక గొప్ప ఆరోగ్యప్రయోజనం కార్డియాటిక్ అటాక్స్ నుండి రక్షిస్తుంది.

జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది: సీతాఫలం కాపర్, డైటర్ ఫైబర్ అధికంగా ఉన్న హెల్తీ ఫ్రూట్. ఈ కాపర్ వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఇక అడిషన్‌గా బౌల్ మూమెంట్ క్రమంగా ఉంటుంది. మలబద్దకాన్ని నివారిస్తుంది.



పండగ వేళ తియ్యగా...

పండగ వచ్చిందంటే సంప్రదాయ వంటలే గుర్తుకు వస్తాయి. అందులో ముందుగా చేసి, నిల్వ చేసుకునేవి కొన్ని అయితే, వాటి తయారీకి ఎక్కువ సమయం పడుతుంది. కాని అప్పటికప్పుడు సంప్రదాయ స్వీట్స్ తయారు చేసుకుని పండగ జరుపుకోవడానికి కొన్ని రెసిపీస్ చూద్దాం.



బొబ్బర్ల స్వీట్ పొంగలి

కావలసిన పదార్థాలు :

బొబ్బర్లు– ఒకకప్పు, బియ్యం– ఒక కప్పు, బెల్లం తురుము– ఒక కప్పు, యాలకల పొడి – ఒక స్పూన్, నెయ్యి– రెండు టేబుల్ స్పూన్స్, జీడిపప్పు– కిస్మిస్లు కొద్దిగా, ఉప్పు– చిటికెడు.

తయారు చేయు విధానం:

ముందుగా బొబ్బర్లు వేయించాలి. చల్లారిన తరువాత తిరగలిలో వేసి పప్పులా ఇసరాలి. ఇలా చేసిన పప్పును శుభ్రం చెయ్యాలి. ఇప్పుడు బియ్యం బొబ్బర్ల పప్పు కడిగి విడివిడిగా అరగంట నానబెట్టాలి. స్టవ్ మీద పాన్‌లో నెయ్యి వేడిచేసి జీడిపప్పు కిస్మిస్లు వేయించి పక్కన పెట్టాలి. దీనిపై కుక్కర్ పెట్టి నాన బెట్టిన బొబ్బర్ల పప్పు, బియ్యం వేసి, నాలుగు కప్పుల నీళ్ళు పోసి, కుక్కర్ మూత పెట్టాలి. కుక్కర్ రెండు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి. ఇప్పుడు స్టవ్ ఆపి ఆవిరి పోయేంత వరకు ఆగాలి. ఇప్పుడు మూత తీసి బెల్లం తురుము వేయ్యాలి దీనిని బాగా కలపాలి. ఇప్పుడు స్టవ్ పై పెట్టి మరో ఐదు నిముషాలు ఉడికిస్తే పొంగలి రెడీ అవుతుంది. దీనిలో చిటికెడు ఉప్పు నేతిలో వేయించిన జీడిపప్పు, కిస్మిస్లు వేసి కలిపి స్టవ్ ఆపాలి. అంతే ఎంతో రుచిగా ఉండే బొబ్బర్ల పప్పుతో పొంగలి రెడీ. ఈ స్వీట్ పొంగలిలో నెయ్యి వేసి తింటే చాలా రుచిగా ఉంటుంది.



జాంగిరి

కావలసిన పదార్థాలు

మినపప్పు : కప్పు, బియ్యం : పావు కప్పు, పంచదార:ఆరు కప్పులు, కలర్ : టీ స్పూన్, యాలకుల పొడి: టీ స్పూన్, నూనె : వేయించటానికి సరిపడ.

తయారుచేయు విధానం

మినపప్పు, బియ్యాన్ని విడివిడిగా సుమారు నాలుగుగంటలు నానబెట్టాలి. మినపప్పుని కడిగి, బియ్యం కలిపి మెత్తగా రుబ్బాలి(మరీగట్టిగాను కాదు, పల్చగాను కాదు) మధ్యస్తంగా వుండాలి. దీనిలో కలర్ కలపాలి. ఇప్పుడు స్టవ్ వెలిగించి ఒకగిన్నెలో పంచదార వేసి, కొద్దిగా నీళ్ళు కలిపి పాకం పట్టాలి(తీగ పాకం పట్టాలి). పాకం వచ్చాక యాలకల పొడి వేసి కలపాలి. పక్క స్టవ్ వెలిగించి కళాయిలో నూనె వేడి చెయ్యాలి. నూనె కాగాక, ఒక గుడ్డకి మధ్యలో చిన్న రంధ్రం పెట్టి, దానిలో పిండిని వేసి అంచులు కలిపి పట్టుకొని రంధ్రాన్ని వేలుతో మూసి వెయ్యాలి. కాగుతున్న నూనెలో(రంధ్రానికి అడ్డుగా వున్న వేలు తీసి) జాంగిరి ఆకారంలో రింగులు రింగులుగా పిండిని వెయ్యాలి. బాగా వేగాక తీసి, వెంటనే పాకంలో వేయాలి, ఐదునిముషాలు వుంచి, తీసి వేరే పళ్ళెంలో పెట్టి చల్లారనివ్వాలి. అంతే జాంగిరీలు రెడి.



బాదం మీగడ పాయసం

కావలసిన పదార్థాలు

చక్కెర– 1 చెంచా, పొట్టు తీసేసిన బాదం– 2 చెంచాలు, బాస్మతి బియ్యం– 2 చెంచాలు , ఆకుపచ్చని ఏలకుల పొడి– 1చెంచా, కుంకుమ పువ్వు కొన్ని రేకులు, పాలు 350గ్రా, మరిగిన లేక క్రీమ్ మిల్క్– 4 చెంచాలు

తయారుచేయు విధానం

ఒక బౌల్ తీసుకుని అందులో బియ్యం, నీళ్ళు పోసి 10 నుంచి15 నిమిషాలు నాననివ్వండి. ఒక పెనం తీసుకోండి. పాలు పోసి 5 నుంచి 10నిమిషాలు మరగనివ్వండి. నానిన బియ్యాన్ని పోసి బాగా కలపండి. అన్నాన్ని 45 నిమిషాలు ఉడకనివ్వండి. అన్నం మెత్తగా ఉన్నప్పుడు, గట్టి పడిన పాలను అందులో పోయండి. బాదంపప్పులు, ఆకుపచ్చని ఏలకుల పొడి, చక్కెరను దానిలో వేయండి. 23 నిమిషాల పాటు కలపండి. పెనం దించేసి, అందరికీ వడ్డించే ముందు కుంకుమ పువ్వుతో అలంకరించండి.

షుగర్ వస్తుందనడానికి కారణాలు..

ఆహారంలో చోటుచేసుకున్న కొత్తకొత్త మార్పులతో శరీరానికి వచ్చే వ్యాధుల సంఖ్య పెరిగిపోయింది. జంక్‌ఫుడ్, అన్నం ఎక్కువగా తినడం వల్ల కూడా షుగర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.



దీర్ఘకాలిక వ్యాధుల్లో ఒకటి డయాబెటిస్. ప్రపంచాన్నే వణికిస్తున్న దీర్ఘకాలిక వ్యాధుల్లో డయాబెటిస్ ఒకటి. ఒకసారి వచ్చిందంటే పోదు. సామాన్యంగా దీన్ని నివారించుకోలేము కాబట్టి, డయాబెటిస్‌ను కంట్రోల్లో ఉంచుకోవడం ఒక్కటే మార్గం. ఒక వేళ టైప్ 2 డయాబెటిస్ కు గుర్రైనట్లైతే శరీరంలో షుగర్ లేదా ఇన్సులిన్ లెవల్స్ తగ్గిపోతాయి.

ఇన్సులిన్ సరిగ్గా ఉత్పత్తి కానందున షుగర్‌కు కారణమవుతుంది. టైప్ 2 డయాబెటిస్ ఉన్న వారిని నాన్ ఇన్సులిన్ డిపెండెంట్ డయాబెటిస్ అని పిలుస్తారు. ఇన్సులిన్ డిపెండెంట్ డయాబెటిస్ వారిలో బ్లడ్ షుగర్ లెవల్స్ హై లెవల్స్‌లో ఉంటుంది. డయాబెటిస్ అన్ని వయస్సుల వారికి వచ్చే అవకాశం ఉంది. అయితే ఎక్సెస్ ఫ్యాట్ ఉన్న వారిలో లేదా ఊబకాయగ్రస్తుల్లో ఇన్సులిన్ రెసిస్టెంట్ తగ్గిపోతుంది. దాంతో టైప్ 2 డయాబెటిస్ కు కారణమవుతుంది. షుగర్‌తో బాధపడే వారిలో నీరసం, అలసట, బరువు తగ్గిపోవడం, తరచూ మూత్ర సమస్య, కంటి చూపు బ్లర్‌గా కనిపించడం, తరచూ ఎక్కువ ఆకలిగా ఉండటం ఇవన్నీ టైప్ 2 డయాబెటిస్‌కు ముఖ్య లక్షణాలు. షుగర్ ఉన్న వారిలో కాళ్లలో వాపు, నొప్పి, తిమ్మెర్లుగా ఉండటం జరుగుతుంది. అయితే షుగర్ రావడానికి కొన్ని రిస్క్ ఫ్యాక్టర్స్ కూడా ఉన్నాయి. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం...

కుటుంబంలో డయాబెటిస్ ఉన్నట్లైతే, అది వంశపారంపర్యంగా మిగిలినవారికి వచ్చే ప్రమాదం ఉంది. చాలా వరకూ షుగర్ వంశపార్యంగా వచ్చేదే..

నడుము చుట్టూ ఎక్కువ ఫ్యాట్ చేరడం వల్ల, అధికబరువు వల్ల సమస్య మరింత తీవ్ర రూపం దాల్చుతుంది. క్రమశిక్షణలో లేని జీవన శైలి, కదలకుండా, మెదలకుండా ఒకే చోట కూర్చుని పనిచేయడం వ్యాయమం లేకపోవడంతో త్వరగా ఈ వ్యాధికి గురి అవుతుంటారు. రాకూడదనుకున్నా, లేదా టైప్ 2 డయాబెటిస్‌ను నివారించాలన్నా కండరాలకు పనిపెట్టాల్సిందే. 45ఏళ్ళ వయస్సు పైబడ్డ వారు డయాబెటిస్‌కు గురిఅవుతుంటారు. ముఖ్యంగా టైప్ 2 డయాబెటిస్ బారిన పడుతుంటారు. థైరాయిడ్‌తో బాధపడేవారు నిద్రలేమితో బాధపడేవారు, నిద్రవేళలు పాటించని వారికి టైప్ 2 డయాబెటిస్ వచ్చే అవకాశాలు ఎక్కువ.

జామపండులోని లాభాలు..



జామపండు తినటానికి అందరు ఇష్టతారు. కానీ దీని వలన ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలు తెలిస్తే ఆర్చర్యానికి గురవుతారు..!

- అతితక్కువ క్యాలరీలు, తక్కువ కొలెస్ట్రాల్ కలిగి, ఎక్కువ పోషక విలువలు ఉన్న పండు జామపండు.
- ఎక్కువ పీచు పదార్థం కలిగి ఉంటుంది. మలబద్దకాన్ని తగ్గిస్తుంది.
- వయసుకు ముందే ముఖం పై ముడతలు, చర్మంలో సాగుదల లేకుండా చేస్తుంది.
- ఏ, బి, సి విటమిన్లు పుష్కలంగా లభిస్తాయి. శరీరానికి కావాల్సిన యాంటిఆక్సిడెంట్లు ఎక్కువగా లభిస్తాయి.
- కంటి సమస్యలు, కొన్ని రకాల క్యాన్సర్లు రాకుండా జామపండు కాపాడుతుంది.
- స్త్రీలలో రుతుచక్ర సమస్యలు, బ్రెస్ట్ క్యాన్సర్ పురుషులలో ప్రోస్టేట్ క్యాన్సర్లు రాకుండా నివారిస్తుంది.
- జామపండు ప్రతి రోజు తీసుకోవడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరిగి, అనారోగ్య సమస్యలు దూరం అవుతాయి.
- దీనిలో విటమిన్ ఎ, ఫ్లావనాయిడ్స్ అయిన బీటాకెరోటిన్, లైకోపిన్ ఉండడం వల్ల ఉపిరితిత్తులకు, చర్మానికి, కంటికి చాల మంచిది.
- అతినీలలోహిత కిరణాల నుండి వచ్చే కొన్ని క్యాన్సర్ కారకాలను జామకాయ లో ఉండే లైకోపిన్ అడ్డుకుంటుంది.
- జామకాయ లో ఉండే పొటాషియం గుండె జబ్బులు , బీపి పెరగకుండా చేస్తాయి.
- జమకాయలో బి–కాంప్లెక్స్ విటమిన్స్ (బి6, బి9)ఈ, కె–విటమిన్స్ ఉంటాయి. ఎర్ర రక్త కణాల ఉత్పత్తిలో జామకాయ ఎంతగానో సహాయపడుతుంది.
- జామపండు ప్రతి రోజు ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. బాగా మాగిన జామపండులోని 50 గ్రాముల గుజ్జు, పది గ్రాముల తేనెను కలిపి తీసుకుంటే శరీరంలో శక్తి పుంజుకుంటుందని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.
- ఉదయం, రాత్రి వేళల్లో భోజనానంతరం జామపండు తింటే, జీర్ణక్రియ సాఫీగా జరుగుతుంది. దీంతోపాటు మానసిక ఒత్తిడి కూడా మాయమవుతుంది.
- గుండెజబ్బులతో బాధపడే వారు నిత్యం భోజనంతో పాటు ఒక పండుని తీసుకుంటే మంచి ఫలితం ఉంటుందంటున్నారు ఆరోగ్య నిపుణులు. జామపండును తింటే శరీరంలో రక్త సరఫరా సాఫీగా జరుగుతుంది.
- జామపండు చెట్టులోని ఆకులు 20 నుండి 25 ఆకులు నీటిలో ఉడకబెట్టి, నీటిని చల్చార్చి అందులో పటిక వేసి బాగా కలపాలి. ఆ నీటిని పుక్కలిస్తే పంటి నొప్పులు తగ్గుముఖం పడతాయి.

హెల్త్

పొట్టులో ప్రయోజనాలెన్నో..?

కీరా దోసకాయ తినేటప్పుడు ప్రతి ఒక్కరు తొక్కను తీసి తింటారు. తొక్క తీసి వేయడం వల్ల దానిపై చేరిన వాతావరణ కాలుష్య పదార్థాలు తొలగిపోతాయి. అయితే వీటితో పాటుగా ఎన్నో అత్యవసర పోషకాలు కూడా తొలగిపోతాయి. అలాకాకుండా కొంచెం నీటిలో ఉప్పు వేసి కీరదోసని కాసేపు ఆ నీటిలో ఉంచి శుభ్రంగా కడిగి తొక్కతో సహా కీరదోసని తినడం వల్ల అనేక రకములైన ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. అవేంటో చూద్దాం.



- కీరా తొక్కలో పీచుపదార్థం అధికంగా ఉంటుంది. ఇది నీటిలో కరుగదు కనుక మన జీర్ణనాళంలో నుండి నెట్టివేయబడుతుంది. పీచులా మారి, జీర్ణం కాని వ్యర్థాలను సులభంగా బయటికి పంపి మలబద్ద కాన్ని దరిచేరనివ్వదు.
- ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లలో భాగంగా రోజుకు 25 గ్రాముల ఫైబర్ తీసుకోవాలి. పురుషులలో ఇది 39 గ్రాములు. కీరా లోపల ఉండే పీచు పదార్థం నీటిలో కరిగిపోతుంది. ఇది కూడా శరీరానికి మేలు చేస్తుంది. ఇది విసర్జకాలను మృదువుగా మారుస్తుంది.
- కీరాలో ఉండే విటమిన్–కెలో చాలా భాగం చెక్కులోనే ఉంటుంది. విటమిన్ కె రక్తం గడ్డకట్టడానికి సహాయపడుతుంది. ఒక కప్పు చెక్కులో 49 మైక్రో గ్రాముల కెవిటమిన్ ఉంటుంది. అదే తొక్క తీసిన కీరాలో ఇది 9 మైక్రో గ్రాములు మాత్రమే ఉంటుంది.
- కీరాను ఎప్పుడు కావాలంటేఅప్పుడు తినేయవచ్చు, ఎందుకంటే, వీటిలో సహజంగా కెలోరీలు తక్కువగా ఉంటాయి. ఒక కీరా ముక్కలో 12 కెలోరీలు ఉంటాయి. డైటింగ్ చేస్తున్నప్పటికి, మధ్యాహ్న సమయాల్లో కొన్ని తొక్క తీయని కీరా ముక్కలు తినడం వలన ఎటువంటి నష్టం వుండదు.
- కీరా చెక్కులో బీటా కెరోటిన్, విటమిన్ ఎ వుంటుంది. ఇది మన కళ్లకు ప్రయోజనం చేకూరుస్తుంది. విటమిన్ ఎ వివిధ సమ్మేళనాలలో లభిస్తుంది. కీరా చెక్కులో ఇది అధికంగా ఉంటుంది.

విజయక్రాంతి
ఆదివారం
06 జనవరి 2019
హైదరాబాద్
10



స్నేహితులకు హైదరాబాద్ విందు

ఎస్.ఎస్.రాజమౌళి కుమారుడు కార్తికేయ– పూజా ప్రసాద్ వివాహం జైపూర్ ఫెయిర్ మౌంట్ హోటల్లో ఘనంగా జరిగిన సంగతి తెలిసిందే. ఈ వేడుకకు అతి కొద్ది మంది సెలబ్రిటీలు మాత్రమే హాజరయ్యారు. ప్రభాస్, ఎన్టీఆర్, రామ్ చరణ్, నాగార్జున, అఖిల్ వంటి ప్రముఖులు హాజరయ్యారు. మూడు రోజుల పెళ్లి ఘనంగా జరిగింది. ఫెయిర్ మౌంట్ విందు అదరహో అని మాట్లాడుకున్నారు. వివాహానంతరం భారీ విందు కార్యక్రమానికి మాత్రం హైదరాబాద్ ఇండస్ట్రీ మొత్తానికి పిలుపు ఉంటుందని, అన్ని రంగాల్లోని ప్రముఖులకు ఆహ్వానాలు అందుతాయని ప్రచారం సాగింది. అందుకు తగ్గట్టే శనివారం సాయంత్రం హైదరాబాద్ నానక్‌రామ్‌గూడ రామానాయుడు స్టూడియోస్‌లో రిసెప్షన్ వేడుకగా సాగింది. ఈ వేడుకలకు సినీ, రాజకీయ, క్రీడా రంగాలకు చెందిన ప్రముఖులు అటెండయ్యారు. అలాగే సినీరంగానికి చెందిన సెలబ్రిటీలు రిసెప్షన్ కు ఎంటెండయ్యారు.



ఐరా జీవితంలో ఆరుగురు

ప్రతి ఒక్కరూ హ్యాపీగా జీవించాలనే అనుకుంటారు. కానీ జీవించనిస్తారా? మాయదారి ప్రపంచం ఏదో ఒకటి చేయనిదే ఊరుకుంటుందా? ఎవరో ఒకరొస్తారు.. ఏదో ఒకటి చేస్తారు. తమది కాని జీవితంలో అడుగుపెట్టి నాశనం చేస్తారు. అందమైన కలల్ని దారుణంగా గంగలో కలిపేస్తారు. అలా ఐరా జీవితంలోనూ ఓ ఆరుగురున్నారు. ఆ ఆరుగురిని తుద ముట్టించడమే ఐరా లక్ష్యమా? లేక ఇంకేదైనా జరుగుతుందా? అన్నది సస్పెన్స్. నయనతార నటిస్తున్న తాజా చిత్రం ఐరా. ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ఇందులో నయన్ ద్విపాత్రాభినయం చేస్తోంది. సుదర్శన్, సుందరామ్మూర్తి, రవీంద్రన్, కార్తీక్ కీలక పాత్రలు పోషించారు. తమిళనాట 'లక్ష్మీ' అనే లఘు



చిత్రంతో మంచి పేరు సంపాదించుకున్న కేఎమ్ సర్జున్ ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. ఇటీవల ఈ సినిమా ఫస్ట్ లుక్ విడుదలైంది. సెకండ్ లుక్ ఆకట్టుకుంది. తాజాగా టీజర్ రిలీజై ఆకట్టుకుంది. పచ్చని పల్లె వాతావరణం, పల్లెటూరి అమ్మాయిగా కనిపిస్తున్న నయన్ నటన మరోసారి ఆకట్టుకోనుందని టీజర్ చెబుతోంది. నయన్ లైఫ్ లో బ్లాక్ షేడ్ ఏంటో చూడాల్సిందే. త్వరలో సినిమా రిలీజ్ కానుంది.

సంక్రాంతి బరిలో పందెం పుంజులు

సంక్రాంతి బరిలో పందెంపుంజులు రెడీ అవుతున్నాయి. నువ్వా .. నేనా.. అంటూ టగ్ ఆఫ్ వార్ జరగనుంది. నందమూరి బాలకృష్ణ, రజనీకాంత్, రామ్‌చరణ్, వెంకటేష్, వరుణ్‌తేజ్ నటించిన సినిమాలు వరుసగా రిలీజవుతున్నాయి. పండగ పందెంలో గెలుపెవరిది? అంటూ ఆసక్తికర చర్చ సాగుతోంది.

పెద్ద పండగ సంబరాలు ఇప్పటికే మొదలైపోయాయి. యథావిధిగా ప్రతియేడాది లానే ఈసారి కూడా తెలుగు రాష్ట్రాల్లో సినిమా థియేటర్లు కళకళలాడబోతున్నాయి. ఏపీ, తెలంగాణ సహా ప్రపంచవ్యాప్తంగా పలు తెలుగు చిత్రాలతో పాటు డబ్బింగ్ సినిమాలు రిలీజవుతున్నాయి. ఇప్పటికే నాలుగు సినిమాలు పండగ క్యూలో ఉన్నాయి. సంక్రాంతి బరిలో పందేనికి దిగుతున్నారు. ఈ పండగ బరిలో ఉన్న నాలుగు చిత్రాలపైనా దాదాపు 200కోట్ల మేర బిజినెస్ సాగిందని ట్రేడ్ చెబుతోంది. రామ్‌చరణ్ – బోయపాటి కాంబినేషన్ మూవీ 'వినయ విధేయ రామ' చిత్రానికి 120 కోట్ల మేర ప్రీరిలీజ్ బిజినెస్ సాగింది. అలాగే బాలకృష్ణ – క్రిష్ కాంబినేషన్ మూవీ కథానాయకుడు ఏకంగా 60 కోట్లు పైగా బిజినెస్ సాగించిందని తెలుస్తోంది. వెంకీ వరుణ్ తేజ్ అనీల్ రావిపూడి కాంబినేషన్ మూవీ 'ఎఫ్ 2' సైతం ఇంచుమించు 30కోట్ల మేర బిజినెస్ సాగించిందిట. వీటితో పాటు రజనీకాంత్ నటించిన 'పేట' చిత్రానికి 21 కోట్ల మేర బిజినెస్ సాగింది.










ఇవన్నీ కలుపుకుంటే దాదాపు 200 కోట్ల మేర బిజినెస్ సాగింది. అయితే ఆ మేరకు థియేటర్ల నుంచి 200కోట్ల షేర్ వసూలవుతుందా? అంటూ ఆసక్తికర చర్చ సాగుతోంది. ఇక నాలుగు సినిమాలు ఒకదానితో ఒకటి పోటీపడి భారీగా బిజినెస్ చేసిన సినిమాలు వసూళ్లు తేవాల్సి ఉంటుంది. అయితే సంక్రాంతి సెలవులు సినిమాలకు పెద్ద రేంజులో కలిసి రానున్నాయి. సూపర్ హిట్టు అన్న టాక్ వినిపిస్తే చాలు వసూళ్లు తేవడం కష్టమేమీ కాదు. ఇకపోతే ఇప్పటికే బాలయ్య 'కథానాయకుడు' చిత్రానికి క్లీన్ యు సర్టిఫికెట్ దక్కింది. జనవరి 9న రిలీజవుతోంది కాబట్టి, 8వ తేదీ సాయంత్రం నుంచి ప్రీమియర్ల సందడి నెలకొననుంది. ఇక 'పేట' చిత్రానికి యుఏ సర్టిఫికెట్ దక్కింది. 171 నిమిషాల రన్ టైమ్ తో అలరించనుంది. 'పేట' చిత్రానికి జనవరి 10 నుంచి ప్రీమియర్ల సందడి నెలకొననుందట. అలాగే ఈనెల 12న రిలీజవుతున్న 'ఎఫ్ 2' చిత్రానికి యుఏ సర్టిఫికెట్ అందింది. 11న సాయంత్రం నుంచే ప్రీమియర్లు వేస్తున్నారు. ఇక జనవరి 11న రిలీజవుతున్న 'వినయ విధేయ రామ' సెన్సార్ యూఏ అందుకుంది. ఈ పండగ బరిలో మాస్, క్లాస్ అనే తేడా లేకుండా అందరికీ నచ్చే అన్ని జోనర్ల సినిమాలు రెడీ అవుతున్నాయి. సంక్రాంతి అల్లుళ్లు రెడీ. కోడి పందేలు రెడీ. పందెంలో భారీ బెట్టింగ్ నడుస్తోంది. ఇక వసూళ్లు తేవడమే పెండింగ్.



ప్రిన్స్ సరసన సరయ


సూపర్‌స్టార్ మహేష్ కెరీర్ తొలి నుంచి పలువురు బాలీవుడ్ కథానాయికలు నటించిన సంగతి తెలిసిందే. ప్రీతిజింతా, నమ్రత, బిపాస బసు, లీసా రే, అమృతరావు, అమీషా పటేల్, సోనాలి బింద్రే, లాంటి నాయికలు నటించారు. మరోసారి బాలీవుడ్ నుంచి నవనాయికను మన ప్రిన్స్ కోసం బరిలో దించుతున్నారని తెలుస్తోంది. బాలీవుడ్ కథానాయిక కత్రిన మహేష్ నటించే 26వ చిత్రం లో నటించనుందిట. ఇప్పటికే సుకుమార్ మైత్రి అధినేతలు కత్రినతో చర్చలు జరుపుతున్నారని తెలుస్తోంది. అయితే కత్రిన వైపు



నుంచి తుదిగా అంగీకారం తెలియాల్సి ఉందింకా. ఇక ఈ సినిమా కథ ఏంటి? అన్నది ఇప్పటివరకూ సస్పెన్స్ గా ఉన్నా భారీ పీరియాడికల్ చిత్రంగా ఉంటుందన్న అంచనాలు ఉన్నాయి. భారీ బడ్జెట్ ని వెచ్చిస్తారన్న ఆసక్తికర చర్చ సాగుతోంది. ఈ చిత్రాన్ని మార్చి ఏప్రిల్ లో ప్రారంభోత్సవం చేయనున్నారని తెలుస్తోంది. మహేష్ ప్రస్తుతం కొత్త సంవత్సరం సెలబ్రేషన్స్ కోసం దుబాయ్ వెళ్లిన సంగతి తెలిసిందే. తదుపరి షెడ్యూల్స్ వివరాలు తెలియాల్సి ఉందింకా. ఇక కత్రిన గత ఏడాది థగ్స్ ఆఫ్ హిందూస్తాన్ (సరయ), జీరో వంటి భారీ చిత్రాల్లో నటించిన సంగతి తెలిసిందే.

భారతీయుడు 2 యుద్ధం

విశ్వనటుడు కమల్ హాసన్ – శంకర్ కాంబినేషన్‌లో 'భారతీయుడు 2' తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ పనులు సాగుతున్నాయి. కమల్ హాసన్ రాజకీయాల్లో బిజీగా ఉండడం వల్ల ఇటీవల వాయిదా పడినా, ఈ ప్రాజెక్టును నిలిపేయడం లేదని తెలుస్తోంది. కమల్ ఈ నెల 18 నుంచి భారతీయుడు 2 చిత్రీకరణకు అందుబాటులోకి వస్తున్నారు. హైదరాబాద్ రామోజీ ఫిలింసిటీలోని భారీ సెట్ లో రెగ్యులర్ చిత్రీకరణను ప్రారంభించనున్నారని తెలుస్తోంది. ఇప్పటికే శంకర్ లొకేషన్లను ఫైనల్ చేసేశారు. రామోజీ ఫిలింసిటీ తో పాటు చెన్నయ్, పొలాచ్చి లొకేషన్లు ఫైనల్ అయ్యాయి. ఇదివరకూ తైవాన్ లొకేషన్లు ఫైనల్ అయ్యాయి. తాజాగా ఉక్రెయిన్ లో ఎగ్జొటిక్ లొకేషన్లను శంకర్ ఫైనల్ చేసేశారని తెలుస్తోంది. ఇప్పటికే కాజల్ ఈ చిత్రంలో కథానాయికగా ఫైనల్ అయిన సంగతి తెలిసిందే. ఈ సినిమా కోసం చందమామ మార్షల్ ఆరట్స్ ప్రాక్టీస్ చేసిన సంగతి తెలిసిందే. అలాగే లైకా ప్రొడక్షన్స్ సంస్థ ఈ చిత్రం కోసం ఏకంగా 500కోట్లు వెచ్చించనుందని చెబుతున్నారు. ఈ చిత్రంలో రాజకీయ అవినీతి కేంద్రంగా భారీ యాక్షన్ ఎపిసోడ్స్ ని శంకర్ ప్లాన్ చేశారట. ప్రస్తుత దేశ రాజకీయాలు, తమిళనాడు రాజకీయాల నేపథ్యం రక్తి కట్టిస్తుందని, అవినీతి, రాజకీయ అవినీతిపైనా భారీ వార్ సాగిస్తాడని చెబుతున్నారు. కళరియపట్టు అనే అరుదైన మర్మకళను మరోసారి ఆకట్టుకునే రేంజులో శంకర్ డిజైన్ చేశారట.





రాధిక రెబల్

రక్తచరిత్ర , లెజెండ్ చిత్రాలతో తెలుగు వారికి సుపరిచితమైన రాధికా ఆప్టే డేరింగ్ స్టైల్ తెలుగువారికి తెలిసింది తక్కువే. ఈ భామ రెబల్, బోల్ యాటిట్యూడ్ గురించి తెలిశాక ముక్కున వేలేసుకున్నారు. ఇక వివాదాలకు ఏమాత్రం భయపడని ఈ ఉత్తరాది సోయగం ఓ సందర్భంలో తెలుగు స్టార్ వేధింపుల గురించి విరుచుకుపడుతుంటుంది. ఇకపోతే ఈ భామ కామెంట్లపైనా ఆసక్తికర చర్చ సాగింది. అలాగే లస్ట్ స్టోరీస్‌లో మతిచెడే బోల్డ్ ఎటెంప్ట్ తోనూ వాడి వేడిగా చర్చల్లోకొచ్చింది. ఎప్పటికప్పుడు హీటెక్కించే ఫోటోషూట్లతోనూ రాధిక పేరు మార్మోగుతూనే ఉంది. అనురాగ్ కశ్యప్ సన్నిహితురాలిగా లఘు చిత్రాల్లోనూ నటిస్తోంది. లేటెస్టుగా ప్రముఖ మ్యాగజైన్ కవర్ పేజీపై రాధిక తళుక్కుమంది. స్ట్రైకింగ్ లుక్ తో రాధిక మైమరిపిస్తోంది. ఇక 2018లో పలు చిత్రాలకు సంతకాలు చేసిన ఈ బ్యూటీ వాటిని పూర్తి చేసే పనిలో ఉంది. ది వెడ్డింగ్ గెస్ట్, బొంబార్జియాన్, ది ఆశ్రమ్(ఇంగ్లీష్) చిత్రాల్లో నటించింది. 'చైత్రమ్ పసుతాడి 2' అనే తమిళ చిత్రం త్వరలో రిలీజ్ కి రెడీ అవుతోంది. నూతన సంవత్సరంలో నిత్యనూతనంగా వేడెక్కించే వార్తలతో రాధిక ముందుకు రాబోతోందిట.

ధీవర ఫస్ట్ లుక్

తెలుగులో వైవిధ్యమైన సినిమాల హవా పెరుగుతోంది. కొత్తగా వస్తోన్న దర్శకులే కాదు.. నిర్మాతలు కూడా ఈ తరహా కథలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ క్రమంలో మరో డిఫరెంట్ మూవీ రాబోతోంది. సినిమా పేరు ధీవర. నాగసాయి, విదా చైతన్య నాయకానాయికలుగా నటించారు. టైటిల్ కు తగ్గట్టుగానే డైనమిక్ స్క్రిప్ట్ తో డిఫరెంట్ స్క్రీన్ ప్లేతో సాగే ఈ మూవీ సస్పెన్స్ థ్రిల్లర్ గా రాబోతోంది. ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్ ను దర్శకుడు బాబీ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు బాబీ మాట్లాడుతూ– "ధీవర కాన్సెప్ట్ బాగుంది. యూత్ రిలేట్ అయ్యే విధంగా కథ ఉంది. ఆ పోస్టర్ తనకు బాగా నచ్చిందని.. ఎంటైర్ యూనిట్ కు ఆల్ ద బెస్ట్" చెప్పారు. దర్శకుడు విజయ్ జిక్కి మాట్లాడుతూ 'ధీవర సినిమాలో స్క్రీన్ ప్లే హైలెట్ గా ఉంటుందని.. లవ్ అండ్ సస్పెన్స్ థ్రిల్లర్ గా సాగే ఈ సినిమా ఒకేసారి రెండు జానర్స్ లో సాగుతుందని అన్నారు. నిర్మాత హరనాథ్ బాబు మాట్లాడుతూ –"కమర్షియల్ అంశాలకు కూడా పెద్ద పీట వేసినట్టు చెప్పాడు. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా యూత్ ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ గా వస్తోన్న ఈ మూవీ ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుపుకుంటోంది. త్వరలోనే ఆడియోతో పాటు ట్రైలర్ ను విడుదల చేస్తామని చెబుతున్నారు అన్ని పనులు పూర్తి చేసి, వచ్చే నెలాఖరు వరకూ ప్రేక్షకుల ముందుకు తెస్తాం" అన్నారు.



మెగా డైరెక్టర్ ఆశీస్సులు

విశ్వనాధ్ ఫిలిం ఫ్యాక్టరీ, శ్రీలక్ష్మి వెంకటాద్రి క్రియేషన్స్ బ్యానర్‌పై విశ్వనాధ్ తన్నీరు నిర్మిస్తున్న చిత్రం 'యమ్6'. ఈ చిత్రం ట్రైలర్ ను ప్రముఖ దర్శకుడు వి.వి.వినాయక్ ఆవిష్కరించి చిత్ర యూనిట్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో హీరో ధ్రువ, నిర్మాత విశ్వనాథ్ తన్నీరు పాల్గొన్నారు. దర్శకుడు జైరాం చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. మా హీరో ధ్రువ కొత్తవాడైనప్పటికీ చక్కటి నటనను ప్రదర్శించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి త్వరలోనే విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం" అన్నారు. నా మొదటి సినిమా ట్రైలర్‌ను ప్రముఖ దర్శకులు వి.వి.వినాయక్ ఆవిష్కరించడం నా అదృష్టంగా భావిస్తున్నానని హీరో అన్నారు.



స్వేచ్ఛహాసిని

చలికి అల్లం టీ..

అల్లం ముక్కని నోట్లో పెట్టగానే, కారం, ఘాటు, వగరు అన్నీ కలిపిన రుచి, చాలా తక్కువమంది నచ్చుతుంది. అల్లం చేసే మేలు ఇంతా అంతా కాదు. శరీరానికొచ్చే అనేక సమస్యలకు అల్లం ఔషధంలా ఉపయోగపడుతుంది.

శీతాకాలంలో కొందరి శరీరం అస్సలు చలిని తట్టుకోలేదు. చిగురుటాకులా వణికేస్తూ ఉంటారు. అలాంటివాళ్లు రెండు కప్పుల నీళ్లలో ఒక స్పూను అల్లం తురుముని వేసి పది నిమిషాలు వేడిచేయాలి. అనంతరం ఒక టీస్పూను తేనె కలిపి ఆ నీటిని రోజుకు రెండు మూడు సార్లు తాగాలి. శరీరంలో వేడి పుట్టి చలిని తట్టుకునే శక్తి వస్తుంది.

దగ్గు, జలుబు వేధిస్తుంటే స్పూను తేనెలో కొన్ని చుక్కల అల్లం రసం కలిపి తాగితే త్వరగా ఉపశమనం కలుగుతుంది. రోజుకి కనీసం రెండు నుంచి నాలుగు సార్లు ఇలా తాగాలి.

ఒళ్లు నొప్పులు బాధిస్తుంటే అల్లంతో టీ చేసుకుని రోజూ తాగండి. అల్లంటీ చేయడానికి తొక్కని తీసేసిన అల్లాన్ని నీళ్లలో వేసి పదినిమిషాలు మరిగించాలి. అనంతరం ఆ నీళ్లలో నిమ్మరసం, తేనె కలుపుకుని మంచి ఫలితం ఉంటుంది.

కడుపు నొప్పి, గ్యాస్ సమస్యలు తరుచూ వేధిస్తుంటే అల్లం తినడం అలవాటు చేసుకోండి. అల్లాన్ని చిన్న ముక్కగా కోసుకుని వాటిపై ఉప్పు చల్లుకుని నమిలినా కడుపునొప్పి నుంచి ఉపశమనం కలుగుతుంది. లేదా రోజు వారీ ఆహారంలో ఒక అల్లం ముక్కని తినడం అలవాటు చేసుకుంటే మంచిది.

సింగారం.. సోయగం.. ఆధునికత కొత్తందాలు...

ఆధునిక దుస్తులంటే అమ్మాయిలకు మోజే మరి! వెనకటి ఫ్రాకులు ఇప్పుడు మళ్లీ మోడ్రన్ దుస్తుల్లా మారాయి. పాత కొత్తల మేలు కలయికే ఈ రోజు నాటి ఈ వస్త్ర సముదాయం. పతంగుల పండుగకు ఈ వెరైటీ దుస్తులు ధరిస్తే, అమ్మాయిల అందం రెపరెపలాడుతుందంటే నమ్మాలి మరి!



బ్లాక్ అండ్ రెడ్ కాంబినేషన్‌లో స్లీవ్‌లెస్ లాంగ్ ఫ్రాక్. ప్రజెంట్ ఈ ట్రెండ్ చాలా బాగా నడుస్తుంది ఇది పార్టీవేర్‌గా లేటెస్ట్ ఫ్యాషన్.



వెస్ట్రన్ పటియాల టీషర్ట్, జీన్స్‌కోట్ ఇది కూడా న్యూట్రెండ్ ఈ డ్రెస్ చాలా పాష్‌గా, ట్రెండీ లుక్‌ని ఇస్తుంది.

స్కైబ్లూకలర్ లాంగ్ ఫ్రాక్ ఇది. పార్టీవేర్‌గా చాలా బావుంటుంది. అటు సమ్మర్ హీట్‌కైనా వింటర్‌కైనా చాలా సేఫ్టీ కలర్ అని చెప్పాలి.



నేవీబ్లూకలర్ లెహంగా ప్రింటెడ్ ఫ్లవర్‌తో సూపర్బ్‌గా ఉంటుంది. దీనికి స్లీవ్‌లెస్ మస్టర్డ్ కలర్ బ్లౌజ్ పైన సిల్క్‌కోట్‌తో ట్రెండీగా ఉంటుంది. ఇది కూడా పార్టీవేర్‌కి బావుంటుంది.





ఆరెంజ్ కలర్ జార్జెట్ క్లాత్‌తో లాంగ్ స్లీవ్‌లెస్ లాంగ్ ఫ్రాక్. పైన బ్లాక్ బటన్స్ విత్ బ్లాక్ డిజైన్‌తో సూపర్ ట్రెండీ ఫ్రాక్. పార్టీవేర్‌గా ఇది డే టైం ఫంక్షన్స్‌కు చాలా అట్రాక్టివ్‌గా ఉంటుంది.

ఎవరి పని వాళ్లు చేసుకుంటేనే మంచిది

షేర్ చేసుకుందాం..!

ఇప్పుటి తరం పిల్లలు బండి తుడవమంటే తుడవరు.

మీ సాక్సులు ఉతుక్కోమంటే ఉతుక్కోరు...

కనీసం అండర్ వేర్‌లు ఉతుక్కోమన్నా ఉతకడం లేదు...

లంచ్ బ్యాగ్‌లు శుభ్రం చేసుకోవడం లేదు...

ఎప్పుడు అయినా దాచుకోమని డబ్బులు ఇస్తే, నూడిల్స్ ప్యాకెట్లు, ఫైవ్ స్టార్‌లు, ఐస్ క్రీమ్‌లు, కూల్ డ్రింక్‌లు కొనుగోలు చేస్తున్నారు...

ఆడపిల్లలు అయితే తిన్న కంచం కూడా కడగటం లేదు...

ఇల్లు ఊడ్చమంటే కోపాలు వచ్చేస్తున్నాయి...

డిగ్రీ చదువుతున్న ఆడపిల్లలకు వంట కూడా చేయడం రావటం లేదు..

తల్లి దండ్రులు మారాలి?

భార్యకు వంట వండటం సరిగా రాదని, నేటి యువత బిర్యానీలు కర్రీ పాయింట్‌ల వెంటపడుతూ, చిన్న వయసులోనే గ్యాస్టిక్ అల్సర్, గాల్‌బ్యాడర్, కిడ్నీ స్టోన్‌ల బారిన పడుతున్నారు.

మరొక ఫ్యాషన్ ఏమిటంటే పెరుగు మజ్జిగ తీసుకుంటే వాంతులు చేసుకోవడం...

కాలేజీ పిల్లలు అయితే చిన్న టిఫెన్ బాక్సు రైస్..

ప్రెగ్నెంట్ అయిన తరువాత వారి బాధలు వర్ణనాతీతం...

టోటల్ మెడిసిన్ మీద డిపెండ్ అవడం...

రేపటి సమాజానికి ఏమి నేర్పుతున్నాం..?

ఒక్కసారి ఆలోచన చేయండి. ...

సంస్కృతి, సాంప్రదాయం అంటే ఏమిటి?

కేవలం గుడికి వెళ్లో, చర్చికి వెళ్లో మసీదుకు వెళ్లో...

మన సంస్కృతి సాంప్రదాయం అని పిల్లలకు అలవాటు చేస్తున్నాం

అనుకోవడం పొరపాటు.

బాధ్యత, బరువు, కష్టం, నష్టం ఓర్పు, సహనం, దాతృత్వం, ప్రేమ, అనురాగం, సహయం, సహకారం, నాయకత్వం, మానసిక ధృడత్వం, కుటుంబ బంధాలు, అనుబంధాలు... అంటే ఏమిటో...

పిల్లలకు అలవాటు చేద్దాం...

మనం కూడా మమేకమవుదాం....

భావి తరాలకు ఒక మానవీయ, విలువతో కూడిన, సత్సాంప్రదాయ కుటుంబాలను కలిగిన సమాజానికై బాటలు వేద్దాం...

సమాజానికి మనం ఏం చేయాల్సిన అవసరం లేదు...

మన పనులు మనం చేసుకుంటే చాలు...

సేకరణ: మీ స్నేహితుడు
వాట్సాప్ అభిమాని

ముడతలు... మచ్చలు!



చలికాలం చర్మవ్యాధులు వేధిస్తూ ఉంటాయి. చర్మం చిట్లిపోవడం, పొట్టురాలడం, పొడిబారడం, మొటిమలు ముఖ సౌందర్యాన్ని మచ్చలా కమ్మేస్తూ ఉంటాయి.

చర్మం పొడిబారడంతో, శరీరమంతా ముడతలుగా మారుతుంది. ఈ సమస్యలను తొలగించుకోవడానికి ఏవేవో మందులు, క్రీములు వాడుతుంటారు. అయినా పెద్దగా తేడా కనిపించలేదని బాధపడుతుంటారు. బయట దొరికే కృత్రిమ క్రీమ్స్, ప్యాక్స్ వాడకం కంటే, ఇంట్లోనే ఈ చిన్న పాటి చిట్కాలు పాటిస్తే చాలంటున్నారు. సౌందర్య నిపుణులు మరి అవేంటో చూద్దాం..

రోజూ అన్నం వండుకుంటాం. వండే ముందు బియ్యం కడిగిన నీటిని ఒంపేయకుండా నీటిలో 2 స్పూన్ల నిమ్మరసం కలిపి ముఖానికి, చేతులకు రాసుకోవాలి. గంట పాటు అలానే ఉంచి ఆ తరువాత గోరువెచ్చని నీటిలో శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచుగా చేస్తే ముడతల చర్మం పోయి.. చర్మం మృదువుగా తయారవుతుంది.


బియ్యలోని యాంటీ ఆక్సిడెంట్స్ చర్మాన్ని అందంగా మార్చేలా చేస్తాయి. కనుక బియ్యాన్ని శుభ్రం చేసిన నీటితో ముఖానికి ప్యాక్ వేసుకోండి. పావుకప్పు బియ్యం నీటిలో 2 స్పూన్ల తేనె కలిపి చర్మానికి రాసుకోవాలి. అరగంట పాటు అలానే ఉంచి ఆ తరువాత శుభ్రం చేసుకుంటే, చర్మం కాంతివంతంగా మారుతుంది. ఈ ప్యాక్ వేసుకోవడం వలన ఎలాంటి సైడ్ ఎఫ్టెక్స్ రావంటున్నారు. అన్నం వాల్చిన గంజి కూడా తేనె కలిపి ప్యాక్‌లాగా వేసుకుంటే చర్మం బిగుతుగా మారి నునుపు తేలుతుంది.

చేతులపై ముడతలు ఇబ్బంది పెడతాయి. చేతులు ఇలా ఉన్నప్పుడు చూడడానికే బాగుండదు. అందుకు ఏం చేయాలో చూద్దాం...

బియ్యం కడిగిన నీటిలో స్పూన్ నిమ్మరసం, స్పూన్ తేనె కలిపి పేస్ట్‌లా చేసి, 20 నిమిషాల తరువాత శుభ్రం చేసుకుంటే, మంచి ఫలితాలు పొందవచ్చు. ముందున్న చర్మానికంటే, ఈ ప్యాక్ వేసుకున్న తరువాత చూస్తే తేడా మీకే కనిపిస్తుంది.



ముంగిట్లో ముగ్గు



25చుక్కలు 1వచ్చే వరకూ



15చుక్కలు 8వచ్చే వరకూ



15చుక్కలు 8వచ్చే వరకూ

కోడిగుడ్లు రిటైల్ ధర (100కు)



హైదరాబాద్	447	విజయవాడ	453
ముంబయి	497	ఢిల్లీ	485
చెన్నై	445	బెంగళూరు	445

బ్రాయిలర్ చికెన్ ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.



హైదరాబాద్	175	ఢిల్లీ	165
కరీంనగర్	170	ముంబయి	160
వరంగల్	175	చెన్నై	155

సెన్సెక్స్ +181.39
35,695



నిఫ్టీ +55.10
10,727

రూపాయి
₹69.72
(ఒక అమెరికా డాలర్‌కు)



పసిడి
32,630.00
(హైదరాబాద్‌లో) 24 క్యా..10 గ్రాములకు/(రూ.)లలో

మరోసారి సమ్మె బాటలో బ్యాంక్ ఉద్యోగులు



- **8, 9 తేదీల్లో సమ్మెకు ఏఐబీఈఏ, బీఈఎఫ్ఐ పిలుపు**

ఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగులు మరోసారి సమ్మె బాటపట్టారు. ఉద్యోగ విధానాలపై కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ 10 ట్రేడ్ యూనియన్‌లు పిలుపునిచ్చిన దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా వచ్చే వారంలో రెండు రోజుల పాటు సమ్మె చేయనున్నట్లు బ్యాంకు సంఘాలు వెల్లడించాయి. 2019 జనవరి 8, 9 తేదీల్లో దేశవ్యాప్త సమ్మెకు అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం(ఏఐబీఈఏ), భారత బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య(బీఈఎఫ్ఐ) పిలుపునిచ్చాయి. ఈ సమాచారాన్ని సదరు యూనియన్‌లు భారత బ్యాంకుల సంఘానికి(ఐబీఏ)కు అందించాయి' అని బీఎస్ఈ ఫైలింగ్ సందర్భంగా ఐడీబీఐ బ్యాంక్ పేర్కొంది. బ్యాంక్ ఆఫ్ బరోడా కూడా ఇదే విషయాన్ని వెల్లడించింది. గతేడాది డిసెంబరులోనూ బ్యాంకు ఉద్యోగులు సమ్మె చేసిన విషయం తెలిసిందే. వేతన సవరణ, పెన్షన్‌తో పాటు ఇతర సమస్యల పరిష్కారానికై అఖిల భారత బ్యాంక్ అధికారుల సంఘం (ఏఐబీఓసీ) ఇచ్చిన పిలుపు మేరకు డిసెంబరు 21న బ్యాంకుల అధికారులు విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. ఆ తర్వాత బ్యాంక్ ఆఫ్ బరోడాలో విజయా బ్యాంక్, దేనా బ్యాంక్‌ల విలీనానికి వ్యతిరేకంగా బ్యాంకు ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది డిసెంబరు 26న సమ్మె చేపట్టారు.

ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న హెచ్ఏఎల్

- ఉద్యోగుల మూడు నెలల జీతాల కోసం వెయ్యి కోట్లు అప్పు
- మార్చి నాటికి పెరగనున్న మరింత భారం



బెంగుళూరు: ప్రభుత్వ రంగ రక్షణ సంస్థ హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్) ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. దీర్ఘకాలం నుంచి ఆర్థిక ఒత్తిడికి గురవుతున్న సంస్థ తాజాగా ఉద్యోగులకు జీతాలు చెల్లించడం, తదితర అవసరాల కోసం వెయ్యి కోట్లు రూపాయలు అప్పు చేయాల్సి వచ్చింది. 20వేలకు పైగా ఉన్న ఉద్యోగులకు మూడు నెలల జీతాల చెల్లించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. గత రెండు మూడు దశాబ్దాల కాలంగా ధనవంతులుగా ఉన్న హెచ్ఏఎల్ సంస్థ మొదటిసారిగా నగదు కోసం అప్పు (ఓవర్ డ్రాఫ్ట్ ద్వారా) చేసామని హెచ్ఏఎల్ ఛైర్మన్ ఆర్ మాధవన్ వ్యాఖ్యాలని ఉటంకిస్తూ టైమ్స్ ఆఫ్ ఇండియా నివేదించింది. పుష్కలమైన ఆర్థిక నిల్వలతో ఉన్న సంస్థ తాజాగా లోటు బడ్జెట్‌లోకి జారుకుందని మాధవన్ పేర్కొన్నారు. మార్చి నాటికి ఈ నగదు ప్రతికూలత భరించలేనంత స్థాయిలో రూ. 6వేల కోట్లకు చేరుకోనుందన్నారు. ప్రధానంగా హెచ్ఏఎల్‌కు అదిపెద్ద కస్టమర్‌గా ఉన్న భారత



వైమానిక దళం చెల్లించాల్సిన బకాయిలు పేరుకుపోయిన కారణంగా ఆర్థిక ఒత్తిడికి దారి తీసినట్టు ఛైర్మన్ తెలిపారు. 2017 సెప్టెంబర్ నాటికి రూ. 14,500కోట్లుగా బకాయిల్లో కేవలం రూ. 2వేల కోట్లను మాత్రమే ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ చెల్లించింది. 2017–18 సంవత్సరానికి రక్షణ మంత్రిత్వశాఖ 13,500 కోట్ల బడ్జెట్‌ను ఆమోదించింది. 2017–18 నుంచి పెండింగ్‌లో ఉన్న బకాయిలతో కలిపి సవరించిన బడ్జెట్ 33, 715 కోట్ల రూపాయలుగా ఉంది. మరోవైపు డిసెంబరు 31 నాటికి 15,700 కోట్లు తాకిన బకాయిలు మార్చి 31 నాటికి 20,000 కోట్ల రూపాయలకు చేరవచ్చున్నారు. రూ. 14,500 కోట్లు ఐఏఎఫ్ చెల్లించాల్సి ఉండగా, మిగిలిన బకాయిలు భారతీయ సైన్యం, నావికాదళం, కోస్తా గార్డ్స్ నుంచి రావాల్సి ఉంది. ఈ పరిణామం సంస్థపై ఆధారపడిన దాదాపు 20వేల మంది సూక్ష్మ, చిన్న మధ్య తరహా వ్యాపారస్తులను ప్రభావితం చేయనుందని మాధవన్ ఆందోళన వ్యక్తం చేశారు. నగదు కొరత అప్పులు వైపు నెడుతోందనీ, లేదంటే బకాయిలు చెల్లించమని ఎంఎస్ఎఈలను బలవంతం చేయాలి. ఇది వారిని తీవ్రంగా ప్రభావితం చేస్తుందని చెప్పారు. కాగా మొత్తం ఉద్యోగుల సంఖ్య 29,035. వీరికి చెల్లించే నెలవారీ జీతాల మొత్తం రూ.358 కోట్లు.

పీఎన్‌బీ కుంభకోణం ఓ సివిల్ ట్రాన్సాక్షన్



- **నేను ఏ తప్పూచేయలేదు: నీరవ్ మోడీ**

ఢిల్లీ: బ్యాంకింగ్ రంగంలోనే సంచలనం సృష్టించిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ రూ.13వేల కోట్ల కుంభకోణంలో ప్రధాన నిందితుడిగా ఉన్న నీరవ్ మోడీ తాను ఏ తప్పూ చేయలేదని అంటున్నారు. నీరవ్‌కు పారిపోయిన ఆర్థిక నేరగాడి ట్యాగ్ ఇవ్వాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) పీఎంఎల్ఏ కోర్టులో వేసిన పిటిషన్‌కు ఆయన సమాధానమిచ్చారు. దీనికి సంబంధించిన పిటిషన్ విచారణ శనివారం చేపట్టగా నీరవ్ ఈ విధంగా స్పందించారు.

నేను ఏ తప్పూ చేయలేదు. పీఎన్‌బీ కుంభకోణం ఓ సివిల్ ట్రాన్సాక్షన్. అదంతా ఓ తప్పుల తడక. భద్రతా పరమైన కారణాల వల్లే నేను భారత్ తిరిగి రాలేకపోతున్నాను' అని నీరవ్ సమాధానమిచ్చారు. పీఎన్‌బీ కుంభకోణంలో నిందితుడిగా ఉన్న నీరవ్‌పై ఇప్పటికే ఇంటర్‌పోల్ అధికారులు రెడ్ కార్నర్ నోటీసులను జారీ చేశారు. అతడిని భారత్ తిరిగి రప్పించేందుకు ఈడీ, సీబీఐ అధికారులు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. నీరవ్ బ్రిటన్‌లోనే తలదాచుకుంటున్నట్లు ఆ దేశ వర్గాలు ఇటీవల భారత్ ప్రభుత్వ అధికారులకు తెలియజేశారు.నీరవ్‌తో పాటు మరో నిందితుడైన మోహుల్ ఛోక్సీని భారత్ రప్పించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించిన ఈడీ అధికారులు ఛోక్సీ గీతాంజలి గ్రూప్‌కు చెందిన ఓ ఫ్యాక్టరీని జప్తు చేసింది. రూ.13కోట్లకు పైగా విలువైన ఈ కర్మాగారం థాయలాండ్‌లో ఉంది. ఈ కేసులో ఇప్పటి వరకూ రూ.4,765కోట్ల విలువైన ఆస్తులను ఈడీ జప్తు చేసింది.

పరార్ అయిన నేరస్థుడిగానే మాల్యా..

- ఈడీ పిటిషన్‌పై తీర్పు వెలువరించిన పీఎంఎల్ఏ కోర్ట్

ముంబయి: బ్యాంకులకు సుమారు రూ.9వేల కోట్ల మేర రుణాలు ఎగ్గొట్టి లండన్‌లో తలదాచుకుంటున్న విజయ్ మాల్యాను 'పారిపోయిన ఆర్థిక నేరగాడి'గా ప్రకటించారు. ముంబయిలోని పీఎంఎల్ఏ ప్రత్యేక న్యాయస్థానం శనివారం ఈ మేరకు తీర్పునిచ్చింది. పలాయనంలో ఉన్న ఆర్థిక నేరగాళ్ల చట్టం 2018 ప్రకారం మాల్యాకు పారిపోయిన ఆర్థిక నేరగాడి ట్యాగ్ ఇవ్వాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పీఎంఎల్ఏ న్యాయస్థానంలో గతంలో పిటిషన్ వేసింది. ఈ పిటిషన్ విచారించిన న్యాయస్థానం ఈడీకి అనుకూలంగా తీర్పునిచ్చింది. దీంతో పాటు ఈడీ అభ్యర్థనపై స్టే విధించాల్సిందిగా మాల్యా గతంలో వేసిన పిటిషన్‌ను పీఎంఎల్ఏ న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ తీర్పుతో మాల్యాకు సంబంధించిన ఆస్తులన్నీ ఇక ప్రభుత్వం జప్తు చేసుకోవచ్చు. ఈ చట్టం కింద న్యాయస్థానం ప్రకటించిన తొలి పారిపోయిన ఆర్థిక నేరగాడు మాల్యానే కావడం గమనార్హం.

తాను పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడిని కాదంటూ గత నెల మాల్యా సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. అక్కడ ఎదురుదెబ్బే తగిలింది. పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడిగా ప్రకటించేందుకు ఈడీ ప్రారంభించిన విచారణ ప్రక్రియపై స్టే విధించాలంటూ మాల్యా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన న్యాయస్థానం అందుకు నిరాకరించింది. బ్యాంకులకు రుణాలు ఎగ్గొట్టిన మాల్యాను భారత్‌కు అప్పగించాల్సిందిగా లండన్‌లోని వెస్ట్‌మినిస్టర్ న్యాయస్థానం గత నెల తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. మాల్యాపై తప్పుడు కేసులు పెట్టినట్లు ఎలాంటి ఆధారాలు కనిపించలేదని, అందువల్ల భారత్‌లోని కోర్టులకు మాల్యా సమాధానం చెప్పాలని లండన్ వెస్ట్‌మినిస్టర్ కోర్టు చీఫ్ మేజిస్ట్రేట్ జడ్జి ఎమ్మా ఆర్బత్నాట్ వ్యాఖ్యానించారు. మాల్యా కోసం ముంబయిలోని ఆర్థర్ రోడ్ జైలును సిద్ధం చేశారు. బ్రిటన్ నుంచి తీసుకొచ్చిన అనంతరం మాల్యాను ఇక్కడే ఉంచనున్నారు. ఇదిలా ఉంటే భారతీయ బ్యాంకులకు రుణాలను చెల్లిస్తానంటూ మాల్యా ఇటీవల ప్రకటించారు. ఈ డబ్బును తీసుకోవాలంటూ బ్యాంకులను, ప్రభుత్వాన్ని కోరారు.



స్పోర్ట్స్

మహారాష్ట్ర ఓపెన్ టైటిల్ విజేత రోహన్, బోపన్న జోడీ

- ఫైనల్‌లో ఇంగ్లాండ్‌పై 6–3,6–4 తేడాతో ఘనవిజయం
- మొదటి ఏటీపీ టు టైటిల్‌ను గెలిచిన బోపన్న,శరణ్ ద్వయం



పూణే: టాటా ఓపెన్ మహారాష్ట్ర టైటిల్‌ను భారత టెన్నిస్ మెన్స్ డబుల్స్ క్రీడాకారులు రోహన్ బోపన్న, దివీ శరణ్‌లు తమ కెరీర్‌లో మొదటి ఏటీపీ టూర్ టైటిల్‌ను చేజిక్కించుకున్నారు. ఇంగ్లాడ్ ఆటగాళ్లు లూక్ బాంబ్రిడ్జ్, జానీ ఓ మారా జోడీపై వరుస సెట్లలో మట్టికరిపించి టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. మొదటి నుంచి ఇంగ్లాండ్ పై ఆధిపత్యం చెలాయించిన బోపన్న జోడీ 6–3,6–4 తేడాతో బ్రిటీష్ జోడీపై ఘనవిజయం సాధించారు. దీంతో రోహన్ బోపన్న తన కెరీర్‌లో 18వ ఏటీపీ టూర్ టైటిల్‌ను సాధించగా శరణ్ తన కెరీర్‌లో 4వ టైటిల్‌ను తన ఖాతాలో వేసుకున్నారు. ఈ జోడీకి భారతగడ్డపై సాధించిన తొలి విజయం.

నేషనల్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్ షిప్



- క్వార్టర్ ఫైనల్‌కు చేరిన తెలంగాణ మహిళా జట్టు

కటక్: 80వ సీనియర్ నేషనల్ మరియు ఇంటర్ డిస్ట్రిక్ట్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్ షిప్‌లో తెలంగాణ మహిళా జట్టు తన జోరును కొనసాగిస్తోంది. టేబుల్ టెన్నిస్ ఆఫ్ ఇండియా ఆద్వర్యంలో ఒడిస్సా లో జరుగుతున్న ఈ మెగా ఛాంపియన్ షిప్‌లో తెలంగాణ జట్టు క్వార్టర్స్ లోకి దూసుకెళ్లింది.

హర్యానా తో జరిగిన మ్యాచ్‌లో 3–1 తేడాతో ఘనవిజయం సాధించడంతో గ్రూప్ స్టేజ్‌లో అగ్రస్థానంలో నిలిచింది. హర్యానా జట్టులో నేషనల్ ఛాంపియన్ సుతీర్థ ముఖర్జీ పోరాడినా పలితంలేక పోయింది. ఇక ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌లో తెలంగాణ జట్టు ఆంధ్ర ప్రదేశ్‌ను 3–0తో ఓడించింది.

మూడో రోజూ మనదే

- సిడ్నీ టెస్ట్‌లో పట్టు సాధించిన కోహ్లీ సేన
- ఆసీస్ 236/6
- మూడు వికెట్లతో చెలరేగిన కుల్‌దీప్ యాదవ్
- క్రీజులో పాట్ కమిన్స్, హ్యాండ్ స్కోంబ్



సిడ్నీ : టీమిండియా–ఆసీస్‌ల మధ్య జరుగుతున్న చివరి టెస్టు మూడో రోజు ఆట ముగిసింది. సిడ్నీలో భారీ వర్షం, వెలుతురు లేమి కారణంగా మ్యాచ్‌ను నిలిపేశారు. దీంతో ఆట ముగిసే సమయానికి ఆసీస్ 236/6 పరుగులు చేసింది. మూడో రోజు మ్యాచ్‌లో టీమిండియా బౌలర్లు విజృంభించడంతో తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ తడబడుతోంది. ఆరు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. దీంతో మూడో రోజు ఆటలో టీమిండియా పైచేయి సాధించింది. ప్రస్తుతం క్రీజులో పాట్ కమిన్స్(25), హ్యాండ్ స్కోంబ్(28) ఉన్నారు. కుల్దీప్ మూడు వికెట్లు, జడేజా రెండు, షమీ ఒక వికెట్ తీశారు. మూడో రోజు ఆటలో భాగంగా 24/0 ఓవర్ నైట్ స్కోరుతో మ్యాచ్ ప్రారంభించిన ఆసీస్ ఆదిలోనే వికెట్ కోల్పోయింది. బౌండరీలు బాదుతూ దూకుడు మీదున్న ఆసీస్ ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా(27)ను కుల్దీప్ పెవిలియన్ చేర్చాడు. దీంతో ఆసీస్ తొలి వికెట్ కోల్పోయింది. తర్వాత క్రీజులో నిలదొక్కుకున్న ఆసీస్ బ్యాట్స్‌మెన్ ఆచితూచి ఆడారు. లంచ్ విరామం వరకు వికెట్ కోల్పోకుండా పైన్ సేన చాలా జాగ్రత్తగా ఆడింది. ఆ తర్వాత జడేజా ఆసీస్ దూకుడుకు కళ్లెం వేశాడు. ఆరంభం నుంచి క్రీజులో పాతుకుపోయి శతకం బాదేలా కనిపించిన మార్కస్ హారిస్(79)ను జడేజా ఔట్ చేశాడు. తర్వాత కూడా జడేజా తన దూకుడు కొనసాగించాడు. మూడో వికెట్ పడగొట్టడానికి ఎంతో సమయం తీసుకోలేదు. 49వ ఓవర్‌లో జడేజా వేసిన బంతిని షాన్ మార్ష్(8) భారీ షాట్ కొట్టి రహానే చేతికి క్యాచ్ ఇచ్చాడు. అత్యంత ప్రమాదకర బ్యాట్స్‌మెన్ మార్ష్ కూడా పెవిలియన్ బాట పట్టడంతో ఆసీస్ మీద మరింత ఒత్తిడి పెరిగింది. కాసేపటికే లబుషేన్(38) కూడా ఔటయ్యాడు. దీంతో ఆసీస్ టాప్ ఆర్డర్ కుదేలైంది.



కుల్దీప్ యాదవ్ స్పిన్ మాయ

తుది జట్టులో స్థానం దక్కించుకున్న కుల్దీప్.. ఆసీస్‌పై విరుచుకుపడ్డాడు. ట్రావిస్ హెడ్, టిమ్‌పైన్ వంటి కీలక వికెట్లు పడగొట్టాడు. కాసేపు నిలకడగా ఆడినట్లు కనిపించిన ట్రావిస్ హెడ్(20)ను కుల్దీప్ పెవిలియన్ చేర్చాడు. అప్పటికి ఆసీస్ 192 పరుగులు చేసింది. బ్యాటింగ్‌కు దిగిన వెంటనే బౌండరీ బాదిన ఆసీస్ సారథి వికెట్ సైతం కుల్దీపే పడగొట్టాడు. 69ఓవర్‌లో కుల్దీప్ వేసిన బంతికి టిమ్‌పైన్(5) బౌల్డ్ అయ్యాడు. దీంతో ఆసీస్ టాప్ ఆర్డర్‌తో పాటు మిడిలార్డర్ కూడా దెబ్బతింది. కాసేపటికే వర్షం, వెలుతురు లేమి కారణంగా మ్యాచ్‌ను కొంతసేపటి వరకు నిలిపి వేశారు. తర్వాత భారీ వర్షం కురవడంతో మూడో రోజు మ్యాచ్‌ను 84 ఓవర్లకే ముగించారు. ప్రస్తుతం పైన్ సేన ఆరు వికెట్లు కోల్పోయి 236 పరుగులు చేసింది. టీమిండియా 386 పరుగుల ఆధిక్యంలో ఉంది.

ముందు ఆటపై దృష్టిపెట్టు

- షూటర్ మనుబాకర్‌పై హర్యానా క్రీడాశాఖా మంత్రి అసంతృప్తి



ఛండీఘడ్: కామన్వెల్త్ క్రీడల్లో స్వర్ణం సాధించడంతో పాటు పలు అంతర్జాతీయ ఈవెంట్లలో పతకాల పంట పండించిన హర్యానా యువ షూటర్ మను బాకర్ తీరును ఆ రాష్ట్ర క్రీడా శాఖా మంత్రి అనిల్ విజు విమర్శించారు. కామన్వెల్త్ క్రీడల్లో పసిడి సొంతం చేసుకున్న మనుకు ప్రభుత్వం రెండు కోట్ల రూపాయల నజరానా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇప్పటిదాకా తనకు ఎలాంటి ఆర్థిక సాయం అందలేదని పేర్కొంటూ 'మీరు ప్రకటించిన నజరానా నిజమా లేదా అంతా ఉత్తిదేనా' అంటూ ఆమె ట్విటర్ వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో మను బాకర్ ట్వీట్‌కు స్పందించిన అనిల్ విజు 'ఈ విషయమై సోషల్ మీడియాలో ప్రస్తావించే ముందు మను బాకర్ మొదట క్రీడాశాఖను సంప్రదించాల్సింది. దేశంలోని మిగతా రాష్ట్రాలతో పోలిస్తే క్రీడాకారులకు అత్యధిక అవార్డులు అందిస్తున్న రాష్ట్రం హర్యానా అని ట్విట్టర్ వేదికగా పేర్కొన్నారు. నేను ట్వీట్ చేసినట్లుగానే నోటిఫికేషన్ వచ్చిన వెంటనే ఆమెకు రూ.2 కోట్లు అందజేస్తాం. ఆటగాళ్లకు కాస్త క్రమశిక్షణ అవసరం. ఇలా వివాదం సృష్టించినందుకు ఆమె చింతించాలి. తనకు ఇంకా చాలా భవిష్యత్తు ఉంది. ఇవన్నీ మాని 'ఆటపై దృష్టిపెడితే బాగుంటుంది' అని హితవు పలికారు.



స్కూల్ ఇండియా కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ – 2019

- సెమీస్‌లో గోల్కొండ హై స్కూల్

విజయక్రాంతి, హైదరాబాద్: పాఠశాలలో క్రీడలను అభివృద్ధి చేసే విషయంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కూల్ ఆఫ్ ఇండియా ఫుట్‌బాల్ టోర్నమెంటులో గోల్కొండ ప్రభుత్వ పాఠశాల సెమీఫైనల్‌లోకి దూసుకెళ్లింది. మొదటి క్వార్టర్ ఫైనల్స్‌లో గ్రీన్‌విచ్ అకాడమీ గోల్కొండ ప్రభుత్వ పాఠశాల మధ్య జరిగిన మ్యాచ్‌లో గోల్కొండ జట్టు గ్రీన్‌విచ్ అకాడమీ జట్టుపై 3–1 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. ఆట ఆరంభంలో గ్రీన్‌విచ్ అకాడమీ స్కూల్ మొదటి అర్ధభాగం ఏడవ నిమిషంలో మహ్మద్ అసదుల్లా ఇచ్చిన పాస్‌ను మహ్మద్ హజ్మా ఇబ్రహీం అద్భుతంగా గోల్‌చేసి జట్టును లీడ్‌లోకి తీసుకెళ్లారు. గోల్కొండ స్కూల్ ఫస్ట్ సెషన్‌లో గోల్ చేయలేకపోయింది. అయితే సెకండ్ హాఫ్‌లో అద్భుతంగా బౌన్స్ బాక్ అయ్యి 15 నిమిషాల వ్యవధిలో 3 గోల్స్ చేసి గ్రీన్‌విచ్ అకాడమీ స్కూల్‌ను కోలుకోలేని దెబ్బతీసింది. గోల్కొండ స్ట్రైకర్ షేక్‌అలీ రెండు గోల్స్ చేసి గోల్కొండ జట్టుకు ఆధిక్యాన్ని అందించారు. తర్వాత సయ్యద్ ఇంతియాజ్ మరొక గోల్‌చేసి జట్టును మరింత ఆధిక్యంలోకి తీసుకెళ్లారు. దీంతో మ్యాచ్ ముగిసే సమయానికి గోల్కొండ జట్టు 3–1 తేడాతో గ్రీన్‌విచ్ అకాడమీ స్కూల్‌పై ఘనవిజయం సాధించి సెమీఫైనల్‌లోకి దూసుకెళ్లింది. గోల్కొండ స్కూల్‌కు చెందిన షేక్‌అలీకి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.



బాక్సింగ్ ఛాంపియన్ షిప్ ఫైనల్‌లో నిఖత్ జరీన్



బళ్లారి: కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారిలో జరుగుతున్న మూడవ మహిళల ఎలైట్ జాతీయ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణకు చెందిన స్టార్ మహిళా బాక్సర్ ఫైనల్‌కు చేరింది. 51 కేజీల విభాగంలో మణిపూర్‌కు చెందిన ఆల్ ఇండియా పోలీస్ బాక్సర్ వాన్‌లల్ దుతిపై 5–0 నిఖత్ జరీన్ పంచ్‌ల వర్షం కురిపించి ఘనవిజయం సాధించింది. నేడు హర్యానాకు చెందిన పింకీ రాణి తో ఫైనల్‌లో తలపడనుంది. ఇటీవలి కాలంలో మంచి ఫామ్‌లో ఉన్న నిఖత్ జరీన్ నేషనల్ ఛాంపియన్ షిప్‌లో ఫైనల్‌కు చేరుకోవడంతో వచ్చే జాతీయ పోటీలలో కూడా మరింతగా రాణిస్తుందని నిఖత్ తల్లిదండ్రులు తెలిపారు. గత రెండేళ్ల నుంచి అనేక మంది కోచ్‌ల పర్యవేక్షణలో తన ఫిట్‌నెస్‌ను మెరుగు పర్చుకున్న నిఖత్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడమే లక్ష్యంగా కఠోరంగా శ్రమిస్తుంది. బాక్సింగ్‌లో మేరికోమ్‌ను ఆదర్శంగా తీసుకుని నిఖత్ జరీన్ బాక్సింగ్‌లోకి ప్రవేశించింది.

Printed and Published By Chilappagari Laxmi Rajam, on behalf of Intercontinental Publications Private Limited, Printed at Intercontinental Publications Private Limited, Survey No .713/P, Dundigal Grama Panchayat, Qutubullapur Mandal, Medchal – Malkajgiri District 500043, Published at Plot No. 1267/A, Road No. 63/A, Jubilee Hills, HYDERABAD–500033, Telangana State. Editor: Chilappagari Laxmi Rajam, RNI NO: TELTEL /2018/75203, Ph: +91 40 2355 6603, Fax No. +91 4023556604, Toll Free: 1800 599 3399.